DATE: 13-09-2022 RNI NO : TELTEL/2021/81092

# ప్రజా మంటలు

తెలుగు జాతీయ దినపత్రిక

ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

prajamantalu.com

సంపుటి(Volume) : 3
సంచిక(Issue) : 140

పేజీలు - 08
వెల: రూ 5/-

మంగళవారం 13 సెప్టెంబర్, 2022

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,



కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అధికారిక గీతంగా జయజహే !

5లో



అసెంబ్లీ వేదికగా కేసీఆర్ అబద్ధాలు
విద్యుత్ బిల్లుపై చర్చ కాదు.. పెంచిన ఛార్జీలపై చర్చించాలి

5లో

## భారీ అగ్నిప్రమాదం

- సికింద్రాబాద్ ఎలక్ట్రిక్ బైక్ షోరూంలో అగ్నిప్రమాదం
- పేలిన ఎలక్ట్రిక్ బైక్ బ్యాటరీలు
- పైనే ఉన్న రూబీ లాడ్జిపైకి ఎగిసిపడ్డ మంటలు
- ఏడుగురు మృతి.. పలువురికి గాయాలు

హైదరాబాద్,సెప్టెంబర్12: ఇప్పటివరకు మనం ఎలక్ట్రిక్ బైకులే కాలిపోవడం విన్నాం.. కానీ తొలిసారిగా ఎలక్ట్రిక్ బైక్ షోరూంలోనే అగ్నిప్రమాదం సంభవించింది. సోమవారం రాత్రి సికింద్రాబాద్‌లోని ఓ ఎలక్ట్రిక్ బైక్ షోరూంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. రూబీ హోటల్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న బైక్ షోరూంలో ఒక్కసారిగా మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయి. దీంతో రూబీ లాడ్జీపైకి మంటలు ఎగిసిపడ్డాయి. ఈ ఘటనలో ఏడుగురు మృతి చెడగా పలువురు గాయపడ్డారు. హోటల్‌లో కొందరు టూరిస్టులు చిక్కుకున్నట్లు తెలుస్తోంది.
దీంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని హోటల్‌లో చిక్కుకుపోయిన వారిని కిందకు దించుతున్నారు. బైక్ బ్యాటరీలు పేలుతుండటంతో షోరూం నుంచి భారీ శబ్దం వస్తోంది. అటు మంటలను అదుపులోకి తెచ్చేందుకు అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైరింజన్ల సహాయంతో ప్రయత్నిస్తున్నారు. లాడ్జిలో దట్టంగా పొగలు అలుముకోవడంతో లోపలి వారు చాలా ఇబ్బంది పడుతున్నట్లు తెలుస్తోంది. కాగా ఈ ప్రమాదంలో చాలా ఎలక్ట్రిక్ బైకులు కూడా అగ్నికి ఆహుతయ్యాయి. ఆస్తి నష్టం వివరాలు తెలియాల్సి ఉంది.



# కేంద్రం ప్రతిపాదించే విద్యుత్ బిల్లును అంగీకరించం



- ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకుని తీరుతాం
- విద్యుత్ సంస్కరణల పేరుతో దోపిడీ యత్నాలు
- మోడీ ఫాసిస్టు విధానాలతో రైతులకు తీరని నష్టం
- విభజన చట్టంలో తెలంగాణకు అనేక విధాలుగా నష్టం
- సీలేరు విద్యుత్ ప్రాజెక్టును ఏకపక్షంగా ఎపికి అప్పగించారు
- అన్యాయంగా ఏడు మండలాలను కూడా అప్పచెప్పారు
- మోటర్లకు మీటర్లు పెట్టాలని విద్యుత్ బిల్లులో ఉంది
- అసెంబ్లీలో స్వల్పకాలిక చర్చపై సీఎం కేసీఆర్
- ఆర్టీసీని కూడా అమ్మేయాలని బెదిరింపులు
- మేం అమ్ముతన్నాం.. మీరూ అమ్మండనే విధానం
- మోడీ సర్కార్ తీరును ఏకి పారేసిన సీఎం కేసీఆర్
- తెలంగాణ వ్యవసాయం విద్యుత్‌పైనే ఆధారపడింది
- మండలిలో మంత్రి జగదీశ్వర్ రెడ్డి
- ఫెడరల్ స్ఫూర్తికి కేంద్రం విద్యుత్ బిల్లు
- విద్యుత్ బిల్లును రాష్ట్రంపై రుద్దడం సరికాదు
- డబుల్ ఇంజిన్ పేరుతో కేంద్రం డ్రామాలు ఆడుతోంది
- అసెంబ్లీలో విద్యుత్ చర్చపై భట్టి విక్రమార్క
- మోటర్లకు మీటర్లు పెట్టాలని కేంద్రం చెప్పలేదు
- అసెంబ్లీలో చర్చలో బిజెపి ఎమ్మెల్యే రఘునందన్ రావు
- ఉభయసభలు నేటికి వాయిదా

హైదరాబాద్,12: ఎట్టి పరిస్తితుల్లోనూ కేంద్రం ప్రతిపాదించే విద్యుత్ బిల్లును అంగీకరించే ప్రసక్తే లేదని సిఎం కెసిఆర్ స్పష్టం చేశారు. విద్యుత్ సంస్కరణల పేరుతో చేస్తున్న దోపిడీ యత్నాలను అడ్డుకుని తీరుతామన్నారు. విద్యుత్ చట్టంపై కేంద్రం పెత్తనం ఏమిటని కేసీఆర్ ప్రశ్నించారు.దేశ రైతాంగాన్ని సంఘటితం చేసి, కేంద్రంపై పోరాడుతామన్నారు. మోడీని తప్పించి దేశంలో రైతాంగ ప్రభుత్వాన్ని స్థాపిస్తామని అన్నారు. అలాగే కేంద్రం దోపిడీ విధానాలను సహించే ప్రసక్తే లేదన్నారు. విద్యుత్ బిల్లుపై తెలంగాణ అసెంబ్లీ స్వల్పకాలిక చర్చ చేపట్టింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు మాట్లాడుతూ.. మోదీ మోస్ట్ ఫాసిస్ట్ ప్రధాని అని ఆనాడే చెప్పానని కేసీఆర్ విమర్శలు గుప్పించారు. రాష్ట్రాలు ఎంత విద్యుత్ వినియోగిస్తున్నా యనేది ప్రగతి సూచికలో ముఖ్యమైనదని చెప్పుకొచ్చారు. మోటర్లకు మీటర్లు పెట్టాలని కేంద్ర విద్యుత్ బిల్లులో ఉందని సీఎం కేసీఆర్ అన్నారు. కేంద్రం మీటర్లు పెడితే 98 లక్షల కుటుంబాలపై భారం పడుతుందని చెప్పారు. రాష్ట్రాలతో సంప్రదింపులు జరపకుండా, వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా

మిగతా 2లో..

## టీఎస్‌పీఎస్‌సీ నుంచి మరో నోటిఫికేషన్

### 833 ఖాళీలకు నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్,సెప్టెంబర్12: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మరో జాబ్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇంజనీరింగ్ సర్వీసెస్‌లో అసిస్టెంట్ ఇంజనీర్, మునిసిపల్ అసిస్టెంట్ ఇంజనీర్, టెక్నికల్ ఆఫీసర్ పోస్టుల్ని భర్తీ చేయనుంది. మొత్తం 833 ఖాళీలు ఉన్నాయి. ఈ పోస్టులకు 2022 సెప్టెంబర్ 28న దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం కానుంది. అప్లై చేయడానికి 2022 అక్టోబర్ 21

మిగతా 2లో..

## వారణాసి జిల్లా కోర్టు కీలక నిర్ణయం

- హిందువుల పిటిషన్‌పై విచారణకు అంగీకారం
- తదుపరి విచారణ 22కు వాయిదా వేసిన కోర్టు
- తీర్పు సందర్భంగా 144 సెక్షన్ అమలు



వారణాసి,సెప్టెంబర్12: జ్ఞానవాపి మసీదు కేసులో వారణాసి జిల్లా కోర్టు సోమవారం కీలక ఆదేశాలను వెలువరించింది. మసీదులోని

మిగతా 2లో..

## తెలంగాణలో కేసీఆర్ చెల్లని రూపాయి

జాతీయపార్టీ పెడతామనడం ఈ దశాబ్దపు జోక్

వచ్చే ఎన్నికల్లో తెరాసకు ఒక్క ఎంపీ సీటుకూడా రాదు

కేసీఆర్ తీరుపై మండిపడ్డ మంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్,సెప్టెంబర్12: తెలంగాణలో చెల్లని రూపాయి దేశంలో చెల్లుతుందా? అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి.. ముఖ్యమంత్రి కేసీఆర్‌పై విరుచుకుపడ్డారు. జాతీయ పార్టీ పెడతామనటం ఈ దశాబ్దంలో పెద్ద జోక్ అని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో తెరాసకు ఒక్క ఎంపీ సీటు కూడా రాదని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి మరోసారి వ్యంగ్యాస్త్రాలు వదిలారు. కేసీఆర్ జాతీయ పార్టీ పెడతామనటం

మిగతా 5లో..

## పశువులలో లంపి స్కిన్ డిసీజ్ కట్టడి

- వైరల్ ఇన్ఫెక్షన్‌కు స్వదేశీ వ్యాక్సిన్
- కీలక ప్రకటన చేసిన ప్రధాని మోడీ




న్యూఢిల్లీ,సెప్టెంబర్12: పశువులలో లంపి స్కిన్ డిసీజ్ కట్టడికి రాష్ట్రాలతో పాటు కేంద్రం అన్ని ప్రయత్నాలు చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. ఈ వైరల్ ఇన్ఫెక్షన్‌కు స్వదేశీ వ్యాక్సిన్‌ను భారతీయ శాస్త్రవేత్తలు సిద్ధం చేశారని ప్రధాని పేర్కొన్నారు. లంపి స్కిన్ డిసీజ్ కట్టడికి

మిగతా 2లో..

## ముగిసిన కృష్ణం రాజు అంత్యక్రియలు

ప్రభుత్వ లాంఛనాల మధ్య పోలీసుల గన్‌శాల్యూట్


వెంకయ్య తదితరుల ఘననివాళి



హైదరాబాద్,సెప్టెంబర్12: సినీ దిగ్గజం, రెబల్‌స్టార్ కృష్ణంరాజు అంత్యక్రియలు మొయినాబాద్ మండలం కనకమామిడిలోని వ్యవసాయ క్షేత్రంలో ప్రభుత్వ లాంఛనాలతో జరిగాయి. పార్థివదేహాన్ని కడసారి చూసేందుకు వందలమంది అభిమానులు, చలనచిత్ర ప్రముఖులు తరలివచ్చారు. కృష్ణంరాజు భౌతికకాయానికి కన్నీటి నివాళి అర్పించారు.


మిగతా 2లో..

## ప్రజానాడి




# 115 ఏళ్ల రికార్డు బద్దలు

- తెలంగాణలో మళ్లీ దంచికొడుతున్న వర్షాలు
- సెప్టెంబర్‌లోనూ కుండపోత వర్షాలు
- గోదావరికి మరోమారు ప్రమాద హెచ్చరిక
- భారీగా వస్తున్న వరదప్రవాహంతో అప్రమత్తం
- భారీవర్షాల నేపథ్యంలో కలెక్టర్ల అప్రమత్తం



హైదరాబాద్,సెప్టెంబరు12: తెలంగాణలో వర్షాలు మళ్లీ దంచికొడుతున్నాయి.. మునుపెన్నడూ లేని విధంగా కనీవినీ ఎరుగని రీతిలో అన్నట్టుగా.. ఇప్పుడు దాదాపు 115 ఏళ్ల రికార్డును కూడా బద్దలు కొట్టేశాయి.. జులై, ఆగస్టుతో పాటు సెప్టెంబర్‌లోనూ కుండపోత వర్షాలు కురుస్తున్నాయి.. జులై నెలలో కురిసిన వర్షాలకు ఊళ్లకు ఊళ్లే కొన్ని వారాల పాటు వరద ముంపునకు గురికాగా.. పూర్తిస్థాయిలో

మిగతా 5లో..

# కేంద్రం ప్రతిపాదించే విద్యుత్ బిల్లును
# అంగీకరించం

మొదటిపేజీ తరువాయి..

విద్యుత్ సవరణ బిల్లును తెచ్చారని ఆరోపించారు. పార్లమెంట్ లో ప్రతిపక్షాలు ఏమైనా మాట్లాడటానికి ప్రయత్నిస్తే వారి నోరు నొక్కడానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. రైతుల మోటర్లకు మీటర్లు పెట్టాలని కేంద్రం ప్రయత్ని స్తోందని విమర్శించారు. విద్యుత్ బిల్లుపై బీజేపీ ఎమ్మెల్యే అసత్యాలు చెప్పారన్న సీఎం... ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ లేకుంటే కనెక్షన్ కట్ చేయాలని విద్యుత్ బిల్లులో ఉందన్నారు. విద్యుత్ బిల్లును అమలు చేస్తేనే ఎఫ్ఆర్ బీఎం పరిధి పెంచుతామని కేంద్రం చెబుతోందన్నారు. మోడీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని కాలరాస్తోందన్న సీఎం... ఇష్టమొచ్చినట్లు చట్టాలు తెస్తూ రాష్ట్రాలు అమలు చేయాలని అంటోందని విమర్శించారు. కాని రాష్ట్ర సర్కారు విద్యుత్ రంగంలో



ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిందని సీఎం కేసీఆర్ తెలిపారు. 24 గంటల కరెంట్ ఇచ్చిన రాష్ట్రం దేశంలో తెలంగాణ తప్ప మరొకటి లేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కరెంట్ వెతలు ఎలా ఉండేవో ప్రతి ఒక్కరికి తెలుసుని సీఎం కేసీఆర్ అన్నారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుందని, ఈ క్రమంలోనే అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ సింగరేణి కాలరీస్ లో రాష్ట్ర ప్రభుత్వానికి హక్కు కల్పించారన్నారు. అలాగే సీలేర్ పవర్ ప్రాజెక్ట్ ను రాష్ట్రానికి కేటాయించారని అన్నారు. కానీ మోడి అధికారంలోకి వచ్చాక... తన ఫస్ట్ కేబినెట్ మీటింగ్ లనే రాష్ట్ర మండలాలను లాక్కున్నారని ఫైర్ అయ్యారు. కనీసం సీలేర్ పవర్ ప్రాజెక్ట్ నైనా ఇస్తారనుకుంటే అది ఇవ్వలేదన్నారు. విద్యుత్ బిల్లుతో 20 లక్షల ఉద్యోగులు ఆగమైతరని అన్నారు. లక్షల కోట్ల రూపాయల ఆస్తులున్న విద్యుత్ రంగాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పేందుకు కేంద్ర కుట్రలు పన్నుతోందన్నారు. దీంతో దేశవ్యాప్తంగా మొత్తం 20 లక్షల మంది తమ ఉద్యోగులను కోల్పోతారని చెప్పారు. విభజన చట్టంలో తమకు రావాల్సిన 40 వేల మెగా వాట్ల విద్యుత్‌ను ఇవ్వాలని కోరారు. మెడికల్ కాలేజీలు, నవోదయ విద్యాలయాలు అడిగితే ఇవ్వలేదనన్నారు. ఏపీ నుంచి తెలంగాణకు రూ.17 వేల కోట్లు రావాలని.. ఆ డబ్బులను కేంద్రం ఇప్పించాలని డిమాండ్ చేశారు. విదేశీ బొగ్గు కొనకపోతే ఎన్టీపీసీ నుంచి కరెంట్ ఆపేస్తామని బెదిరిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్రం విద్యుత్ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నియంత పోకడలను మానుకొని ప్రజాస్వామ్యంగా వ్యవహరించాలని కేంద్రానికి సూచించారు. విభజన చట్టంలోని అనేక అంశాల్లో తెలంగాణ కు అన్యాయం జరిగిందన్నారు. మోదీ ప్రభుత్వం తొలి కేబినెట్‌లోనే తెలంగాణ గొంతు నులిమిందని కేసీఆర్ ధ్వజమెత్తారు. సీలేరు పవర్ ప్రాజెక్ట్ సహా మండలాలను లాక్కున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వాలకు సంప్రదించకుండా ఇష్టమొచ్చినట్లు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష సభ్యులపై మూకదాడులు చేస్తున్నారని, ఎదుటివారు చెబితే వినే సంస్కారం లేకుండా వ్యవహరిస్తు న్నారని దుయ్యబట్టారు. విద్యుత్ సంస్కరణలు అనే ముసుగులో.. రైతులను దోచుకునే ప్రయత్నం ప్రధాని చేస్తున్నారని సీఎం కేసీఆర్ మోదీపై ఫైర్ అయ్యారు. అంబేద్కర్ తీసుకువచ్చిన రాజ్యాంగ స్ఫూర్తిని మోదీ ప్రభుత్వం రోజుకింత కాలరాస్తుందని సీఎం కేసీఆర్ ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావు బీజేపీ తీసుకువచ్చిన విద్యుత్ సంస్కరణల్లో ఎక్కడా వ్యవసాయానికి ఉచిత కరెంటు ఇవ్వొద్దని చెప్పలేదని పేర్కొన్నారు. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి తీవ్రంగా స్పందించారు. రఘునందన్‌రావు సభను తప్పదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా కేంద్రం విధానాలను సీఎం కేసీఆర్ తూర్పారబట్టారు. ఆధునిక ప్రపంచంలో యావత్ ప్రపంచం కూడా ఆయా దేశాలు, నాగరిక ప్రపంచం ఆవిష్కరించేటటువంటి అభివృద్ధి అనేక కొలమానాల ద్వారా చూస్తారు. అందులో ప్రధానసూచిన పర్ క్యాపిటా, పవర్ యుటిలైజేషన్. ఏ దేశం, ఏ రాష్ట్రంలో ఎంత పవర్ యూజ్ చేస్తున్నరు? అది చాలా ముఖ్యమైన సూచికల్లో భాగంగా ఆధునిక ప్రపంచ పరిగణిస్తుంది. ఇక్కడ ఇష్యూ ఏంటంటే.. తెలంగాణ రాష్ట్రం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న సమయంలో కరెంటు, దాని సరఫరా, ప్రజల పడ్డ బాధలు, దాన్ని వినియోగించే సమయంలో జరిన మరణాలకు మన అందరం ప్రత్యక్ష సాక్షులం. తెలంగాణ ఏర్పాటుకు ముందు ఆ నాడు అనేక ప్రాంతాల్లో కరెంటు షాక్‌లు కొట్టిచనిపోవడం. బిల్లు కట్టలేదని ఎలక్ట్రిసిటీ విజిలెన్స్ అధికారులు విషం తాగి చనిపోవడం. భిక్షపతి అనే వ్యక్తి జమ్మికుంటలో చనిపోవడం. అక్కడికి మేము అందరం ఉద్యమ సమయంలో వెళ్లాం. వెరసి కష్టాలను ఇప్పుడు తలచుకుంటేనే భయమవుతుందని అన్నారు. కష్టపడి అందరం కలిసి పోరాటం చేసినం. తెలంగాణ తెచ్చుకున్నం. తెచ్చుకున్న తర్వాత భయంకరమైన అన్యాయం చేసింది. నేను భట్టి విక్రమార్కకు ధన్యవాదాలు తెలుపుతున్న. పునర్విభజన చట్టంలో ఉన్న అనేక అంశాల్లో ఘోరాతి ఘోరంగా మోదీ ప్రభుత్వం అన్యాయం చేసింది. మొదటి కేబినెట్‌లో కేంద్రం తెలంగాణ గొంతు నులిమేసే విధంగా.. అందులో మరీ ముఖ్యంగా 460 మెగావాట్ల హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టు సీలేరును ఆంధ్రాకు కేటాయించింది. సోనియా గాంధీ రాష్ట్ర విభజన సమయంలో బిల్లు తుది దశకు వచ్చే సమయంలో తెలంగాణ పవర్ షాటేజ్ ఉంటది. పవర్ యుటిలేజేషన్ ఉంటది. తెలంగాణ మొత్తం భూగర్భ జలాలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి వచ్చింది. సమైక్య రాష్ట్రంలో మాకు వస్తాయన్న ప్రాజెక్టులు రాలేదు కాబట్టి. ప్రజలంతా గతిలేక బోరు వేసుకునే పరిస్థితిలో ఉన్నరు. తెలంగాణలో ఉన్న బోర్లు దేశంలో ఎక్కడా లేవు. కరెంటు కేటాయింపులో అధికంగా కేటాయించాలని కోరితే.. 53శాతం తెలంగాణకు కేటాయించారు. దాన్ని దృష్ట్యా సీలేరు పవర్ ప్రాజెక్టును తెలంగాణకు కేటాయించారు. భవిష్యత్‌లో దీని పరిస్థితి ఇట్లే ఉంటదని అని చెప్పి ఇతరులు పేచీపెట్టినప్పటికీ.. మన్మోహన్ సింగ్ నాయకత్వంలో ఆ రోజు బిల్లులో సింగరేణి కాలరీస్ మొదటి నుంచి తెలంగాణదే.. దానిపై హక్కు తెలంగాణకే అని కేటాయించారని అన్నారు. దురదృష్టం ఏంటంటే.. ప్రధానమంత్రి మోదీ మొదటి మీటింగ్‌లో ఆంధ్రాప్రదేశ్ ముఖ్యమంత్రి చేతులో కీలుబొమ్మగా మారిపోయి ఆర్డినెన్స్ తెచ్చారు. వాస్తవానికి ఆర్డినెన్స్ తేవాల్సిన పరిస్థితి కాదు. శాసనసభలు ఒప్పుకున్నా.. ఒప్పుకోకపోయినా రెఫర్ చేయకుండా కర్కషంగా ఏడు మండలాలు, సీలేరు పవర్ ప్రాజెక్టు తెలంగాణ నుంచి వేరు చేశారు. బహుశా నేను అనుకుంటు ఈ దేశంలో ఫస్ట్ పర్సన్ క్రిటిసైజ్ మిస్టర్ నరేంద్ర మోదీ. ఈజ్ ద మోస్ట్ ఫాసిస్ట్ ప్రైమినిస్టర్ ఆఫ్ ద కంట్రీ అని చెప్పా. అప్పుడు తెలంగాణ రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చామని అన్నారు. . ఆ రోజు నాపై విమర్శలు చేశారు. ముఖ్యమంత్రిగా ఎన్నుకోబడ్డరు.. ప్రమాణస్వీకారం మాత్రం చేయలే.. ఈ దశలో అధికారికంగా ఉండి రాష్ట్ర బంద్‌కు పిలుపునిస్తరా? అంటే.. ఇస్తం తప్పదు.. ప్రజాస్వామ్యంలో నిరసన తెలుపాలని చెప్పానని అన్నారు. అప్పుడు తెలంగాణ సమాజం నిరసన తెలిపింది. అనేక పర్యాయాలు చెప్పాం. మండలాల సంగతి వదిలేసినా ప్రాజెక్టునైనా ఇవ్వాలని ప్రధానికి లేఖలు రాశాం. ఆయన పరిగణలోకి తీసుకోలేదు. రఘునందన్‌రావు సత్యదూరమైన విషయాలు చెప్పారు. సభను పక్కదోవ పట్టిస్తున్నరు. వందశాతం తప్పు. అంబేద్కర్ ఉండే ఎంత కొట్లాడునో.. ఇప్పుడు ఆయన లేరు మన దురదృష్టం. ఆయన రాజ్యాంగ స్ఫూర్తిని మోదీ ప్రభుత్వం రోజుకింత కాలరాస్తుంది. అధికారి అనేది బాధ్యత. ఇది రాచరికం కాదు. బాధ్యతలు అధికారపూర్వకంగా ఉండాలి. రాజ్యాంగంలో కేంద్రం పరిధిలో, రాష్ట్రాల పరిధిలో ఉండాలి.. ఇద్దరు కలిసి సంప్రదించుకొని చేసుకునేందుకు కొన్ని ఉమ్మడి జాబితాలో పెట్టారు. ఈ పవర్ ఉమ్మడి జాబితాలో ఉ న్నది. దీనిపై కేంద్రం పెత్తనం లేదు. దురదృష్టవశాత్తు రాష్ట్రాలతో కనీస సంప్రదింపులు చేయకుండా.. అడగకుండా.. మాటమాత్రం చెప్పకుండా వాళ్ల ఇష్టం వచ్చిన పద్ధతిలో.. పార్లమెంట్‌లో మాట్లాడనీయకుండా మూకదాడులు చేస్తున్నరు. ప్రతిపక్ష సభ్యుడు లేస్తే వందమంది అధికార పార్టీ సభ్యులు లేచి రకరకాల పేర్లు పెట్టి అరవడం. వారి నోళ్లను మూయించడం.. గందరగోళం సృష్టించి ఆ బిల్లులను పాస్ చేసుకుంటూ ఇలాంటి చట్టాలు చేస్తున్నరు. సమగ్ర పార్లమెంట్‌లో చర్చిస్తే అనేక పార్టీలు చర్చిస్తయ్. గతంలో బాల్క సుమన్ లోక్‌సభ సభ్యుడిగా ఉన్నప్పుడు పార్లమెంట్‌ను ఐదురోజులు స్తంభింప చేసినం. అయినా కూడా దానికి జవాబు లేదు. దానిపై చర్చ లేదు. కనీసం ఎదుటివారు చెబితే వినే సంస్కారం లేదు. బుల్డోజ్ చేసి.. మా ఇష్టం అనే పద్ధతిలో ఈ దేశాన్ని నడిపే దుర్మార్గమైన పద్ధతి జరుగుతుందని అంటూ సీఎం కేసీఆర్ మండిపడ్డారు. ఆర్టీసీని అమ్మేయని కేంద్రం లేఖలు రాస్తోందని సీఎం కేసీఆర్ అసెంబ్లీలో అన్నారు. సంస్కరణల పేరుతో అన్ని ఆస్తులను తెగనమ్ముతునన మోడీ రాష్ట్రాలపైనా పెత్తనం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర అసెంబ్లీలో విద్యుత్ సంస్కరణలపై జరిగిన స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ సందర్భంగా కేంద్రం విధానాలపై ధ్వజమెత్తారు. 'మీటర్ పెట్టకుండా విద్యుత్ కనెక్షన్ ఇవ్వొద్దని కేంద్రం తీసుకువచ్చిన గెజిట్‌లోనే ఉన్నది. గెజిట్ నిన్నగాక మొన్న వచ్చింది. చట్టంలో లేదు.. మేము అనలేదు అంటున్నరు. ఆంధ్రప్రదేశ్ శ్రీకాకుళంలో మీటర్ పెడితే రైతులంతా కుప్పలు పోసి.. ధర్నా చేశారు. ఈ ప్రమాదం తెలంగాణకు వస్తే సర్వనాశనం అవుతుందని అక్కడికి వెళ్లి వాస్తవాలు తెలుసు కున్నం. ఉ త్తరప్రదేశ్ ఎన్నికల్లో తియ్యని మాటలు చెప్పారు. ఫ్రీ కరెంటు ఇస్తామన్నరు. అక్కడ మీటర్లు పెడితే మూడు నాలుగు జిల్లాల్లో రైతులంతా కరెంటు ఆఫీసుకాడ మీటర్లు పోసి.. పెద్ద ఎత్తున ఆందోళన లు జరిగాయి.. ఇంకా జరుగుతున్నయ్' అని గుర్తు చేశారు. మిత్రుడు రఘునందన్‌రావు మా బీజేపీ పార్టీ పెట్టదని అంటున్నాడని.. పెట్టేది కేంద్ర ప్రభుత్వం కదా?.. మీ పార్టీకి.. ప్రభుత్వానికి ఏమైనా గ్యాప్ ఉందా? మీలోనే మీపైనే అపనమ్మకం ఉందా? మీరు చెప్పేది తప్పా? వాళ్లు చెప్పేది తప్పా? వాస్తవాలు ఇలా ఉన్నాయి. వచ్చిన గెజిట్ ఇది మరి అంటూ మండిపడ్డారు. ఒక్క అగ్రికల్చర్ కనెక్షన్ కాదు.. 'ఏ రకమైనా కనెక్షన్ అయినా భారతదేశంలో మీటర్ లేందే ఇవ్వడానికి లేదు' అని శాసించి, దీనికి వ్యతిరేకంగా పోతే ముమ్మల్ని తొక్కి సంపుతం అనే పద్ధతిలో మాట్లాడుతున్నరు. ఇది ఎట్ల రఘునందన్ రావు సమర్థిస్తరో.. విద్యుత్ సంస్కరణలు అని దానికి అందమైన ముసుగు పేరు. ఇది సంస్కరణలు కాదు.. పాడు కాదు. పేద ప్రజలను, కరెంటు వాడే ప్రతి ఒక్కరినీ దోచుకునే ఒక దుర్మార్గపు చర్య అని అంటూ మండిపడ్డారు.

సంస్కరణ అనే అందమైన ముసుగు తొడుగు. ఇదే శాసన సభలో ఇంతకు ముందు చర్చించాం. ఈ సంస్కరణలు అమలు చేసిన వారికి పాయింట్ 5శాతం ఎఫ్ఆర్‌బీఎం అదనంగా ఇస్తామని చెప్పారు. ఇది అన్యాయమని చెప్పాను. పటిష్టమైన రాష్ట్రాలకు వేరే ఇవ్వాల్సినవి ఇవ్వకుండా.. మీరు అమ్మేయండి అని ఈ కేంద్రం వెయ్యి కోట్లు బహుమతి పెట్టారు. ఆర్టీసీని అమ్మేయండి అని లెటర్లు మీద లెటర్లు వస్తున్నయ్. ఎవరు ముందుగ అమ్మితే వారికి వెయ్యి కోట్ల బహుమానం అంటున్నరు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఆర్టీసీని అమ్మాలని లెటర్లు పంపాలని ఆర్థికమంత్రి పంపారు. మొత్తం మీద మేం కూడా అమ్ముతున్నం కాబట్టి..మీరు కూడా అమ్మేయండి అనే పద్ధతిలో వ్యవహరిస్తున్నరని అంటూ సీఎం కేసీఆర్ మండిపడ్డారు.

తెలంగాణలో రైతులకు ఉచిత కరెంట్ ఇస్తున్న మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ఇంధన ఖర్చులు తగ్గించుకొని ఉచిత విద్యుత్ ఇస్తున్నామని సీఎం అన్నారు. కేంద్రం అన్నింటినీ అమ్మేస్తోందని, వ్యవసాయం, విద్యుత్ మాత్రమే మిగిలాయని ధ్వజమెత్తారు. ధాన్యం ఎక్కడైనా అమ్ముకోవచ్చని కేంద్రం మాయ మాటలు చెబుతోందన్నారు. రైతులు వ్యవసాయం చేయలేమంటే.. కార్పొరేట్ కంపెనీలను రంగంలోకి దించాలని కేంద్రం ఆలోచిస్తోందని దుయ్యబట్టారు. కేంద్రం ముందుచూపు లేకుండా వ్యవహరిస్తోందని, కేంద్రం తీరుతో ఆహార భద్రత ప్రమాదంలో పడిందని కేసీఆర్ ఫైర్ అయ్యారు. ధాన్యం కొనాలని అడిగితే కేంద్రమంత్రి అవహేళన చేశారని సీఎం కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో వ్యవసాయరంగం విద్యుత్ మీద ఆధారపడిందని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వంలో విద్యుత్ ఛార్జీలు పెంచినప్పుడు రైతులు ఇబ్బంది పడతారని కేసీఆర్ వ్యతిరేకించారని గుర్తుచేశారు. తెలంగాణ అంధకారం అవుతుందని హేళన చేశారని అన్నారు. రాష్ట్రం ఏర్పడిన 5 నెలల్లోనే వ్యవసాయానికి మినహా 24 గంటల కరెంట్ ఇచ్చామన్నారు. మూడేళ్లలోగా వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ ప్రారంభించామని జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మండలిలో విద్యుత్ సం÷–కరణలపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ కేంద్రం విధానాలను తూర్పారబట్టారు. అసమర్థ విధానాలు, దూరదృష్టి లేక, ఇతరులు చెబితే వినే లౌక్యం లేకపోవడంతో, సహనం కోల్పోయి అహంకార పూరితంగా వ్యవహరిస్తూ దుర్మార్గమైన ఫలితాలు తెస్తున్నరు.. ఇవి నిజాలు కావా దీనిపై ఎక్కడైనా చర్చకు రెడీ. ఇలా ఎన్నో రంగాలను నాశనం పట్టిస్తున్నరు. ఇది ప్రజాస్వామ్యం.. ఇది ఉండకూడదట. భారతీయ జనతా పార్టీకి చెందిన వివిధ రాష్ట్రాల మంత్రులు, దురదృష్టవశాత్తు కొందరు ముఖ్యమంత్రులు ఎన్‌కౌంటర్లు చేస్తం అంటున్నరు. దేశంలో కేంద్ర ప్రభుత్వం ప్రేక్షకపాత్ర వహిస్తున్నదని మండిపడ్డారు.

కేంద్రం ప్రవేశపెట్టిన విద్యుత్ బిల్లు ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల్లో కేంద్రం విద్యుత్ బిల్లుకు వ్యతిరేకంగా జరిగిన స్వల్పకాలిక చర్చలో భట్టి మాట్లాడారు. ఉమ్మడి జాబితాలోని విద్యుత్ పై కేంద్ర ప్రభుత్వం ఇష్టమొచ్చినట్లుగా వ్యవహరిస్తోందని, అందులో భాగంగానే కొత్త విద్యుత్ బిల్లును తీసుకొచ్చిందని మండిపడ్డారు. కేంద్రం తెచ్చిన విద్యుత్ బిల్లులపై అభ్యంతరాలున్నాయన్నారు. కేంద్రం చట్టం తెచ్చి రాష్ట్రాలు అమలు చేయాల్సిందే అనడం సరికాదన్నారు. ఇది ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం జాతి సంపదను అమ్ముకుంటూ పోతోందని, సంపదనంతా ఇద్దరి చేతుల్లో పెడుతోందని ఫైర్ అయ్యారు. ఒక్కో రాష్ట్రానికి ఒక్కో సమస్య ఉంటుందని, కానీ కేంద్రం రైతుల మోటర్లకు మీటర్లు పెడుతాననడం ఏమాత్రం కరెక్ట్ కాదన్నారు. ఉ చితాలు ఇవ్వొద్దని కేంద్ర ప్రభుత్వం చెబుతోందని, కానీ ప్రజలకు ఇచ్చిన ఉచితాలతో పోల్చుకుంటే పారిశ్రామిక వేత్తలకు ఇచ్చిన సబ్సిడీలు, రుణ మాఫీలు చాలా ఎక్కువ అని అభిప్రాయపడ్డారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం వస్తేనే రాష్ట్రం బాగుపడుతుందని బీజేపీ నాయకులు చెబుతున్నారని, సింగిల్ ఇంజిన్ తో ప్రజలకు అభివృద్ధి చేయలేమా అంటూ ప్రశ్నించారు.

ప్రతి పక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు నిధులివ్వకుండా డబుల్ ఇంజిన్ పేరుతో డ్రామాలాడు తున్నారని బీజేపీ నాయకులపై ÷ర్ అయ్యారు. చట్టపరంగా రాష్ట్రాలకు రావాల్సిన వాటాలను అడ్డుకుంటూ కక్షసాధింపు చర్యలకు మోడీ పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆ కోవలోనే రకరకాల చట్టాలు తెస్తూ రాష్ట్రాల అధికారాలకు కత్తెర వేస్తున్నారని చెప్పారు. రాష్ట్రాభివృద్ధి కోసం కేంద్రం ప్రభుత్వం ట్టటెడు మట్టిపోసిందా అని ప్రశ్నించారు. మోడీ ఫోటోలు పెట్టాలని బీజేపీ మంత్రులు ఏకంగా ఓ కలెక్టర్ నే బెదిరించడం సిగ్గు చేటన్నారు. అంతకు ముందు పోలీస్ రిక్రూట్ మెంట్ సమస్యలపై మాట్లాడానికి ప్రయత్నించిన మంత్రి ప్రశాంత్ రెడ్డి అడ్డుకున్నారు. స్జబెక్ట్ పైనే మాట్లాడాని మంత్రి భట్టికి సూచించారు. అయితే ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు సమయం కేటాయించాలని భట్టి స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డిని కోరారు. గురుకులాల్లో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యుత్ సవరణ బిల్లులో మోటార్లకు మీటర్లు పెట్టాలని ఎక్కడా లేదని బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్నారు. అసెంబ్లీలో విద్యుత్ సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా మాట్లాడిన ఆయన.. విద్యుత్ సవరణ బిల్లులో సెక్షన్ 65లో రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వొద్దని కేంద్రం చెప్పలేదన్నారు. మోటార్లకు మీటర్లు పెడతారని కేంద్రంపై నిందలు మోపుతున్నారని మండిపడ్డారు. తప్పుడు ప్రచారం చేసి..కేంద్రాన్ని బద్నాం చేయాలని చూస్తున్నారని రఘునందన్ రావు అన్నారు. కేంద్ర విద్యుత్ సవరణ బిల్లుపై చర్చ అవసరంలేదని రఘునందన్ రావు అన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఈ బిల్లుపై తీర్మానం చేసి కేంద్రానికి పంపిందని గుర్తు చేశారు. రైతులకు ఉ చిత విద్యుత్ ఇవ్వొద్దని కేంద్రం బిల్లులో చెప్పలేదని స్పష్టం చేశారు. మోడీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత దేశంలో కరెంట్ సరఫరా లేని 18వేల ఊర్లకు విద్యుత్ సరఫరా చేశారని వెల్లడించారు. అసెంబ్లీ సమావేశాలు మంగళవారానికి వాయిదా పడ్డాయి. శాసనసభ, శాసన మండలి సమావేశాలు సోమవారం ఉ దయం ప్రారంభమయ్యాయి. మాజీ ఎమ్మెల్యే భీ భూపతిరావు మృతికి శాసన సభ సంతాపం తెలిపింది. అనంతరం ఏడు సవరణ బిల్లులను సంబంధిత శాఖల మంత్రులు సభలో ప్రవేశపెట్టారు. వీటిపై మంగళవారం చర్చించనున్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన విద్యుత్ సంస్కరణల బిల్లు–పర్యవసానాలపై లఘుచర్చ జరిగింది. ఈ సందర్భంగా విద్యుత్ రంగంపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను సీఎం కేసీఆర్ ఎండగట్టారు. విద్యుత్ రంగంలో తెలంగాణకు జరిగిన అణ్యాయాన్ని గణాంకాలతో సహా వివరించారు. శాసన మండలిలో కూడా విద్యుత్ సంస్కరణలపై సభ్యులు చర్చించారు. ఎమ్మెల్సీ వాణీదేవి, మధుసూదనాచారి చర్చలో పాల్గొన్నారు. అనంతరం విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్వర్ రెడ్డి మాట్లాడక సభ వాయిదా వేస్తున్నట్లు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు.

## ముగిసిన కృష్ణం రాజు అంత్యక్రియలు

మొదటిపేజీ తరువాయి..

ప్రముఖ నటుడు రెబల్ స్టార్ కృష్ణంరాజు తుదిశ్వాస విడివడంతో ఆయన అభిమానులతో పాటు చిత్రపరిశ్రమ శోకసంద్రంలో మునిగిపోయింది. ఆదివారం ఉదయం కృష్ణంరాజు కన్నుమూయగా.. సోమవారం మధ్యాహ్నం వందల మంది అభిమానుల మధ్య అంత్యక్రియలు జరిగాయి. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం కనకమామిడిలోని ఆయన సొంత వ్యవసాయ క్షేత్రంలో ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కృష్ణంరాజు అంతిమయాత్ర పటిష్ఠ బందోబస్తుతో అప్పా జంక్షన్ మీదుగా మొయినాబాద్‌లోని కనకమాడిలోని ఫామ్‌హౌజ్‌లో వరకు సాగింది. తమ అభిమాన




నటుడిని చివరిసారి చూసుకునేందుకు ఈ అంతిమయాత్రలో వందలమంది అభిమానులు పాల్గొన్నారు. దహన సంస్కారాలకు హాజరయ్యారు. అధికారిక లాంఛనాల్లో భాగంగా పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపి ఆయనకు గన్ సెల్యూట్ చేశారు. అంత్యక్రియలకు అనుమతి ఉన్నవారిని మాత్రమే ఫాంహౌస్ లోపలికి పోలీసులు అనుమతించారు. భద్రతా ఏర్పాట్లను శంషాబాద్ డీసీపీ పర్యవేక్షించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసం నుంచి కృష్ణంరాజు పార్థివదేహాన్ని ఫామ్‌హౌజ్‌కు తరలించేముందు కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి కన్నీటి పర్యంతమైన దృశ్యాలు కలిచివేసాయి. శ్యామలాదేవి తన భర్త పార్థివదేహాన్ని స్వయంగా తన భుజాలపై మోసి వాహనం వరకు తీసుకెళ్లిన దృశ్యాలు కంటతడి పెట్టించాయి. కృష్ణంరాజు మృతికి ప్రధాని మోదీ, తెలంగాణ, ఏపీ సీఎంలు కేసీఆర్, జగన్ సహా పలువురు రాజకీయ, సినీ రంగాల ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మంత్రులు రోజా, చెన్నుబోయిన వేణుగోపాల కృష్ణ తదితరులు సోమవారం ఆయన పార్థివదేహం వద్ద నివాళి అర్పించారు. కృష్ణంరాజు ఎంతో హుందాతనం కలిగిన వ్యక్తి అని వెంకయ్య కొనియాడారు. ఆయన మరణం తీరని లోటన్నారు. ఆయన ఇకలేరన్న సంగతి తెలియగానే టాలీవుడ్ హీరోలు, నిర్మాతలు, దర్శకులు, రాజకీయ ప్రముఖులు ఆయన ఇంటికి వచ్చి పార్థివదేహానికి నివాళులు అర్పించారు. కృష్ణంరాజు భార్య, ప్రభాస్‌ను ఓదార్చి తమ ప్రగాఢ సంతాపం ప్రకటించారు.

## పశువులలో లంపి స్కిన్ డిసీజ్ కట్టడి

మొదటిపేజీ తరువాయి..

స్వదేశీ వ్యాక్సిన్.. కీలక ప్రకటన చేసిన ప్రధాని మోడీ పశువులలో లంపి స్కిన్ డిసీజ్ కట్టడికి రాష్ట్రాలతో పాటు కేంద్రం అన్ని ప్రయత్నాలు చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. ఈ వైరల్ ఇన్ఫెక్షన్‌కు స్వదేశీ వ్యాక్సిన్‌ను భారతీయ శాస్త్రవేత్తలు సిద్ధం చేశారని ప్రధాని పేర్కొన్నారు. గ్రేటర్‌నోయిడాలోని ఇండియా ఎక్స్‌పో సెంటర్,మార్ట్‌లో నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ డెయిరీ ఫెడరేషన్ వరల్డ్ డైరీ సమ్మిట్ 2022లో మోడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ప్రధాని.. లంపి స్కిన్ కారణంగా పాడి పరిశ్రమ ప్రస్తుతం సంక్షోభంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యాధిని అదుపులో ఉంచేందుకు జంతువుల కదలికలను ట్రాక్ చేయడానికి అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఇందులో భాగంగా స్వదేశీ వ్యాక్సిన్‌ను భారత సైంటిస్టులు సిద్ధం చేశారని పేర్కొన్నారు. జంతువులకు టీకాలు వేయడం లేదా మరేదైనా




ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో పాడి పరిశ్రమకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రధాని భరోసా ఇచ్చారు. కాగా లంపి స్కిన్ డిసీజ్ కారణంగా దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 57,000 పశువులు చనిపోయాయని కేంద్రం గత వారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ వ్యాధి బారిన పడి కేవలం రాజస్థాన్‌లో మాత్రమే దాదాపు 37,000 మూగజీవాలు మరణించాయి. రాజస్థాన్‌తో పాటు గుజరాత్, ఢిల్లీ, పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లోనూ ఈ వైరస్ కలకలం రేపుతోంది. కాగా మొదట ఐరోపాలో బయటపడిన ఈ వ్యాధి ఆతర్వాత ఆసియాకు కూడా వ్యాపించింది. 2019 లో బంగ్లాదేశ్‌లో లంపిస్కిన్ డిసీజ్ కేసులు వెలుగుచూశాయి. ఆ మరుసటి ఏడాదే ఇండియాలో మొదటి కేసు నమోదైంది. ప్రపంచంలోనే అతిపెద్ద పాల ఉత్పత్తిదారుగా ఉన్న భారతదేశంలో 2019లో 192.5 మిలియన్ల పశువుల జనాభాను కలిగి ఉంది. అయితే లంపి స్కిన్ వ్యాధి బయటపడినప్పటి నుంచి పాల సేకరణలో తగ్గుదల కనిపిస్తోంది. లంపి స్కిన్ డిసీజ్ అనేది ఒక అంటువ్యాధి అలాగే వైరల్ ఇన్ఫెక్షన్ కూడా. దీని బారిన పడిన పశువులలో తీవ్ర జ్వరంతో పాటు చర్మంపై దద్దుర్లు వస్తాయి. ఒక్కోసారి తీవ్రత ఎక్కువై మరణానికి కూడా దారి తీస్తుంది. ఈ వ్యాధి దోమలు, ఈగలు, పేనులు, కందిరీగల ద్వారా ఒకరినుంచి మరొకరికి వ్యాపిస్తుంది. అలాగే కలుషితమైన ఆహారం, నీటి ద్వారా కూడా వ్యాపిస్తుంది.

## టీఎస్‌పీఎస్సీ నుంచి మరో నోటిఫికేషన్

చివరి తేదీ. డీటెయిల్డ్ నోటిఫికేషన్ 2022 సెప్టెంబర్ 23న విడుదల కానుంది. ఆసక్తి గల అభ్యర్థులు మరిన్ని వివరాలను టీఎస్‌పీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ %ట్ట్రజూం://షష్.ంజూంఎ.స్త్రశీజ.ఱఅ% లో తెలుసుకోవచ్చు. ప్రస్తుతం విడుదల చేసిన జాబ్ నోటీస్‌లో ఈ కింది వివరాలు ఉన్నాయి.డీటెయిల్డ్ నోటిఫికేషన్ విడుదల– 2022 సెప్టెంబర్ 23
దరఖాస్తు ప్రారంభం– 2022 సెప్టెంబర్ 28
దరఖాస్తుకు చివరి తేదీ– 2022 అక్టోబర్ 21
విద్యార్హతలు– వేర్వేరు పోస్టులకు వేర్వేరు విద్యార్హతలున్నాయి. సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ, డిప్లొమా పాసైనవారు అప్లై చేయొచ్చు. వయస్సు– 18 నుంచి 44 ఏళ్ల లోపు. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు వయస్సులో సడలింపు ఉ ంటుంది.

## వారణాసి జిల్లా కోర్టు కీలక నిర్ణయం

మొదటిపేజీ తరువాయి..

దేవతా విగ్రహాలకు పూజలు నిర్వహించేలా ఆదేశించాలన్న హిందూ పక్షం పిటిషన్ ను సమర్థించింది. దీంతో సెప్టెంబరు 22 నుంచి ఈ పిటిషన్ పై విచారణ చేపట్టనుంది. ఇదే సమయంలో జ్ఞానవాపి మసీదుకు చెందిన అంజుమన్ ఇంతెజామియా కమిటీ పిటిషన్ ను కోర్టు తోసిపుచ్చింది. హిందూ పక్షాల తరఫున లాయర్ విష్ణుశంకర్ జైన్ మాట్లాడుతూ.. ముస్లిం పక్షం పిటిషన్ ను కోర్టు తిరస్కరించిందని తెలిపారు. దేవతా విగ్రహాల నిత్య పూజలకు అనుమతించాలన్న దావా నిర్వహించదగినదని సింగిల్ బెంచ్ న్యాయమూర్తి జస్టిస్ ఏకే విశ్వేశ్ పేర్కొన్నారని చెప్పారు. మసీదు ప్రాంగణంలో విగ్రహాల విషయమై విచారణెళి అవసరం లేదని, దీనిపై కొంతమంది చేస్తున్న ఆరోపణలు సత్యదూరమని అంజుమన్ ఇంతెజామియా కమిటీ అఫిడవిట్ దాఖలు చేసింది. మసీదుకు సంబంధించిన స్థలం సహా మిగిలిన ఆస్తులు పూర్తిగా వక్ఫ్ బోర్డుకు చెందుతాయని పేర్కొంది. మరోవైపు మసీదు కాంప్లెక్స్ లోని హిందూ దేవతలను పూజించేందుకు అనుమతి కోరుతూ ఢిల్లీకి చెందిన ఐదుగురు మహిళలు పిటిషన్ వేశారు. ఈ నేపథ్యంలో కోర్టు ఆదేశాల మేరకు ప్రత్యేక కమిటీ అక్కడ వీడియో సర్వే నిర్వహించింది. అయితే అది శివలింగం కాదని మసీద్ కమిటీ వాదిస్తూ వస్తోంది. ఈ క్రమంలో ఈ కేసు సుప్రీంకోర్టుకు చేరి, తిరిగి వారణాసికే చేరింది. వీడియో రికార్డింగ్ కు సంబంధించిన ఫుటేజీలు లీక్ కావడంతో ఈ కేసు చర్చనీయాంశంగా మారింది. ఈనేపథ్యంలో సోమవారం వెలువడిన తీర్పు ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఈ తీర్పు నేపథ్యంలో వారణాసిలో హై అలర్ట్ ప్రకటించారు. ఇప్పటికే144 సెక్షన్ విధించారు. తీర్పు తర్వాత ఎటువంటి అల్లర్లు జరక్కుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ప్రశాంత పరిస్థితుల కోసం మతపెద్దలతో పోలీసులు ఇంతకుమునుపే సంప్రదింపులు జరిపారు. మసీదు ప్రాంగణంలో హిందువులు ప్రార్థనలు చేసుకునేందుకు అనుమతించాలన్న పిటిషన్‌పై సానుకూలంగా స్పందించింది. వ్యాజ్యంపై విచారణ చేపట్టనున్నట్లు తెలిపింది. తదుపరి వాదనలు సెప్టెంబర్ 22న విననున్నట్లు తెలిపింది.

## హాస్టల్ సమస్యలపై భట్టి ప్రస్తావన

**చర్చకు తీసుకోని శాసనసభ**

హైదరాబాద్,సెప్టెంబర్12: అసెంబ్లీలో సోమవారం కేవలం విద్యుత్ సమస్యలపైనే చర్చ జరిగింది. దీనికి సిఎం కెసిఆర్ సమాధానం ఇచ్చారు. అయితే హాస్టళ్లో సమస్యలపై సిఎల్‌పి నేత భట్టి ప్రస్తావించినా చర్చకురాలేదు. సభలో మాట్లాడిన సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని హాస్టళ్ల దుస్థితిపై స్పందించలేదు. కేంద్రం తీసుకొచ్చిన విద్యుత్ బిల్లుపైనే సీఎం ఫోకస్ చేశారు తప్ప గురుకుల పాఠశాలల విద్యార్థుల సమస్యలపై ఏమాత్రం మాట్లాడలేదు. ఓ వైపు సీఎల్పీ నేత భట్టి విక్రమార్క విద్యార్థుల సమస్యలను పట్టించుకోవాలని కేసీఆర్ ను కోరినా సీఎం మాత్రం ఆ విషయాన్ని పట్టించుకోలేదు. విద్యార్థులు, విద్యా వ్యవస్థపై కేసీఆర్ కు ఏమాత్రం పట్టింపులేదని ప్రతిపక్షాలు, విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఫుడ్ పాయిజన్ ఘటనలు, ఆహారంలో కప్పలు, పురుగులు రావడం వంటి ఘటనలు సంక్షేమ హాస్టళ్లలో కామన్ గా మారాయి. దీంతో పదుల సంఖ్యలో విద్యార్థులు అనారోగ్యానికి గురై ఆస్పత్రి పాలయ్యారు. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో ఇటీవల కామారెడ్డి జిల్లా బీర్కూర్ బీసీ హాస్టల్ లో సాయిరాజు (10) అనే విద్యార్థి పాముకాటుకు గురై చనిపోయాడు. అలాగే అంతకుముందు వరంగల్ జిల్లా వర్ధన్నపేటలోని గిరిజన ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు తినే ఆహారంలో బల్లి పడి ఫుడ్ పాయిజన్ కావడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. అలాగే బాసర ట్రిపుల్ ఐటీలో రోజుల తరబడి విద్యార్థులు తమ సమస్యల పరిష్కారానికి ఉద్యమించారు. ఇలా చెప్పుకుంటూ పోతే రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి ఘటనలు ఎన్నో జరిగాయి. కాని రాష్ట్ర ప్రభుత్వం ఏనాడు వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 2500 గురుకుల సంక్షేమ వసతి గృహాలు ఉండగా వాటిల్లో 5 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇంత పెద్ద మొత్తంలో పేద విద్యార్థులు భాగమై ఉన్న సంక్షేమ హాస్టళ్లపై రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఏమాత్రం సమంజసంగా లేదని విమర్శలు వస్తున్నాయి.

## మినిస్టర్స్ క్వార్టర్స్ ముట్టడికి వీఆర్‌ఏల యత్నం

హైదరాబాద్,సెప్టెంబర్12: హైదరాబాద్ బంజారాహిల్స్ లోని మినిస్టర్స్ క్వార్టర్స్ ముట్టడికి వీఆర్‌ఏలు యత్నంచారు. వారిని లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వీఆర్‌ఏలు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వెంటనే రాష్ట్ర సర్కార్ పే స్కేల్ ను పెంచాలన్నారు.

# బన్సీలాల్ పేట డివిజన్ బీజేపీ సమావేశం

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 12 ( ప్రజా మంటలు ):**బన్సీలాల్ పేట డివిజన్ భారతీయ జనతాపార్టీ బన్సీలాల్ పేట డివిజన్ కమిటీ సమావేశం సోమవారం జిల్లా నాయకులు



అల్లబోయిన ఆనంద్ యాదవ్ నివాసంలో జరిగింది. సెప్టెంబర్ 17న హైదరాబాద విమోచన దినోత్సవం సందర్భంగా నిర్వహించాల్సిన కార్యక్రమాల గురించి చర్చించినట్లు డివిజన్ ప్రెసిడెంట్ ఉమేశ్ ఖండేల్వాల్ తెలిపారు. ఆ రోజున పెరేడ్? గ్రౌండ్? లో నిర్వహించనున్న కార్యక్రమానికి వెళ్లేందుకు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు బైక్ ర్యాలీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా పార్టీ ప్రెసిడెంట్ శ్యాంసుందర్? గౌడ్?, మహిళా మోర్చా జిల్లా ప్రెసిడెంట్? లక్ష్మీ పద్మజ, జిల్లా ట్రెజరర్? ఆనంద్? యాదవ్?, నాయకులు సురేశ్?, కృష్ణ, బి.లక్ష్మన్?, పవన్? పటేల్?, దిలారి లక్ష్మీ, కుర్మ శంకర్?, అండాలు, తదితరులు పాల్గొన్నారు.

## మొబైల్ షాప్‌ను ప్రారంభించిన కోహెడ సర్పంచ్

# పేర్యాల నవ్య-దేవేందర్ రావు

**కోహెడ సెప్టెంబర్ 12 ( ప్రజామంటలు):** కోహెడ మండల కేంద్రం లోని అగ్రికల్చర్ మార్కెట్ కాంప్లెక్స్ లోని షెటర్ నెంబర్ 1 లో విపంచి మొబైల్స్ సేల్స్ అండ్ సర్వీస్



సెంటర్ ని ప్రారంభించి , విపంచి మొబైల్స్ ప్రో. రాము కు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ పేర్యాల దేవేందర్ రావు, ఉప సర్పంచ్ యాద అశోక్, టిఆర్ఎస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ జాలిగం శంకర్, కాంగ్రెస్ నాయకులు వేల్పుల వెంకట స్వామి, గట్టు నాగరాజు, టిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు శంఖం రాజేష్, షాప్ ప్రో. రాము మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్తల ఇన్సెంట్ మృతి

**జనగామ సెప్టెంబర్ 12 (ప్రజామంటలు):** జనగామ పట్టణంలోని 1వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్తల ఇన్సెంట్ 30వ వార్డుకు చెందిన ఆరురి



అబ్బాసాయిలు వీరిరువురు అనారోగ్యంతో పరమపదించారు. వారి కుటుంబ సభ్యులతో ఫోన్ లో పరామర్శించి సానుభూతి వ్యక్తం చేసిన టీపీసీసీ మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య అలాగే వారి పార్థివ దేహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించిన జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెంచారపు శ్రీనివాస్ రెడ్డి, జనగామ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధర్మపురి శ్రీనివాస్, 1వ వార్డు కౌన్సిలర్ రామగాళ్ల అరుణ విజయ్ కుమార్, జనగామ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ పిట్టల సతీష్, పిట్టల రాజు, బొట్ల మల్లయ్య తదితరులు ఉన్నారు.

# యోగా షెడ్ మరియు టాయిలెట్స్ నిర్మాణమునకు భూమి పూజ

**మల్లాపూర్ సెప్టెంబర్ 12 (ప్రజామంటలు):** వెంకట్రావు పేట గ్రామం మల్లాపూర్ మండలంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు మల్లాపూర్ మండల



ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామ సర్పంచ్ జోగుల మమత-రాజేష్ ఆధ్వర్యంలో వెంపెల్లి వెంకట్రావుపేట ఆయుర్వేదం హాస్పిటల్ కు అనుబంధంగా నూతనంగా యోగా షెడ్ మరియు టాయిలెట్స్ నిర్మాణమునకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఇట్టి నిధులను మంజూరు చేయించిన ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు కి ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్య అధికారి కృష్ణవేణి, ఉప సర్పంచ్ కొడిమ్యాల రవి, ఎంపీటీసీ తోట సుజాత-శ్రీనివాస్, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, కార్యదర్శి నరేష్, గంగా గౌరీశ్వర చైర్మన్ ఎల్లాల కృష్ణారెడ్డి, తెరాస గ్రామ శాఖ అధ్యక్షుడు ఎల్లాల జీవన్ రెడ్డి, నాయకులు జోగుల రాజేష్, తోట శ్రీనివాస్, యాదగిరి నర్సింగరావు, జోగుల లింగయ్య, నరేష్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అంగారక సంకట హర చతుర్థి

కృష్ణ పక్ష చతుర్థిని సంకష్ట హర చతుర్థి అంటారు. సంకట హర చతుర్థి మంగళవారం నాడు వస్తే అంగారక సంకష్ట చతుర్థి అంటారు. వినాయకుని ఆరాధకులు సంకట వినాయక వ్రతం అనేది అత్యంత ప్రాముఖ్యమైన వ్రతంగా భావిస్తారు. ఆ రోజు అంతా ఉపవాసం వుండి సంకట గణేష పూజ సాయంకాలం జరిపి, చంద్రదర్శనం అయినాక వారి ఉపవాసంకు ముగింపు పలికి ఏదన్నా తింటారు. సంకట చతుర్థి ప్రాముఖ్యత భవిష్య పురాణంలోనూ నరసింహ పురాణంలోనూ చెప్పబడింది. సంకట చతుర్థి మహత్యం శ్రీ కృష్ణుడు యుధిష్ఠరునికి వివరించాడు. సంకట అంటే కష్టములు, ఇబ్బందులు, సమస్యలను హర అంటే హరించేది అని అర్థం. ఋగ్వేదంలో గణపతి వేదాలు, జ్ఞానములకు, కర్మిష్టులకు, సర్వవ్యాపక భక్తుల ప్రభువని సర్వగణాలకు అధిదేవతని, సర్వా హ్లాదకరుడని, సర్వులకు జ్యేష్టుడని, అధినాయకుడని, ఉత్తమ కీర్తి సంపన్నుడని కీర్తించబడ్డాడు. గణపత్యధర్వ శీర్షోపనిషత్తులో గణపతి సర్వవ్యాప్తమైన పరబ్రహ్మ స్వరూపమని సృష్టి స్థితి లయములకు కారకుడని, సర్వ కార్యములకు సృష్టికి కర్త హర్త అని ఆనందమయుడని చిమ్మయుడని, లంబోదరుడని, శూర్ప కర్ణుడు రక్తం గుడిగా అభివర్ణించారు. అటువంటి గణపతి సంకటాలను దూరం చేసేవాడని సంకట హరుడుగా పూజించడం అనాదిగా వస్తున్నదే. సంకటహరుని పూజించడానికి కృష్ణ పక్ష చతుర్థి ప్రసిద్ధి. సంకట హర చతుర్థి గురించి శ్రీకృష్ణుడు, ధర్మ రాజుకు వివరించినట్లు పురాణ కథనం. భవిష్య, నరసింహ పురాణాల ప్రకారం, ఒక సారి ఇంద్రుడు, గణేశ ఉపాసకుడైన భృషుండి అనే మహాముని ఆశ్రమం నుండి, విమానంపై ఇంద్రలోకానికి తిరిగి వెళుతూ, శూరసేన మహారాజు రాజ్యం మీదుగా వెళ్ళే సమయాన మహా పాపాత్ముడొకడు, విమానాన్ని చూసినంతనే విమానం నేలపై దిగి పోతుంది. తేజోవిరాజితమైన విమానాన్ని శూరసేనుడు చూడబోయి, ఇంద్రుడిదని తెలుసుకుని, ఆగి పోవడానికి కారణమడిగి ఇంద్రుని ద్వారా విని, మళ్ళీ లేచే ఉపాయం ఏదని అడుగుతాడు. ఆనాడు బహుళ పంచమి ఐనందున, గత దినం చతుర్థినాడు ఉపవసించిన భక్తులు ఉపవాస ఫలాన్ని దారబోస్తేనే, విమానం మళ్ళీ లేవగలదని ఇంద్రుడు వివరిస్తాడు. శూరసేనుని ఆజ్ఞానువర్తులైన సైనికులు రాజ్యమంతా వడబోసినా అట్టి భక్తులు దొరకనిస్థితిలో నిరాశకు లోనుకాగా, ఆసమయం లోనే మృతి చెందిన ఒక స్త్రీని గణపతి దూత తీసుకెళుతుండడం చూసి ఇదేమిటని సైనికులు అడుగుతారు. ఆమె గతదినం నిద్రలో ఉపవాసంతో ఉండి, రాత్రి చాలాసేపైనాక మెలకువ వచ్చి భోజనం చేసిందని, తెల్లవారి మృతి చెందినదని, అలాగే జీవితంలో ఒకసారైనా సంకటహర చతుర్థి ఆచరిస్తే గణపతి లోక ప్రాప్తి లభించగలదని చెప్పారు. ఆమె శరీరాన్ని తమకు ఇవ్వాలని సైనికులు కోరగా, గణపతి దూత నిరాకరిస్తాడు. అదే సమయంలో ఆమె శరీరం నుండి వీచిన పెనుగాలి ఇంద్రుని విమానాన్ని స్పృశించినవెంటనే అది పైకి లేస్తుంది.

### సంకట హర చతుర్థి ప్రత్యేకత

కృష్ణ పక్ష చతుర్థి సంకష్టహర, సంకటహర చతుర్థి అంటారు. ఈరోజు దినమంతా ఉపవాస ముండి, సాయంత్రం , నిశి పూజ, చంద్రదర్శనానంతరం భోజనాలు చేయడం, నిర్దేశిత ఆచారం. ఇలా చేస్తే సకల కష్టాలు, సంకటాలు తొలగి పోయి, సంకట నాశకుడైన విఘ్న నాయకుని కృపకు పాత్రులు, జన్మరాహిత్యం , మోక్షం సిద్ధించి, సప్త జన్మలు అవసరం లేకనే శాశ్వత గణేశ లోక



ప్రాప్తి కలుగనున్నట్లు పురాణాలు వివరిస్తున్నాయి. తలపెట్టిన పనులకు విఘ్నాలు కలుగుతూ అశాంతి, మానసిక, శారీరిక రుగ్మతలు, రుణ బాధలు, అనేక కష్టాలు కలుగుతున్నప్పుడు దుష్టగ్రహ పీడన నివారణ కొరకై ప్రతి నెలా సంకష్టహర చవితి నాడు యథాశక్తి విఘ్నేశ్వరుని పూజలు జరపడం సంప్రదాయం. కృష్ణపక్ష చవితి తిథి మంగళవారం తో కూడి వస్తే అంగారక చతుర్థి అంటారు. సంకట హర చతుర్థి నాడు కలశ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, మహా గణపతి అధర్వ శీర్ష పూజలు, అభిషేకం, అష్టోత్తర అర్చనలు, నివేదన, హారతి, మంత్రపుష్పం, నీరాజన, తీర్థ ప్రసాద వితరణాది సాంప్రదాయక క్రతువులను నిర్వహించడం, భక్తుల గోత్రనామాదులతో ప్రత్యేక అర్చనలు, గణపతి ఉపనిషత్ యుక్త అభిషేకాదులను నిర్వహించు కోవడం, భక్తులు తమ స్వగృహాలలోనూ గణపతి పూజ లొనరించి రాత్రి చంద్ర దర్శనానంతరం అరగించడం సనాతన సంప్రదాయం. వినాయకుని అనుగ్రహ ప్రాప్తికై, కుజుడు చేసిన తపస్సు ఫలితంగా, మాఘ కృష్ణ చతుర్థి దినాన చంద్రోదయ వేళలో పది భుజాలు కలిగిన బాలుని రూపంలో ప్రత్యక్షమై ఆ నాడు మంగళవారం కనుక కుజుని పేరు మంగళుడని నామకరణం చేసి, అంగారక సంకష్ట చతుర్థి నాడు వినాయక వ్రతాచరణ ద్వారా కుజ దోష సమస్యలు తొలగి పోగలవని, సంకటాలన్ని తొలిగి సఫలత లభించగలదని వరం ప్రసాదించారని పురాణాలు స్పష్టం చేస్తున్నాయి.

రామకిష్టయ్య సంగనభట్ల...9440595494

## అంగరంగ వైభవంగా తెలంగాణ సమైక్య

# దినోత్సవాన్ని వజ్రోత్సవాలు నిర్వహించాలి

**చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవి శంకర్.**

**మల్యాల సెప్టెంబర్ 12 (ప్రజా మంటలు ) :** తెలంగాణ జాతీయ సమైక్యతా వజ్రోత్సవాల ప్రారంభంలో భాగంగా ఈనెల 15, 16, 17 తేదీలలో 3 రోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా 16వ తేదీన విద్యార్థులు, యువతీ యువకులు, మహిళలతో నిర్వహించే ర్యాలీ, సాంస్కృతిక కార్యక్రమాలు, సభను అంగరంగ వైభవంగా నిర్వహించాలని చొప్పదండి నియోజకవర్గంలోని 6 మండలాల అధికారులకు చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ సూచించారు. సోమవారం గంగాధర మండలం భూరుగుపల్లిలో ఆరు మండలాల అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ జాతీయ సమైక్యతా వజ్రోత్సవాల ప్రారంభంలో భాగంగా 3 రోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో సెప్టెంబర్ 16 వ తేదీన గంగాధర మండల కేంద్రంలోని జెడ్. పి. హెచ్. ఎస్ నుండి మధురానగర్ చౌరస్తా (గంగాధర్ ఎక్స్ రోడ్) వరకు నియోజకవర్గంలోని ఆరు మండలాల 15,000 వేల మందితో విద్యార్థులు, యువతీ యువకులు, మహిళలతో రెండు కిలోమీటర్ల భారీ ర్యాలీలు నిర్వహించాలని, ఈ కార్యక్రమంలో తెలంగాణ సంస్కృతి ఉట్టి పడేలా బతుకమ్మలు, ఒగ్గుడోలు కళాకారులు, కోలాటాలు, తెలంగాణ అమరవీరుల వేషధారణతో పాల్గొనేటట్లు చేయాలని అన్నారు. అనంతరం సంస్కృతి కార్యక్రమాలు, మధురానగర్ చౌరస్తా (గంగాధర్ ఎక్స్ రోడ్ ) లో సభ కార్యక్రమం ఉంటుందని, తరువాత వచ్చిన వారందరికీ శుభమస్తు ఫంక్షన్ హాల్, వి ఏ ఎస్, ఫంక్షన్ హాల్, జివిఆర్ ఫంక్షన్ హాల్స్ లలో భోజన సౌకర్యం కల్పిస్తున్నట్టు



వారు తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి నియోజకవర్గంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, అనాధికారులు, మహిళా సంఘాల వారు, కుల సంఘాలవారు అందరు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ సమీక్ష సమావేశంలో డిఆర్డిఏ పీడీ శ్రీమతి శ్రీలత, చొప్పదండి సి ఐ రవీందర్, ఎస్సైలు, ఆరు మండలాల ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు, ఏపీవోలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## స్వదేశ్ పరికి పండ్లకు

# 'ఖతార్'లో ఆత్మీయ స్వాగతం

**ఖథార్ సెప్టెంబర్ 12 (ప్రజామంటలు):** వలసలపై ఆసియా-గల్ఫ్ దేశాల సమావేశం - తెలంగాణ వాసికి అరుదైన అవకాశం ఖతార్ దేశ రాజధాని దోహా విమానాశ్రయానికి సోమవారం ఉదయం చేరుకున్న వలస కార్మిక నాయకుడు స్వదేశ్ పరికిపండ్ల కు ఖతార్ లోని గల్ఫ్ జెఏసి బృందం స్వాగతం పలికింది. తాళ్ళపెల్లి ఎల్లయ్య, మధుకరన్, సుందరగిరి శంకర్ గౌడ్, చింతకుంట మహేందర్ లు స్వాగతం చెప్పిన వారిలో ఉన్నారు. ఈనెల 13 నుంచి 15 వరకు మూడు రోజుల పాటు ఖతార్ లో జరుగనున్న రక్షిత, సక్రమ, క్రమబద్ధ వలసల కొరకు ప్రపంచ సంఘటిత ఒప్పందం (గ్లోబల్ కాంపాక్ట్ ఫర్ సేఫ్, ఆర్డర్లీ అండ్ రెగ్యులర్ మైగ్రేషన్ - జిసిఎం) అమలు సమావేశంలో స్వదేశ్ పరికిపండ్ల పాల్గొంటున్నారు. గల్ఫ్ దేశాల నుంచి వాపస్ వచ్చిన వారు జీవితంలో స్థిరపడటానికి భారత ప్రభుత్వం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి పథకాలు ప్రవేశపెట్టాయి, ఎలాంటి ప్రణాళికలు రచించాయి. ఇందులోని విజయాలు, వైఫల్యాలపై స్వదేశ్ ఒక విశ్లేషణ పత్రాన్ని సమర్పిస్తారు. ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను (సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్) సాధించడానికి గల్ఫ్ దేశాల నుండి భారతదేశానికి




వాపస్ వచ్చిన వలస కార్మికుల పునరావాసం, పునరేకీకరణ ఒక వాహకంగా ఏ విధంగా ఉపయోగపడుతుంది అనే అంశంపై ఆయన ఈ సమావేశంలో ప్రసంగిస్తారు.

# వీఆర్ఏల ముందస్తు అరెస్ట్

**ఎల్కతుర్తి సెప్టెంబర్ 12 (ప్రజామంటలు):** వీఆర్ఏల సమ్మెలో భాగంగా మంగళవారం అసెంబ్లీ ముట్టడికి వీఆర్ఏ జేఏసీ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే ఈ నేపథ్యంలో హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం నుంచి ఎవరు ఈ కార్యక్రమంలో పాల్గొనకుండా పోలీసులు




తెల్లవారుజామున 5:00 గంటల నుండి ఇళ్లలోకి వెళ్లి ముందస్తు అరెస్టులు చేయడం జరిగినది వీఆర్ఏ ల తో పాటు కాంగ్రెస్ నాయకులు ముట్టడికి మద్దతు తెలిపిన నా కాంగ్రెస్ నాయకులను కూడా కొందరిని ఉదయమే అరెస్టు చేశారు. వారిని 9:00 గంటల సమయంలో వదిలేశారు. వీఆర్ఏల అందర్నీ రేపు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో భాగస్తులు కారాదని అందరి చేత వాంగ్మూలం తీసుకొని 2 గంటల సమయంలో వదిలి వేయడం అయినది. ఇందులో భాగంగా వీఆర్ఏల అధ్యక్షుడు వలబోజు విష్ణుమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఓరే మహేందర్, గొడిశాల నరేష్, వీఆర్ఏలు ఉపేందర్ గుడెల్లి కుమార్, స్వాతి, చంద్రకళ, రాజయ్య పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి బియ్యం అందజేత

**చిగురుమామిడి సెప్టెంబర్ 12 ( ప్రజామంటలు):** వరుకోలు సురేష్ అకస్మాత్తుగా అనార్యోంతో అకాల మరణం చెందారు. వారి



కుటుంబానికి అండగా స్టీరింగ్ కమిటీ వైస్ చైర్మన్ మొగిలి లక్ష్మయ్య, తెలంగాణ పట్ట భద్రుల ప్రధాన కార్యదర్శి నందగిరి జగదీశ్వర చారి, కరీంనగర్ జిల్లా వికలాంగులు జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ కంధి నాగరాజు ఆధ్వర్యంలో 75 కేజీ ల రైస్ బ్యాగ్ సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో స్వచ్చాంద సంస్థ వేస్సో చారిటేబుల్ ట్రస్ట్ హైదరాబాద్ గుళ్ల కనుకయ్య, వేల్దండి అనిల్, నార్లపురం సంపత్, పిల్లి యాదగిరి, బత్తిని మమత సురేందర్ పాల్గొన్నారు.

# రక్తహీనతపై అవగాహన

**ధర్మపురి సెప్టెంబర్ 12 ( ప్రజామంటలు):** ధర్మపురి లోని మైనార్టీ



కాలేజీలో పోషన మాసం సందర్భముగా సోమవారం ఐసీడీయస్ సీడీపీఓ సంపద కుమారి, మాట్లాడుతూ.... కిశోర బాలికలకు రక్తహీనత పై అవగాహన కల్పించడం జరిగినది. మంచి పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలి. ఎప్పటికప్పుడు పరిశుభ్రత పాటించాలని చెప్పారు.ప్రతిజ్ఞ కూడా చేయించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఐసీడీయస్ సూపర్ వైజర్ మెడమ్స్ రమాదేవి, విజయలక్ష్మి, పోషన్ అభియాన్ బీసీ ప్రణీత, బీపీఏ శ్రీధర్, అంగన్వాడీ టీచర్లు మరియు అంగన్వాడీ ఆయాలు. పాల్గొనడం జరిగినది.

# కరెంటు షాక్‌తో మహిళ మృతి

**ఎల్కతుర్తి సెప్టెంబర్ 12 ( ప్రజామంటలు):** కరెంట్ షాక్ తో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని చింతలపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ జక్కుల పరమేష్ గ్రామస్థుల



కథనం మేరకు అదే గ్రామానికి చెందిన లోల్లేటి మమత 33 సంవత్సరాలు ఉదయము బట్టలు ఆరవేస్తుండగా ప్రమాదవశాత్తు ఆర వేస్తున్న తీగకు కరెంట్ షాక్ వచ్చి అక్కడికక్కడే చనిపోయింది. మృతురాలి భర్త దేవేందర్ ఉపాధి కోసం సంవత్సరం క్రితం దుబాయ్ కి వెళ్ళాడు. మృతురాలికి 18 సంవత్సరాల కుమారుడు 13 సంవత్సరాల కుమార్తె ఉన్నది. మృతురాలి కుటుంబానికి స్థానిక సర్పంచ్ కుడి తాడి అనిత రాజు, ఎంపీటీసీ బొంకూరి రజిత రవీందర్, పలువురు గ్రామ నాయకులు సందర్శించారు. ఎస్సై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# విపక్షాలు ఏకతాటిపైకి వచ్చేనా !

దేశవ్యాప్తంగా విపక్షాల ఐక్య వేదికకు రంగం సిద్ధం అవుతోంది. ఓవైపు తెలంగాణ సిఎం కెసిఆర్ ఈ విషయంలో గట్టిగానే పోరాడుతున్నారు. మరోవైపు హర్యాణాలో చౌతాలా కూడా బీహార్ సిఎం నితీశ్‌తో కలసి ముందుకు సాగాలని నిర్ణయించారు. మరోవైపు ఈ నెల 25న ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ పార్టీ అధ్యక్షుడు ఓం ప్రకాశ్ చౌతాలా నిర్వహించతలపెట్టిన సమ్మాన్ దివస్ ర్యాలీని కూడా చేపట్టారు. బీజేపీతో తెగదెంపులు చేసుకొన్న తర్వాత బిహార్ సీఎం నితీశ్ కుమార్.. ప్రతిపక్షాల ఐక్యతకు కృషి చేస్తానని ప్రకటిం చారు. విపక్ష పార్టీలతో సంప్రదింపులు ముమ్మరం చేశారు. ఈ క్రమంలోనే నితీశ్, హరియాణా మాజీ సీఎం ఓం ప్రకాశ్ చౌతాలా కలిశారు. అప్పుడే నితీశ్ తన మనసులోని ప్లాన్‌ను చౌతాలా ముందుంచారు. విపక్షాల ఐక్యతపై వారిరువురూ చర్చించారు. ఈ నేపథ్యంలో చౌతాలా 'సమ్మాన్ దివస్ ర్యాలీ'పై ప్రకటన చేశారు. ఇలా ఎవరికి వారు వేర్వేరుగా పోరాడినంత కాలం ఐక్యత సాధ్యం కాదు. తక్షణంగా విపక్షపార్టీలు ఐక్య కార్యాచరణను ప్రకటిస్తేనే ప్రజల్లో నమ్మకం వస్తుంది. అయితే విపక్షాల్లో పెద్దగా కదలిక కానరావడం లేదు. కెసిఆర్‌ను కలిసిన వారిలో కేవలం కర్నాక మాజీ సిఎం కుమార స్వామి మాత్రమే బహిరంగ మద్దతు ప్రకటించారు. ప్రజలు బీజేపీ పాలనతో విసిగిపోయారని రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించడం కోసం బలమైన కూటమిని ఏర్పాటు చేయడమే మా లక్ష్యం అని ఇటీవల ప్రకటించారు. బిజెపి ముక్త భారత్ అన్న నిదాంతో ముందుకు సాగాలని నిర్ణయించారు. ప్రాంతీయ పార్టీలను కూడగట్టే ప్రయత్నాలను ఆయన ముమ్మరం చేస్తున్నా..దేశంలోని అనేక పార్టీలు తమ రాజకీయ ఎజెండాతో ముందుకు సాగుతున్నాయే తప్ప ఐక్యత కోసం కలసి రావడం లేదు. ప్రతిపక్షాల్లో ఎక్కడా చురుకుదనం కానరావండ లేదు. బీహార్ వెళ్లి సిఎం నితీశ్‌ను కూడా కెసిఆర్ కలిసి వచ్చారు. అలాగే మరోవైపు రాహుల్ భారత్ జోడోయాత్ర ద్వారా కాంగ్రెస్ శ్రేణులను ఏకం చేసే ప్రయత్నాల్లో ఉన్నారు. ఈ క్రమంలో ప్రజాస్వామ్యంలో బలమైన ప్రతిపక్షం ఉండాల్సిందే.. ప్రభుత్వాలు చేసే దుర్మార్గాలను అడ్డుకోవాల్సిందే. కేంద్రంలో అయినా,రాష్ట్రంలో అయినా అధికార పార్టీల ఆగడాలను ఎదుర్కోవాల్సిందే. అలాగే విపక్షాల కుటమి కడుతున్నామన్న కెసిఆర్ కూడా తెలంగాణలో ప్రజావ్యతిరేక చర్యలను ముందుగా ఆపాలి. నిజానికి దేశంలో విచ్ఛిన్నకర పాలన ధోరణులు రోజురోజుకు ప్రబలుతున్నాయి. కార్పోరేట్ సంస్థలకు కేంద్రం అండగా నిలుస్తే..కాంట్రాక్టర్లకు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటు న్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వాలను నిలదీయడానికి ప్రజలు కూడా అప్రమత్తంగా ఉంటూ జగగరూకులై ఉండాలి. ఈ నేపథ్యంలో ప్రజలను విభజించే కుట్రలను సమష్టిగా తిప్పికొట్టాలి. ప్రజాస్వామిక సమాఖ్య స్ఫూర్తిని రక్షించేందుకు ప్రత్యామ్నాయ రాజకీయశక్తులన్నీ ఐక్యం కావాల్సిన అవసరమున్నది. ప్రాంతీయ పార్టీల ఐక్యత కూడా నేటి దేశ రాజకీయ తక్షణావసరం. అలాగే ప్రాంతీయ పార్టీల పాలకులకు వ్యతిరేకంగా ప్రత్యామ్నాయం ఉండాల్సిందు. ఇకపోతే బీజేపీకి ప్రత్యామ్నాయం కోసం దేశ ప్రజలు ఎదురు చూస్తు న్నారు. మోడీ నిరంకుశ విధానలను కూడా ఎవరూ హర్షించడం లేదు. వివిధ రకాలుగా పన్నులు పేరుతో దోపిడీ జరుగుతోంది. ఈ క్రమంలో కేసీఆర్ జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించి, దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు రావాలని పోరాటాన్ని ప్రకటించారు. ఇలా ప్రగతికోసం చేసే కృషికి సహకారాన్ని అందించడానికి ఎవరెరవరు ముందుకు వస్తాన్నది కూడా ముఖ్యమే. అందుకోసం రాజకీయ పార్టీని స్థాపిస్తే మా సంపూర్ణ మద్దతు ఉంటుందని కర్ణాటక మాజీ సీఎం



హెచ్‌డీ కుమారస్వామి తొలుత ప్రకటించారు. తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అపార అనుభవం ప్రస్తుత పరిస్థితుల్లో దేశానికి ఎంతో అవసరమని కుమారస్వామి అభిప్రాయపడ్డారు. సకల వర్గాలతో కలిసి ముందుకు సాగి, శాంతియుతంగా ఉద్యమించి తెలంగాణను సాధించి.. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను కేసీఆర్ నెరవేరుస్తున్నారని ప్రశంసించారు. దేశ రాజకీయాల్లో ప్రత్యామ్నాయ వేదిక ఏర్పాటులో కేసీఆర్ క్రియాశీల భూమిక పోషించాలని కోరారు. ఇందుకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. దక్షిణాదిలో ప్రస్తుతానికి కుమారస్వామి మాత్రమే మద్దతు ప్రకటించారు. సీఎం కేసీఆర్ త్వరలోనే జాతీయ పార్టీని ప్రకటించనున్నారని వార్తలను స్వాగతించారు. వర్తమాన జాతీయ రాజకీయాల్లో ప్రత్యామ్నాయ శూన్యత నెలకొన్న నేపథ్యంలో కేసీఆర్ లాంటి సీనియర్ నాయకుడి అవసరం దేశానికి ఎంతో ఉన్నదని తెలిపారు. సీఎం కేసీఆర్‌తో కుమారస్వామి ఆదివారం మధ్యాహ్నం ప్రగతిభవన్‌లో భేటీలో ప్రత్యామ్నాయ రాజకీయ కూటమిపై చర్చించారు. ఎనిమిదేండ్ల స్వల్పకాలంలోనే తెలంగాణ ఎంతో అభివృద్ధి సాధించిందని కెసిఆర్ బలంగా నమ్మకం కలిగిస్తున్నారు. తెలంగాణలో మాత్రమే వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్తు, ఉచిత తాగునీరు, సాగునీరు, వ్యవసాయ అభివృద్ధి, రైతు సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని ప్రకటించారు. గుజరాత్ మోడల్ కాదు...తెలంగాణ మాడల్ దేశవ్యాప్తంగా కావాలన్న సంకల్పాన్ని ప్రకటిం చారు. అందుకోవడం పట్ల ఆశ్చర్యం వ్యక్తంచేశారు. దేశానికి తెలంగాణ మాడల్ అవసరమున్నదని అభిప్రాయపడ్డారు. దేశంలో విచ్ఛిన్నకర పాలన ధోరణులు రోజు రోజుకు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలను విభజించే కుట్రలను సమష్టిగా తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని సీఎం కేసీఆర్ పలు వేదికల ద్వారా ప్రకటించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రమాదకర స్వార్థ రాజకీయ పంథా, దాని పర్యవసానాలపై పదేపదే విమర్శలు గుప్పిస్తున్నారు. దేశాన్ని మత విద్వేషపు ప్రమాదకర అంచుల్లోకి నెడుతున్నారని విమర్శలు గుప్పిస్తున్నారు. దేశ ప్రజాస్వామిక సమాఖ్యస్ఫూర్తిని రక్షించేందుకు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తులన్నీ ఐక్యం కావాల్సిన అవసరమున్నదని పిలుపునిచ్చారు. బీజేపీకి ప్రత్యామ్నా యం కాంగ్రెస్ అనే అభిప్రాయం దేశ ప్రజల్లో ఉందని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. తామే ప్రత్యామ్నా యమని కొందరు ప్రాంతీయ పార్టీల నేతలు వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజాస్వామిక సమాఖ్య స్ఫూర్తి పరిఢవిల్లేలా ప్రాంతీయ పార్టీల ఐక్యత జరిగితే మంచిదే. బీజేపీతో ప్రజలు విసిగిపోయారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించడం కోసం బలమైన కూటమిని ఏర్పాటు చేయడమే మా లక్ష్యం అని ఇటీవల నితీశ్ కూడా ప్రకటించారు. ఈ క్రమంలో ఎవరికి వారు కార్యాక్రమాలు చేపట్టకుండా ఐక్యంగా ముందుకు సాగాల్సి ఉంది. ఐక్య పోరాటాలు చేయాల్సి ఉంది. అప్పుడే ప్రజల్లో విశ్వాసం ఏర్పడుతుంది.




## సాహితీ ప్రేమికులైన పాఠకులకు ప్రత్యేకం

" ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు, " నేటి కథ" శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

-ఎడిటర్.

# ఇది సామాన్యుడి డైరీ

రాత్రి పెనుగాలులు వీయడంతో పాటు భూకంపమూ రావడంతో ఆ గ్రామం ఒక్కసారిగా అతలాకుతలం అయిపోయింది. మిద్దెలు తప్ప పెంకుటిల్లులు , కొట్టాలు ,పెద్ద పెద్ద చెట్లు నేలమట్టమయ్యాయి. అప్రమత్తమయిన ప్రభుత్వం సహాయసేవల నిమిత్తం తెల్లవారుజామునే అక్కడికి చేరుకొని సేవలందిస్తున్నారు. క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి, తీవ్రంగా గాయపడ్డ వారిని ఆసుపత్రికి తరలిస్తున్నారు. ఈ వ్యవహారాన్నంతా ఆ జిల్లా కలెక్టర్ రమేష్ గారు స్వయానా దగ్గరుండి చూసుకుంటున్నారు. రమేష్ గారు ఇంకొంత సిబ్బందితో ఇంటింటికి వెళ్లి అందరిని పరామర్శించి ధైర్యం చెబుతూ, వూర్లో చివరి ఇల్లైన ఓ ఇంటికి చేరుకొన్నారు. నేలమట్టమయిన ఆ పెంకుటిల్లును చూసి లోపలెవరైనా చిక్కుకున్నారేమో అని, వెళ్లి లోపల చూస్తుండగా రమేష్ కాలికి పెంకు గుచ్చుకోగా, కిందకి చూసాడు. వెంటనే కాలు పక్కకు తీసి కింద వున్న దానిని చేతిలోకి తీస్కొని కళ్ళకు అద్దుకున్నాడు. ఆ పుస్తకాన్ని సరస్వతి దేవిగా భావించి. ఇంతలో ఇక్కడ ఎవరూ లేరు సార్ అని సిబ్బంది చెప్పడంతో బయటకు వచ్చి సిబ్బందికి కొన్ని సూచనలు చెప్పి కారులో బయల్దేరాడు.

వెళ్తూ వెళ్తూ ఆ పుస్తకాన్ని తీసి చూసాడు. ఒక రెండు పేజీలు మాత్రమే నింపబడివుంది.వాటిని చదవసాగాడు అందులో ఇలా.......

పంచను డబులు ఎయ్యి
కోలి డబులు ఎయ్యి
పంట్ట లాబం అయిదు ఏలు
పెదదని పెళికి చెసిన అపు పది ఏలు
రెండొ దని పెళికి చెసిన అపు ఏడు ఏలు
పంట్ట ఎయడానికి ముదు ఏలు
ఎరువలు మందులకు రెండు ఏలు
పెదదని పురుడుకు అపు రెండు ఏలు,
రెండొదని పురుడుకు అపు రెండు ఏలు
ఇంట్లో కరుసులకు అపు రెండు ఏలు
అంత ఇరబై ఎనమది ఏలు
నాతొ వున్నది ఏడు ఏలు
అది తిసి వేతే అపు వడితో ఇరబై అయిదు ఏలు
ఇపుడు పతికి కొన పురుగల మందు ఎయ్యి

వచ్చీరానీ తెలుగులోఇలా రాసివుంది. చివరి అక్షరాల దగ్గర నీటి చుక్కలు పడి ఎండిపోయినట్లుగా అనిపిస్తోంది. రమేష్ అంతా చదివి కళ్ళుమూసుకొని ఆలోచించసాగాడు 25,000 నా నెల జీతంలో సగం కూడా ఉండదు. నేను తీర్చాలి కాస్త సహాయం చేయాలి అని మనసులో అనుకున్నాడు. ఇంతలో అతనికి ఆ ఇంటి నుండి బయటికి వస్తున్నపుడు ఓ



వ్యక్తి చెప్పిన విషయం గుర్తుచ్చింది. సారూ......ఆ సుబ్బారావు కుటుంబం వూరెల్లింది అని, ఓ పది రోజులు రామని చెప్పి పోయినారు సారూ....ఇంతలో రమేష్ కి ఆ ఇంట్లో తాను గమనించిన పెట్టె , బట్టలు , సరిగా వేయని వెనుక తలుపులు గుర్తొచ్చాయి . ఏదో అనుమానం వచ్చి డ్రైవర్ ని కారు వెనక్కి తిప్పమన్నాడు. కారు ఇంటిముందు ఆగింది. అక్కడున్న వ్యక్తితో కలిసి మాట్లాడుతూ పొలాల వైపు వెళ్లారు. మనసులో అనుమానం కాస్త భయంగా మారింది రమేష్ కి , ఆ వ్యక్తిని సుబ్బారావు పొలం ఏది అని అడిగాడు. అతను ఓ పొలాన్ని చూపించి ఇదే సారూ అన్నాడు. ఇదికాదు పత్తి పొలం ఎక్కడ అని అడిగితే ఆ వ్యక్తి సుబ్బిగాడికి ఇదొక్కటే పొలం సారూ అన్నాడు. రమేష్ తన చేతిలో పుస్తకాన్ని చూసి ఏదో గుర్తొచ్చిన వాడిలా అతన్ని సుబ్బారావుకి పిల్లలెంతమంది అని అడిగాడు. దానికతను ముగ్గురు ఆడపిల్లలు సారూ, ఇద్దరికి పెళ్లిళ్లు చేసినాడు చిన్నమ్మాయి ఇంట్లోనే ఉంటుంది. ఒక కొడుకు ఉండేవాడు పాము కరిసి చనిపోయాడు సారూ, అన్నాడతను.

అలా మాట్లాడుతూ ఆ పొలమంతా తిరుగుతూ ఒకచోట ఆగారు యేవో శబ్దాలు విని మళ్ళీ ఆ శబ్దాలు ఎక్కడో గుంతలో కుక్కలు అరుస్తున్నట్టు వినిపించాయి. అటుగా వెళ్లి పాడుబడ్డ నీళ్లులేని బావిలోకి చూసారు కుక్కలు దేనికోసమో గొడవపడుతున్నాయి. తీక్షణంగా చూసాడు రమేష్ బావిలోకి అతనికి ఒక పురుగుల మందు డబ్బా కనిపించింది అలాగే ఓ మూలకు చూడగా ముగ్గురు మనుషులను కుక్కలు పీక్కుతింటున్నట్లుగా కనిపించింది. రమేష్ కి ఒళ్ళంతా చెమటలు పట్టేసాయి తాను వూహించిందే జరిగిందా అనే ఆలోచనలో పడ్డాడు. ఇంతలో తన పక్క వ్యక్తి ఎంతపని చేసావురా సుబ్బిగా అంటూ బోరున ఏడుస్తూ ఊర్లోకి పరుగులు తీసాడు. జనమంతా కలిసి సుబ్బారావు కుటుంబాన్ని బావినుండి బయటికి తీశారు. రమేష్ కళ్ళనిండా నీళ్లు తిరిగాయి. తన చేతిలోని పుస్తకాన్ని ఓసారి చూసి దూరంగా విసిరేసి బాధతో అక్కడినుండి వెళ్ళిపోయాడు.

విసరబడ్డ పుస్తకం అంకెలను చూపిస్తూ తిరగబడి నేలను చేరింది. కలెక్టర్ గారు మా సుబ్బిగాడి అప్పు తీరుస్తాను అని మనసులో అనుకున్నప్పుడు, మా సుబ్బిగాడు నాపై కార్చిన ఓ రెండు కన్నీటి బొట్లకు ఫలితం నా ద్వారా రాబోతుందని తెగ సంతోషించాను. కానీ ఆ ఫలితం నీ దాకా వచ్చేలోపే, ఆ సంతోషం నిన్ను చేరేలోపే నువ్వు కుటుంబంతో సహా కాటికి చేరావా మిత్రమా, బాధపడ్డాడు అతను. ఆ ఇంట్లో గోడకి వేలాడి ఎగిరిన రోజుల్ని గుర్తుచేసుకుంటూ, గాలి రావడంతో పైకి ఎగిరి ఆ సుబ్బారావు డైరీ, ఒక సామాన్యుడి డైరీ. అదే గోడకు తగిలించే కాలెండర్. దూరంగా మండుతున్న నిప్పులలోకి దూకి కాలి బూడిదైపోయింది.

లక్కొండ కుళ్ళాయప్ప
గుంతకల్లు
8520800892.

# చక్కగా పాలలో పంచదారలాగా .......






తెలంగాణ తెలుగు భాషా వ్యవహారంలో చక్కగా పాలలో పంచదారలాగా కలిసి పోయిన కొన్ని ఆంగ్ల పదాలు:

1. గా ప్రకాశ్ నా క్లాసుమెంటు.
2. ఆయినె మేనింజర్
3. ఇది పెద్ద కంపిని4బండ్లె పిట్రోల్ పోయించాలె
4. సంటర్ల అప్పుడు ఇందిరగాంది వుండె
5. బొలోట్లు తేవాలె..ఎందుకంటే పాతవాటికి తిరేట్లు పోయినై
6.ఆయినెకేంది సుర్సుల్లల ఒగ పిలాటు కన్నావురం ల ఒగ పిలాటు
7.ఓ..పోడ!ఇస్కూలుకు పోవారా?
8.గా ఇస్రుక్కు డ్రైవర్ ఏడ పాడైందో దొర్కుతలేదు
9. శిన్నప్పుడు నేను గూడ మొకానికి సునో పూసుకుని మీదికెల్లి పోడర్ ఏసుకున్న
10. ఆయ్..వదినే..ఈ చీరెకు బాడర్ ఎంత మంచిగ వచ్చింది!ఏ కాలమాయె నీ బనీన్లు చినిగిపోయి?
11. చేర్లు అన్ని ఏసింద్రా?
12. సారు చిన్నప్పుడు చూచిరాతకు ఫేర్ అని రాస్తే నాకు గుర్రమెక్కినంత సంబురమయేది.
13. బేంచిమీద నిలవెడుదురు సార్లు జవాబు చెప్పకపోతే
14. గిఃత మంది పిల్లల్ వద్దయ్యా బర్త కంట్రోల్ చేయిం చుకో అని మత్తుగ మొత్తుకున్న..విన్నడా?
15. సైకిల్ పంపుచార్ ఐంది..ఎట్లనుల్లో15డేబర్ సాబ్..జెర్ర బస్ ఆపు.
16. ఓల్డన్ ఓల్డన్ ఎఃత మొత్తుకున్నా బస్సాపలే
17. ఆ గడియారం ఓరాయిలింగ్ చేయించాలె18ఇది నైటాల్టు బస్సా?
18. కొచ్చెన్లు మస్తు అర్దు వున్నై.
19. ఈ బిజిలికి మెంటల్ పోయింది.
20. నీ దగ్గర చాక్మార్ వుంటె ఇయ్యరాదు, పెన్సిల్ చెక్కుకుంట.
21. నేను మా దేవయ్య సార్ దగ్గర క్లాసు పుస్తకాలు మొత్తం సట్టు కొత్తయి కొందుంటి
22. బబ్బులింగం నోట్లె పెట్టుకున్న
23. గిట్లనే ఏదన్న రిపేరైతె పనికస్తయని పానాలు అన్ని కొన్న,కని టైముకేది దొర్కది.
24. జాగ ఈంచు మందం పోనియ్యాజి

ఇలా బకిటు,జాకిటి, పిలేటు,సిలేటు,రోడు,బాల్,సెల్ ఈరో,ఈరోయిన్,విలన్,అండర్వెల్,ఇంటర్వెల్,ఇంగిల్ పీసుల కెల్లి తమ నిజ స్వరూపం మార్చుకుని వచ్చినై.

-నలిమెల భాస్కర్,

## శృంగేరి మహా మాసపత్రిక సంపాదక మండలిలో
# 'బాచంపెల్లి' కి స్థానం
### ధర్మపురి వాసికి అరుదైన గౌరవం

శృంగేరీ మహా సంస్థాన ఆస్థాన పౌరాణికులు, రాష్ట్ర ముఖ్యమంత్రిచే పలు మార్లు సన్మానితులు, ధర్మపురి క్షేత్రానికి చెందిన డాక్టర్ బాచంపెల్లి సంతోష్ కుమార్ శాస్త్రికి శృంగేరి జగద్గురు మహా సంస్థానం వారి శంకర కృప మాసపత్రిక సంపాదక మండలిలో చోటు లభించింది.

సంతోష్ కుమార్ శాస్త్రి, ధర్మపురి క్షేత్రంలో 1976 ఫిబ్రవరి 11న జన్మించి, బిఎ లిటరేచర్, ఎంఏ తెలుగు, సంస్కృతం పూర్తి చేసి, ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఆర్ట్స్ విభాగంలో ప్రథముడుగా నిలవడమే కాక, తెలుగులో బంగారు పతకాలు సాధించి విశ్వ విద్యాలయ రికార్డు నెలకొల్పారు. కృష్ణ యజుర్వేదా ధ్యయనం, ఆగమ శాస్త్రాధ్యయనం గావించి, ప్రముఖ పౌరాణికులు మాణిక్యశాస్త్రి పౌత్రునిగా, హిందీ సాహిత్య రత్న నరహరి శర్మ పుత్రునిగా, బాచంపెల్లి వంశ దత్తునిగా, దివంగత బ్రహ్మశ్రీ మల్లాది చంద్రశేఖర శాస్త్రి ప్రియశిష్యునిగా, శృంగేరీ పీఠ ఆస్థాన పౌరాణికులుగా గుర్తించ బడినారు. 1997లో పౌరాణిక ప్రవర, 2000లో పురాణ వాచస్పతి, 2001లో పౌరాణిక రత్న అవార్డులు పొంది, శృంగేరి, గుంటూరు, విజయవాడ, చండీఘర్, ముంబై, అమృతసర్. బెంగుళూరు, లండన్, అమెరికా లాంటి రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలలో పలు జ్ఞాన యజ్ఞాలు, సుందరా కాండ భగవద్గీత సప్తాహాలను నిర్వహించి, అష్టాదశ పురాణాలు ప్రవచనాలు గావించారు. దూరదర్శన్, ఈటివితో పాటు వివిధ తెలుగు ఛానెళ్ళలో నృసింహ వైభవం, తదితర ప్రవచనాలు గావించి, టివి 9లో భద్రాచల సీతారామ కళ్యాణం గురించి, భక్తి ఛానల్ ద్వారా తిరుపతి వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాల ప్రత్యక్ష ప్రసారం గావించారు. తేజ, జడ్ టివిలలో తిరుప్పావై తదితర అంశాలపై చేసిన ప్రవచనాలు ప్రతిష్ఠను ఇనుమడింప చేశాయి. శ్రీవేంకటేశ్వర భక్తి చానల్ జనరల్ మేనేజర్ (ప్రోగ్రాం)గా లబ్ధప్రతిష్ఠు లైన శాస్త్రి "ఆర్ష విజ్ఞాన కరదీపిక" లాంటి గ్రంథాలెన్నో రచించారు. 2007నుండి ఇంగ్లాండు, బర్మింగాం, ట్యూవర్త్ లాంటి విదేశాలకు ప్రవచనాలకై వెళ్ళి వచ్చారు. పిన్న వయసులోనే ఇంతటి లబ్ధ ప్రతిష్టులై, ఆంధ్రప్రదేశ్ టెలివిజన్, థియేటర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా 2008కి సంబంధించి, "గురుదేవోభవ"కు ఉత్తమ యాంకర్ గా టివి నంది అవార్డును పొంది, ఇటీవలే ఉస్మానియా విశ్వ విద్యాలయం ద్వారా గౌరవ డాక్టరేట్ పొందిన సంతోష్ కుమార్ శాస్త్రి తెలంగాణ ప్రభుత్వం పక్షాన





నిర్వహించే ఉగాది పంచాంగ శ్రవణ కార్యక్రమాలలో వరుసగా ఐదు నాలుగు సార్లు పంచాంగ పఠనం గావించి, సిఎం కేసిఆర్, చీఫ్ సెక్రటరీల ద్వారా సన్మానితులైనారు. రాష్ట్రంలో లబ్ధప్రతిష్ఠులైన సంగనభట్ల మాణిక్య శాస్త్రి పౌత్రులైన సంతోష్ శాస్త్రి, ధర్మపురి భాగవత సప్తాహ కార్యక్రమ పరంపరను కొనసాగించే నిర్ణయం గైకొని, స్థానికుల సహకారం తో సౌజన్యంతో పురిటిగడ్డపై భాగవత సప్తాహ ఆధ్యాత్మిక ప్రవచనాలను బ్రాహ్మణ సంఘ భవనంలో క్రమం తప్పకు నిర్వహిస్తున్నారు. ఇటీవలే లండన్, అమెరికా దేశాలలో ఆధ్యాత్మిక ప్రసంగాలు గావించి, సెప్టెంబర్ 3నుండి 10 వరకు ధర్మపురి క్షేత్రంలో భాగవత సప్తాహం పూర్తి చేసి జగద్గురువుల ఆదేశం మేరకు, వెంటనే బయలుదేరి ఆదివారం ఉదయం శృంగేరి చేరుకొని జగద్గురువుల దివ్యచరణారవింద దర్శనం చేసుకొని, స్వామివారి సంపూర్ణ అనుగ్రహమును పొందడం జరిగింది.

శృంగేరి జగద్గురు మహా సంస్థానం వారి శంకర కృప మాసపత్రిక సంపాదక మండలిలో... శ్రీ శలాక రఘు నాథశర్మ ప్రధాన సంపాదకులుగా... బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, తన్గిరాల శివకుమార శర్మ, దర్భ శ్రీ రామచంద్ర మూర్తి లను ఉపసంపాదకులుగా సంపాదక మండలిలో నియమించడం జరిగింది.



రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# ఆసియా కప్‌లో అద్భుతం ఆవిష్కరణ

దుబాయ్,సెప్టెంబరు12 ): ఆసియా కప్‌లో మరోమారు అద్భుతం చోటు చేసుకుంది. ప్రధాన ప్రత్యర్థులైన భారత్, పాక్‌లు ఇంటిదారిపట్టి శ్రీలంక కప్పును ఎగురేసుకుని పోయింది. నిజానికి మ్యాచ్ ప్రారంభం అయినప్పుడు శ్రీలంక పై ఎలాంటి అంచనాలు లేవు. అయితే ఆటల్లో అద్భుతాలు జరగవచ్చని శ్రీలంక రుజువు చేసింది. ఓ వైపు భారత్.. మరో వైపు పాకిస్థాన్! కళ్లన్నీ ఈ జట్లపైనే. శ్రీలంకను కనీసం గట్టి పోటీదారుగా ఎవరూ పరిగణించలేదు. కానీ అనూహ్యం! ప్రతికూల



పరిస్థితుల్లో, అసాధారణ పట్టుదలతో అందరి అంచనాలను తలకిందులు చేస్తూ లంక ఆసియాకప్‌ను ఎగరేసుకుపోయింది. అద్భుత ప్రదర్శనతో ఫైనల్లో పాకిస్థాన్‌ను మట్టి కరిపించింది. సూపర్ బ్యాటింగ్‌తో రాజపక్స, ఆల్‌రౌండ్ ప్రదర్శనతో హసరంగ, మెరుపు బౌలింగ్‌తో మదుషాన్ లంకను గెలిపించారు. ఆసియాకప్ టోర్నీ ఆరంభ మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్ చేతిలో ఓడి ఏమాత్రం పోటీలో లేనట్లు కనిపించిన ఆ జట్టు.. ఆ తర్వాత ఒక్కటీ ఓడలేదు. అదిరే ప్రదర్శనతో ఇప్పుడు సగర్వంగా కప్పును ముద్దాడింది. ఆదివారం జరిగిన ఫైనల్లో 23 పరుగుల తేడాతో పాకిస్థాన్‌ను మట్టికరిపించింది. భానుక రాజపక్స 71 పరుగుల భారీ స్కోర్ చేసిన పోరాటంతో మొదట శ్రీలంక 6 వికెట్లకు 170 పరుగులు సాధించింది. రవూఫ్ (3/29) విజృంభించాడు. లంక ఓ దశలో 58కే అయిదు వికెట్లు కోల్పోయి చిక్కుల్లో పడగా.. రాజపక్స గొప్పగా బ్యాటింగ్ చేశాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన హసరంగ డిసిల్వా 36 తో కలసి జట్టుకు మెరుగైన స్కోరును అందించాడు. 171 పరుగుల ఛేదన లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్థాన్ తడబడింది. ప్రమోద్ మదుషాన్ (4/34),హసరంగ డిసిల్వా (3/27) విజృంభించడం తో 20 ఓవర్లలో 147 పరుగులకే ఆలౌటైంది.. రిజ్వాన్ మాత్రమే 49 పరుగుల టాప్ స్కోరర్‌గా నిలిచారు. ఛేదనలో నాలుగో ఓవర్లోనే బాబర్ అజామ్ (5), ఫకార్ జమాన్ (0)లను ఔట్ చేయడం ద్వారా పాక్‌కు మదుషాన్ పాకిస్థాన్‌కు షాకిచ్చాడు. రిజ్వాన్‌తో పాటు ఇఫ్తికార్ (32) రాణించడంతో పాక్ 13 ఓవర్లలో 91/2తో నిలిచింది. బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్ కారణంగా సాధించాల్సిన రన్‌రేట్ బాగా పెరిగినా ఆ జట్టు పోటీలోనే ఉంది. కానీ ఇఫ్తికార్‌ను ఔట్ చేయడం ద్వారా మూడో వికెట్ భాగస్వామ్యాన్ని మదుషాన్ విడదీయడంతో పాకిస్థాన్‌కు గట్టి దెబ్బతగింది. అక్కడి నుంచి ఆ జట్టు చకచకా వికెట్లు కోల్పోయింది. కొన్ని ఓవర్ల ముందే పాక్ ఓటమి ఖాయమైపోయింది. లంక ఫీల్డింగ్ కూడా బాగుంది. ఆ జట్టు ఫీల్డర్లు చక్కని క్యాచ్‌లు అందుకున్నారు. శ్రీలంకకిది ఏమాత్రం ఊహించని స్కోరే. ఆ జట్టు ఆరంభం చూస్తే.. కనీసం పోటీ ఇవ్వడం కూడా కష్టమే అనిపించింది. కానీ భానుక రాజపక్స అదిరే స్ట్రోక్ ప్లేతో లంక మంచి స్కోరును అందుకుంది. శ్రీలంక టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగగా.. నసీమ్ షా, రవూఫ్ తమ పదునైన పేస్‌తో ఆ జట్టును బెంబేలెత్తించారు. మూడో బంతికే కుశాల్ (0)ను బౌల్డ్ చేయడం ద్వారా నసీమ్ లంక పతనాన్ని ఆరంభించగా.. ఆ తర్వాత రవూఫ్ విజృంభించాడు. నాలుగో ఓవర్లో నిశాంక (8)ను ఔట్ చేసిన అతడు.. తన తర్వాతి ఓవర్లో గుణతిలక (1)ను వెనక్కి పంపాడు. లంక పతనం వేగంగా సాగింది. ధనంజయ డిసిల్వా (28)ను ఇఫ్తికార్, శానక (2)ను 9వ ఓవర్లో షాదాబ్ ఔట్ చేయడంతో ఆ జట్టు 58/5తో పీకల్లోతు కష్టాల్లోకి కూరుకుపోయింది. ఆ దశలో ఫైనల్ ఏకపక్షమౌతుందేమో అనిపించింది. కానీ రాజపక్స అద్భుత బ్యాటింగ్‌తో లంకను గట్టెక్కించాడు. హసరంగ డిసిల్వాతో కలిసి జట్టును ఆదుకున్నాడు. ధాటిగా ఆడిన రాజపక్స.. చక్కని షాట్లతో అలరించాడు. హసరంగతో ఆరో వికెట్‌కు 58, కరుణరత్నె (14 నాటౌట్)తో అభేద్యమైన ఆరో వికెట్‌కు 54 పరుగులు జోడించాడు. ఆఖరి నాలుగు ఓవర్లలో శ్రీలంక 50 పరుగులు రాబట్టింది. మొత్తంగా అటు బ్యాటింగ్‌లోనూ, బౌలింగ్‌లోనూ పటిష్టగా రాణించి కప్పును స్వాధీనం చేసుకుంది.

## ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలు

**మాజీ ఎమ్మెల్యే భూపతిరావు మృతికి సంతాపం**
**పలుసవరణ బిల్లులు ప్రవేశపెట్టిన మంత్రులు**

హైదరాబాద్,సెప్టెంబరు12: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు సోమవారం తిరిగి ప్రారంభ మయ్యాయి. ఇటీవల మరణించిన పాలేరు మాజీ ఎమ్మెల్యే బీ భూపతిరావు మృతికి సంతాపంగా శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి తీర్మానం ప్రవేశపెట్టారు. రెండు నిమిషాలపాటు సభ సంతాపం తెలిపింది. అనంతరం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ జీఎస్టీ సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. దీంతోపాటు మున్సిపల్‌శాఖ చట్ట సవరణ, అజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా చట్ట సవరణ బిల్లులను మంత్రి కేటీఆర్, వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించిన సవరణకు సంబంధించిన బిల్లును మంత్రి హరీశ్‌రావు, అటవీ యూనివర్సిటీ బిల్లును మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, తెలంగాణ యూనివర్సిటీ కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు సంబంధించిన బిల్లును మంత్రి సబితా ఇంద్రారెడ్డి, తెలంగాణ మోటర్ వెహికిల్స్ టాక్సేషన్ సవరణ బిల్లులును మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ప్రవేశపెట్టారు. విపక్షాలు ప్రవేశపెట్టిన వాయిదా తీర్మానాలను స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి తిరస్కరించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన విద్యుత్ సవరణ బిల్లు-పర్యవసానాలపై లఘు చర్చను ఎమ్మెల్యే బాల్క సుమన్ ప్రారంభించారు. ఇదే అంశంపై మండలిలో ఎమ్మెల్సీ మధుసూదనాచారి లఘు చర్చను ప్రారంభించారు. ఐదు రోజుల విరామం తర్వాత తెలంగాణ అసెంబ్లీ, శాసనమండలి సమావేశాలు సోమవారం ఉదయం 10గంటలకు ప్రారంభ మయ్యాయి. అటవీ విశ్వవిద్యాలయం బిల్లును మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, విశ్వవిద్యాలయ సాధారణ నియామకాల బిల్లును, మంత్రి సబితా ఇంద్రారెడ్డి, వాహన పన్నుల సవరణ బిల్లును మంత్రి పువ్వాడ అజయ్, సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ 21వ వార్షిక నివేదికను మంత్రి జగదీష్ రెడ్డి సభలో ప్రవేశపెట్టారు.

## రజత్‌కుమార్ అవినీతిపై ఢిల్లీ హైకోర్టులో విచారణ

**కూతురు పెళ్లి బిల్లులను ప్రైవేట్ సంస్థ చెల్లింపులపై ఫిర్యాదు**

న్యూఢిల్లీ,సెప్టెంబర్12: తెలంగాణ ఐఏఎస్ అధికారి రజత్ కుమార్ అవినీతి ఆరోపణలపై డివోపీటీ వైఖరిపై ఢిల్లీ హైకోర్టుఆగ్రహం వ్యక్తం చేసింది. రజత్ కుమార్ కుమార్తె వివాహానికి సంబంధించిన బిల్లులను ప్రైవేటు కాంట్రాక్టర్లు చెల్లించారంటూ ఆరోపణలు వచ్చాయి. రజత్ కుమార్‌పై వచ్చిన ఆరోపణలపై చర్యలు తీసుకోవాలంటూ డివోపీటీకి తెలంగాణకు చెందిన గవినోళ్ల శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. రజత్ కుమార్‌పై వచ్చిన ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ చీఫ్ సెక్రటరీని డివోపీటీ కోరింది. డివోపీటీనే నేరుగా చర్యలు తీసుకోకుండా తన ఫిర్యాదును రాష్ట్రానికి పంపడంపై ఢిల్లీ హైకోర్టును గవినోళ్ల శ్రీనివాస్ ఆశ్రయించారు. న్యాయమూర్తి యశ్వంత్ వర్మ ధర్మాసనం విచారణ నిర్వహించింది. స్పెషల్ చీఫ్ సెక్రటరీగా ఉన్న రజత్ కుమార్‌పై చీఫ్ సెక్రటరీ ఎలా చర్యలు తీసుకుంటారని ఢిల్లీ హైకోర్టు ప్రశ్నించింది. డివోపీటికి నోటీసులు జారీచేసి రెండు వారాల్లో సమాధానం ఇవ్వాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 30కి హైకోర్టు వాయిదా వేసింది. రజత్ కుమార్‌ను ప్రాసిక్యూట్ చేయాలని కూడా పిటిషన్‌లో గవినోళ్ల శ్రీనివాస్ కోరారు.

## ట్రాఫిక్‌లో చిక్కుకుని పరుగులు తీసిన డాక్టర్

**ఆపరేషన్ టైమ్ కావడంతో కారువదిలి పరుగు**
**డాక్టర్ స్ఫూర్తికి నెటిజన్ల ప్రశంసలు**

బెంగళూరు,సెప్టెంబర్12: బెంగళూరు నగరం ట్రాఫిక్÷-లో చిక్కుకున్న ఓ డాక్టర్ ఆస్పత్రికి పరుగులు తీసారు. తన రోగి ప్రాణాలను కాపాడేందుకు ఓ డాక్టర్ తీసుకున్న ఓ నిర్ణయం అందరికీ ఓ స్ఫూర్తిదాయకమైన కథగా నిలుస్తోంది. మణిపాల్ హాస్పిటల్స్‌లో గ్యాస్ట్రోఎంటరాలజీ సర్జన్ గా డాక్టర్ గోవింద్ నందకుమార్ విధులు నిర్వహిస్తున్నారు. ఆగస్టు 30న అత్యవసర లాపరోస్కోపిక్ పిత్తాశయ శస్త్రచికిత్స చేసేందుకు వెళు తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. సర్జాపూర్-మారాతల్లి మార్గంలో ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకున్న డాక్టర్ గోవింద్ నందకుమార్..ఆలస్యమైతే రోగి ప్రాణానికి అపాయమని గ్రహించారు. అనుకున్నదే తడవుగా ఆ ట్రాఫిక్ లోనే తన కారును వదిలి మూడు కిలోమీటర్లు పరిగెత్తి మరీ కీలకమైన శస్త్ర చికిత్స చేశారు. తాను ప్రతిరోజు సెంట్రల్ బెంగుళూరు నుండి బెంగుళూరుకు దగ్గర్లో ఉన్న మణిపాల్ హాస్పిటల్స్, సర్జాపూర్‌కి ప్రయాణిస్తానని డాక్టర్ గోవింద్ నందకుమార్ తెలిపారు. తాను సర్జరీకి చేసేందుకు సమయానికి ఇంటి నుండి బయలుదేరినా...ట్రాఫిక్ వల్ల తీవ్ర ఆగిపోవల్సి వచ్చిందని చెప్పారు. అయినా తాను శస్త్రచికిత్స చేయడానికి సిద్ధమయ్యానని... ఆ రద్దీలో, కారు డ్రైవర్‌తో సహా వదిలేయాలని నిర్ణయించుకున్నాని తెలిపారు. మరోమారు ఆలోచించకుండా హాస్పిటల్ వైపు పరుగెత్తానన్నారు. అప్పటికే పేషెంట్‌కి అనస్థీషియా వేయడానికి సిద్ధంగా ఉన్న వైద్య బృందం.. తాను రాగానే ఆపరేషన్ ను మొదలుపెట్టామని చెప్పారు. ఫైనల్ గా డాక్టర్ తీసుకున్న నిర్ణయం ఓ మంచి ఫలితాన్నిచ్చింది.

## కాంగ్రెస్ అధికారంలోకి రాగానే

# అధికారిక గీతంగా జయజహే !

హైదరాబాద్,సెప్టెంబర్12: తెలంగాణ వచ్చాక 'జయజయహే తెలంగాణ పాటను కాలగర్భంలో కలిపారని.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆ పాటను రాష్ట్ర అధికారిక గీతంగా ఆమోదిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కోసం కృషి చేయాలని రేవంత్‌రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర దేశంలోనే ప్రకంపనలు సృష్టిస్తోందన్నారు. రాహుల్‌కు వస్తోన్న ఆదరణ చూడలేకే భాజపా చిల్లర మల్లర ప్రచారానికి దిగుతోందని



అన్నారు. జాతీయ జెండాతో పాటు తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక జెండా రూపొందించాలని ప్రతిపాదనలు వచ్చాయని తెలిపారు. మునుగోడు ఉప ఎన్నికల్లో పాల్వాయి స్రవంతి విజయం కోసం అందరం కలిసికట్టుగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పాల్వాయి గోవర్దన్ రెడ్డి ఐదు దశాబ్దాల పాటు మునుగోడు, కాంగ్రెస్ పార్టీకి ఎంతో సేవ చేశారన్నారు. గాంధీభవన్‌లో టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 17న నిర్వహించే కార్యక్రమాలు, మునుగోడు ఉప ఎన్నిక, భారత్ జోడో యాత్ర అజెండా తదితర అంశాలపై నేతల సూచలను కోరారు. ఈ సందర్భంగా రేవంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. మన పేటెంట్‌ను భాజపా, తెరాస హైజాక్ చేస్తున్నాయ్.. 'సెప్టెంబర్ 17న విమోచన దినోత్సవం పేరిట మత విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ ప్రయోజనం పొందాలని భాజపా చూస్తోంది. ఇందుకోసం కార్యక్రమాలు నిర్వహించాలనుకుంటున్నారు. ఆనాడు రాచరిక పాలన నుంచి ప్రజలకు స్వేచ్ఛను అందించిన పార్టీ కాంగ్రెస్. మన పేటెంట్‌ను భాజపా, తెరాస హైజాక్ చేస్తున్నాయి. ఈ రెండు పార్టీలు తెలంగాణ సమాజాన్ని నిట్టనిలువునా చీల్చేందుకు ప్రయత్నిస్తున్నాయి ఈ కుట్రలను తిప్పికొట్టాల్సిన బాధ్యత మనపైనే ఉంది. చరిత్రను కనుమరుగు చేసి కేసీఆర్ తనకు అనుకూలంగా రాసుకొంటున్నారు. వాస్తవ చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్ళాల్సిన బాధ్యత మనపైనే ఉంది. టీఆర్ఎస్‌కు పర్యాయపదంగా వాహనాల రిజిస్ట్రేషన్ కోసం కేసీఆర్ టీఎస్ అని తీసుకొచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దీన్ని సవరించి టీజీ పెట్టుకోవాలనేది ఒక ప్రతిపాదన ఉందని అన్నారు. సబ్బండ వర్గాలను ప్రతిబింబించే తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరముంది. జాతీయ జెండాతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి ఒక ప్రత్యేక జెండా ఉండాలనే ప్రతిపాదనపై మీ సూచనలివ్వండి. మునుగోడు ఉప ఎన్నికల్లో క్షేత్ర స్థాయిలో పని చేసేందుకు 8యూనిట్లుగా విభజించి నాయకులకు బాధ్యతలు నిర్ణయించాం. 300బూత్‌లను చూసుకోవడానికి 150 మందిని నియమించాలని పార్టీ భావిస్తోంది. ఇందులో అందరూ సమానమే.. చిన్న, పెద్ద తేడా ఏమీ లేదు. ఎన్నికల్లో ఆ రెండు పార్టీలూ అడ్డగోలుగా ధనబలాన్ని ఉపయోగిస్తాయి. మనం క్షేత్ర స్థాయిలో తెరాస, భాజపాను ఓడించాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించాలి. కాంగ్రెస్ గెలుపు ధ్వజమెత్తారు. అక్టోబర్ 24న రాహుల్ యాత్ర తెలంగాణకు రాబోతోందని పేర్కొన్నారు. 15 రోజులపాటు తెలంగాణలో భారత్ జోడో యాత్ర కొనసాగుతుందని వెల్లడించారు. మక్తల్ నుంచి మద్నూర్ వరకు 350 కిలోమీటర్లు యాత్ర సాగుతుందన్నారు. మక్తల్ వద్ద రాహుల్ పాదయాత్ర రాష్ట్రంలోకి ఎంటర్ అవుతుందన్న ఆయన..అక్కడి నుంచి దేవరకద్ర, మహబూబ్ నగర్, జడ్చర్ల, షాద్?నగర్, శంషాబాద్, తొండుపల్లి ఔటర్ రింగ్ రోడ్డు, పటాన్ చెరు, సంగారెడ్డి, జోగిపేట్, పెద్దశంకరంపల్లి, మద్నూర్ మీదుగా మహారాష్ట్రలోకి ఎంటర్ అవుతుందని తెలిపారు. ప్రతిరోజు ఒక పార్లమెంట్ నియోజక వర్గంలోని నాయకులు, కార్యకర్తలు పాదయాత్రలో పాల్గొనేలా ప్రణాళికలు రచిస్తున్నామన్నారు. రోజుకు ఒక పార్లమెంటు నియోజకవర్గానికి యాత్రలో పాల్గొనే అవకాశం కల్పించాలని భావిస్తున్నామని తెలిపారు. మూడు పెద్ద సభలు నిర్వహించాలనుకంటున్నామన్నారు. మీ సూచనల ఆధారంగా వీటిపై నిర్ణయాలు తీసుకుంటామని అని పార్టీ నేతలకు రేవంత్ సూచించారు. సెప్టెంబర్ 17పై టీఆర్ఎస్, బీజేపీ డ్రామాలు ఆడుతున్నాయని విమర్శించారు. తమ పోరాటం ముస్లింలకు వ్యతిరేకంగా కాదని, రాచరికానికి మాత్రమే వ్యతిరేకమని చెప్పారు. 2023 సెప్టెంబర్ 17లోపు ఈ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

మునుగోడు ఎన్నిక విషయంలో సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. లాయల్టీ వాళ్ళకే మునుగోడు టికెట్ దక్కిందని ఆయన స్పష్టం చేశారు. ఇవాళ మీడియా సమావేశంలో మాట్లాడిన ఉత్తమ్.. శత్రువులను ఎదుర్కోవాలంటే మనం సమిష్టిగా పనిచేయా ల్సిందే అన్నారు. మునుగోడుకు ప్రతి ఒక్కరు వచ్చి పని చేయాలని తెలిపారు. మునుగోడు కోసం నేతలు ఎవరి ఖర్చు వల్లే భరించాలని సూచించారు. తోచిన కాడికి నేతలు పార్టీకి ఆర్థికంగా సహకరించాలన్నారు. సెప్టెంబర్ 17తో టీఆర్ఎస్, బీజేపీలకు సంబంధం లేదని ఉత్తమ్ తెలిపారు. తెలంగాణకు స్వతంత్రం ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. భారత్ జోడో యాత్ర ద్వారా దేశం మొత్తాన్ని ఏకతాటి మీదకు తీసుకురావడానికి రాహుల్ యాత్ర చేస్తున్నారని వ్యాఖ్యానించారు. హిమాచల్ ప్రదేశ్, గుజరాత్ ఎన్నికల సమయంలో యాత్ర కు బ్రేక్ ఉంటుందని ఉత్తమ్ తెలిపారు.

# అసెంబ్లీ వేదికగా కేసీఆర్ అబద్దాలు

హైదరబాద్,సెప్టెంబర్12:కేంద్ర విద్యుత్ సవరణ బిల్లుపై సీఎం కేసీఆర్ పచ్చి అబద్దాలు చెప్తున్నారని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. బాయిలకాడ మోటార్లకు మీటర్లు పెడ్తదని.. కేంద్రాన్ని బద్నాం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయం ఎక్కడా చెప్పకున్నా అసెంబ్లీ వేదికగా కెసిఆర్ అబద్ధాలు వల్లించారని మండిపడ్డారు. దుబ్బాక, హుజురాబాద్ ఉప ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే బోర్లకు మీటర్లు వస్తాయని ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు మునుగోడు ఉప ఎన్నికతో మరోసారి ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ ఎన్ని కుట్రలు చేసినా..మునుగోడులో బీజేపీయే గెలుస్తుందని స్పష్టం చేశారు. ఉప ఎన్నికలో కేసీఆర్‌కు మనమే మీటర్లు పెట్టాలని పిలుపునిచ్చారు. టిఆర్ఎస్‌కు ఫ్యూజు పీకాలన్నారు. హుజురాబాద్ ఉప ఎన్నిక తర్వాత కేసీఆర్ తెలంగాణ ప్రజలకు మీటర్లు పెట్టారని ఈటల రాజేందర్ అన్నారు. బోర్లకు మీటర్లంటూ కేంద్రాన్ని బద్నాం చేస్తూ..సైలెంట్?గా విద్యుత్ చార్జీలు పెంచారని మండిపడ్డారు. కరెంట్ బిల్లులతో ప్రజలు కన్నీళ్లు పెట్టుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరెంట్ ఛార్జీలపై ఎందుకు చర్చించరని అన్నారు. ప్రజలపై భారం మోపిన కెసిఆర్ దీనిపై ఎందుకు చర్చించలేదన్నారు. బోర్లకు మీటర్లు పెడతామని కేంద్రం ఎప్పుడూ చెప్పలేదని ఈటల రాజేందర్ అన్నారు. రైతులకు సబ్సిడీ ఇవ్వొద్దని చెప్పలేదని వివరించారు. పేదలకు సబ్సిడీ పథకాలు అమలు చేసేందుకు కేంద్రం ఎప్పుడు ముందుంటుందన్నారు. కానీ కేసీఆర్ శాసనసభలో కేంద్రంపై తప్పుడు ప్రచారం చేసి లబ్దిపొందే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిస్కంలు, డిస్ట్రిబ్యూటర్లు, జెన్ కో, ట్రాన్స్ కో కంపెనీలకు బకాయిలు చెల్లించాలని తెలంగాణతో పాటు అన్ని రాష్ట్రాలను కేంద్రం హెచ్చరిందని గుర్తు చేశారు. సింగరేణి దివాలా తీసిందని..దాదాపు రూ.10వేల కోట్లు బకాయిలు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నారని ఈటల రాజేందర్ అన్నారు. డిస్ట్రిబ్యూషన్ కోసం జెన్ కో కంపెనీకి తెలంగాణ ప్రభుత్వం రూ. 7వేల కోట్ల బాకీ ఉన్నదన్నారు. 16వ ఫైనాన్స్ కమిష ద్వారా కేంద్రం తెలంగాణకు రూ. 10వేల కోట్ల సాయం చేసినా..పదే పదే బీజేపీ ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారని మండిపడ్డారు. శాసనసభలో కేసీఆర్ ప్రధాని, బీజేపీ గురించి మాట్లాడుతున్న మాటలు జుగుప్సా కరంగా ఉన్నాయని ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ మాటలు వింటుంటే..ఈయన్నేనా మనం ఓట్లేసి గెలిపించిందని అని ప్రజలు అసహ్యించుకుంటున్నారని చెప్పారు.



## ముగ్గురి ప్రాణాలు తీసిన అతివేగం

**రోడ్డుపై వ్యక్తిని ఢీకొని కిందపడ్డ దంపతులు**
**లారీ దూసుకుపోవడంతో దంపతుల మృతి**

మెడ్చెల్,సెప్టెంబర్12: తొందరగా ఇంటికి వెళ్లాలనే వేగం ముగ్గురి ప్రాణాలను బలిగొంది. మేడ్చల్‌లో తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో.. నవదంపతులతో పాటు, ఓ పాదచారి దుర్మరణం పాలైయ్యారు. మేడ్చల్ పట్టణంలో సోమవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ద్విచక్ర వాహనంపై మెదక్ జిల్లా రామాయంపేట పట్టణానికి చెందిన నవ దంపతులు సాయిరాజ్, సారిక సొంత ఊరు నుంచి హైదరాబాద్‌కు వస్తుండగా మేడ్చల్ బస్ డిపో ఎదురుగా రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని వేగంగా ఢీ కొట్టారు. వేగానికి పాదచారి దూరంగా ఎగిరిపడి చనిపోగా.. రోడ్డుపై పడిపోయిన దంపతుల పైనుంచి వెనుక నుంచి ఇనుము లోడుతో వస్తున్న లారీ వెళ్లడంతో వారు అక్కడికిక్కడే మృతి చెందారు. మృతులు సాయిరాజ్, సారికకు ఈ ఎడాది మార్చిలో పెళ్లి అయ్యింది. వీరు వృత్తిరీత్యా హైదరాబాద్‌లో ఉంటుండగా.. ఆదివారం సెలవు దినం కావటం సొంత ఊరిలో వినాయక నిమజ్జానికి వెళ్లి.. తిరిగి హైదరాబాద్‌కు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. నవదంపతుల అకాల మరణంతో సొంత గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

## నాలుగో విడత బండి పాదయాత్ర

**చిత్తారమ్మ ఆలయంలో పూజలు**
**సూరారం రామ్‌లీలా మైదనం నుంచి యాత్ర ప్రారంభం**

హైదరాబాద్,సెప్టెంబర్12: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నాలుగో విడత ప్రజా సంగ్రామ యాత్ర మొదలైంది. సూరారం కాలనీలోని రామ్ లీలా మైదానం నుంచి ఈ యాత్ర ప్రారంభమైంది. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పిలుపు మేరకు పెద్ద ఎత్తున కుత్బుల్లాపూర్ బీజేపీ శ్రేణులు ఈ యాత్రలో పాల్గొన్నారు. సుభాష్ నగర్ బస్ డిపో వద్ద బీజేపీ జెండాను సంజయ్ ఆవిష్కరించారు. అంతకుముందు బండి సంజయ్ హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి బయలుదేరి గాజులరామారంలోని చిత్తారమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ర్యాలీగా వెళ్లి సూరారంలోని కట్ట మైసమ్మ ఆలయాన్ని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కుత్బుల్లాపూర్ లో ఏర్పాటు చేసిన బీజేపీ బహిరంగ సభలో మాట్లాడారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మొదలైన నాలుగో విడత పాదయాత్ర... ఈ నెల 22న ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని పెద్ద అంబర్ పేట ఔటర్





రింగ్ రోడ్డు సమీపంలో ముగియనుంది. 10 రోజుల పాటు 9 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 115 కిలోమీటర్ల మేర సంజయ్ పాదయాత్ర కొనసాగనుంది. ఈ నెల 17న పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించే తెలంగాణ విమోచన దినోత్సవాలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరుకానున్నందున ఆ రోజున పాదయాత్ర ఉండదు. కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి, కూకట్ పల్లి, సికింద్రాబాద్ కంటోన్మెంట్, మల్కాజిగిరి, మేడ్చల్, ఉప్పల్, ఎల్బీ నగర్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల మీదుగా సంజయ్ పాదయాత్ర కొనసాగనుంది. కేసీఆర్ అవినీతి ప్రభుత్వంతో ప్రజలు విసిగిపోయారని బీజేపీ ఎంపీ కె. లక్ష్మణ్ ఆరోపించారు. ఈ కుంభకోణాల ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించివేయాలని ఆయన మండిపడ్డారు. బండి సంజయ్ ప్రజా సంగ్రామ యాత్ర బహిరంగ సభలో లక్ష్మణ్ మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. రాష్ట్రంలో వీఆర్ఏలు ధర్న చేస్తున్నా.. ఆత్మహత్యాలు చేసుకుంటున్నా ఈ ప్రభుత్వం పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు టీచర్లను, ప్రభుత్వ ఉద్యోగులను కేసీఆర్ నిర్లక్ష్యం చేస్తున్నాడని తెలిపారు. రాష్ట్రంలో ప్రజలకు బీజేపీ పార్టీ అండగా ఉంటుందని లక్ష్మణ్ వ్యాఖ్యానించారు. ఇక్కడ బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. అన్ని వర్గాల ప్రజల సమస్యలను పరిష్కరించ డానికే బీజేపీ సంగ్రామ యాత్ర చేపట్టామని తెలిపారు. కేసీఆర్ మూడో ఫ్రంట్ అని.. ప్రాంతీయ పార్టీలతో కలిసి తిరుగుతున్నడు.. కాంగ్రెస్ కు తోక పార్టీగా టీఆర్ఎస్ మారిందన్నారు. బీజేపీని ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేని కేసీఆర్.. బీజేపీ వ్యతిరేక పార్టీలతో, అవినీతి పార్టీలతో చేతులు కలుపుతున్నాడని ఫైర్ అయ్యారు. ఈ కార్యక్రమంలో డికె అరుణ, విజయశాంతి, కిషన్ రెడ్డి తదితరులు మాట్లాడారు.

# తెలంగాణలో కేసీఆర్ చెల్లని రూపాయి

మొదటిపేజీ తరువాయి..

ఈ దశాబ్దంలో పెద్ద జోక్ అని ఎద్దేవా చేశారు. తెలంగాణలో చెల్లని రూపాయి దేశంలో చెల్లుతుందా అని ప్రశ్నించారు. తెలంగాణను ఉద్ధరించమని రెండుసార్లు గెలిపిస్తే ఏం చేశారని మండిపడ్డారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణగా మార్చారని ÷ర్ అయ్యారు. బండి సంజయ్ నాలుగోవిడత పాదయాత్ర ప్రారంభోత్సవం సందర్భంగా కుత్బుల్లాపూర్‌లోని రామ్‌లీలా మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కిషన్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణను ఉద్ధరించమని రెండు సార్లు



గెలిపిస్తే... పాలన చేతగాక జాతీయ పార్టీ పెడతానం టున్నారు. అసలు 17 సీట్లలో కేసీఆర్‌కు వచ్చింది 9 సీట్లే... వచ్చే ఎన్నికల్లో తెరాసకు ఒక్క సీటు కూడా రాదు. అన్ని పార్టీలు ఏకమైనా... నరేంద్ర మోదీని ఏం చేయలేరు. ధనిక రాష్ట్రాన్ని అప్పులు రాష్ట్రంగా మార్చారు. మోటర్లకు మీటర్లు పెట్టే అవసరం లేదు.. కానీ కేసీఆర్ అవినీతికి మాత్రం మీటర్లు పెడతాం.' కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చ్చే ఎన్నికల్లో తెరాసకు ఒక్క ఎంపీ సీటు కూడా రాదని ఆకాంక్షించారు. కేసీఆర్ ఇంకా ఉంటే ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి వస్తుందని అభిప్రాయపడ్డారు. ట్రాన్స్‌కో, జెన్‌కోలకు రూ.40 వేల కోట్లు నష్టాలు వచ్చాయని వెల్లడించారు. ట్రిపుల్ ఐటీలో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన చెందారు. కేసీఆర్‌ను మించిన అరచకవాది, నియంతృత్వవాది ఇంకొకరు లేరు. వచ్చే ఎన్నికల్లో భాజపా వందశాతం సీట్లు గెలుస్తుంది. అందుకే కేసీఆర్ విష, అబద్ధపు ప్రచారం చేస్తున్నారు. ప్రగతిభవన్ నుంచి ప్రజలు తరిమికొట్టే పరిస్థితి రాబోతుంది. 2024లో నరేంద్ర మోదీ మళ్లీ ప్రధాని అవుతారు.' కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

# 115 ఏళ్ల రికార్డు బద్దలు

మొదటిపేజీ తరువాయి..

తేరుకోకముందే మరోసారి వర్షాలు అందుకున్నాయి.. దీంతో, మళ్లీ వరద ముంపు పెరుగుతోంది. జులై నెలలో రికార్డు స్థాయిలో వర్షాలు కురవగా.. ఆగస్టులో కూడా వానలు దంచికొట్టాయి.. ఇక, రాష్ట్రంలో గత పదేళ్ల సెప్టెంబరు నెలలో ఎన్నడూలేనంత అత్యధిక వర్షపాతం నమోదు అవుతోంది.. గత వారం రోజుల నుంచి వర్షాలు రాష్ట్రాన్ని వీడడంలేదు.. శనివారం ఉదయం 8.30 నుంచి ఆదివారం ఉదయం 8.30 గంటల వరకు.. అంటే 24 గంటల వ్యవధిలో నమోదైన వర్షపాతాన్ని పరిశీలిస్తే.. రికార్డులు బద్దలైపోయాయి..24 గంటల వ్యవధిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లిలో అత్యధికంగా 35.1 సెంటీమీటర్లు వర్షం కురిసింది.. రాజన్న జిల్లా అవునూర్‌లో 20.8, మర్తనపేటలో 20.3, ఎల్లారెడ్డిపేటలో 19.3, మెదక్ జిల్లా అల్లాదుర్గంలో 18, టేక్మాలులో 17.9, కొల్చారంలో 17.6, కరీంనగర్ జిల్లా చిగురుమామిడిలో 16.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.. అయితే, గత పదేళ్లలో సెప్టెంబర్ నెలలో ఒకేరోజులో 35.1 సెంటీమీటర్ల వర్షం కురవడం ఇదే తొలిసారి.. 2019 సెప్టెంబర్ 18న నల్గొండలో 21.8 సెంటీ మీటర్లు వర్షం నమోదు కాగా%ూ% 1908 నుంచి ఇప్పటివరకూ తెలంగాణలో 24 గంటల వ్యవధిలో అత్యధిక వర్షం మాత్రం.. ఖమ్మం జిల్లా కోహెడలో 1996 జూన్ 17న 67.5 సెంటీమీటర్లు నమోదైంది.. ఇక, రెండో అత్యధిక రికార్డు 1983 అక్టోబర్ 6వ తేదీన నిజామాబాద్‌లో 35.5 సెంటీమీటర్లు కాగా.. తాజాగా ఆళ్లపల్లిలో 35.1 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డు అయ్యింది.. దీంతో.. 115 ఏళ్లలో ఇదే మూడో అత్యధికం వర్షపాతంగా వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు.

ఎగువన భారీ వర్షాలతో గోదావరి నదిలో వరద ప్రవాహం క్రమంగా పెరుగుతున్నది. దీంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. కొత్తగూడెం, ములుగు సహా గోదావరి పరివాహక ప్రాంతంలోని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలను అప్రమత్తం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్‌ను సీఎం కేసీఆర్ ఆదేశించారు. అధికారులను సన్నద్ధంగా ఉంచాలన్నారు. సచివాలయంలో తక్షణమే కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేయాలని, ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. గోదావరి పరివాహంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు వంకలు పొంగిపొర్లు తున్నాయి. గత 24 గంటల్లోనే గోదావరిలో ప్రవాహం ఒక్కసారిగా పెరిగిపోయింది. ఎగువన మహారాష్ట్ర గైక్వాడ్ నుంచి కేవలం 57 వేల క్యూసెక్కులు వస్తుండగా.. సింగూరు, నిజాంసాగర్‌తోపాటు రాష్ట్రంలోని స్థానిక వాగుల ద్వారా ఎస్సారెస్పీకి భారీగా వరద వచ్చి చేరుతున్నది. ఆదివారం సాయంత్రానికి 1.75 లక్షల క్యూసెక్కులు నమోదైంది. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 4 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. పార్వతి, సరస్వతి బరాజ్‌ల వద్ద వరద క్రమంగా పెరుగుతున్నది. లక్ష్మీ బరాజ్ వద్ద 5 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతున్నది. ఆదివారం ఉదయం 8 గం టలకు 31.5 అడుగులు ఉన్న నీటిమట్టం సాయంత్రం 6 గంటలకు 36.1 అడుగులకు చేరుకు న్నది.కాళేశ్వరం పుష్కర ఘాట్ వద్ద 9.12 మీటర్ల ఎత్తులో 5.5 లక్షల క్యూసెక్కులుగా ప్రవహిస్తున్నది. భద్రాచలం వద్ద సోమవారం ఉదయానికి మొదటి ప్రమాద హెచ్చరిక చేరుకోవచ్చని కేంద్ర జల వనరుల సంఘం అధికారులు తెలిపారు. ఈ ఏడాది జూలై నెలలో ఒకసారి, ఆగస్టు నెలలో ఒకసారి గోదావరికి వరదలు వచ్చాయి. తాజాగా మరోమారు భద్రాచలం వద్ద గోదావరికి వరద పోటెత్తడంతో లోతట్టు కాలనీ వాసులు, ముంపు వాసులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టాలు కలుగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఉమ్మడి వరంగల్ పరిధిలోని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులను పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అదేశించారు. సోమవారం ఉదయం ములుగు, భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల కలెక్టర్లు, సీపీ, ఎస్పీలు, పంచాయతీరాజ్ శాఖ, ఇతర శాఖల అధికారులతో మంత్రి టెలీఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో గతకొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. మరికొన్ని రోజులపాటు వర్షాలు ఇలానే కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చిరిస్తున్నది.

# చలో అసెంబ్లీ ఉద్యమ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**జనగామ సెప్టెంబర్ 12 (ప్రజామంటలు):** ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యు ఎస్ పి సి తలపెట్టిన చలో అసెంబ్లీ ఉద్యమ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిటిఎఫ్ జనగామ జిల్లా అధ్యక్ష ప్రధాన



కార్యదర్శులు ఇప్ప రాంరెడ్డి, వి.దివాకర్ రెడ్డి అన్నారు. బచ్చన్నపేట పేట/లింగాల ఘనపూర్ మండలంలో పలు పాఠశాలలను సందర్శించి సమస్యలను తెలుసుకున్న వారు విలేకరులతో మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టి ఖాళీలను భర్తీ చేయకపోవడంతో విద్యాబోధన కుంటుబడిందన్నారు. బదిలీలు, పదోన్నతులు లేక ఉపాధ్యాయులు మానసిక ఆందోళనకు గురౌతున్నారన్నారు. పాఠశాలల్లోని ఖాళీలను భర్తీచేయని ప్రభుత్వం కనీసం విద్యావాలెంటరీలను నియమించకపోవడం విచారకరమన్నారు. సిపియస్ ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. దసరా సెలవుల్లో బదిలీల, పదోన్నతుల ప్రక్రియను చేపట్టాలని, 317 బాధిత ఉపాధ్యాయుల అప్పీల్లన్నింటిని పరిష్కరించాలని, పారిశుద్ధ కార్మికులను నియమించాలని, కనీస వసతులను కల్పించి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతంచేయాలన్నారు. రిలే నిరాహార దీక్షలకు ప్రభుత్వం అనుమతించనందున చేపట్టిన రేపటి చలో అసెంబ్లీ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యం. యాదయ్య, యాకస్వామి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రజావాణిలో వచ్చిన సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి

**ప్రజావాణికి 22 ధరఖాస్తులు**

**జిల్లా కలెక్టర్ జి. రవి**

**జగిత్యాల సెప్టెంబర్ 12 (ప్రజామంటలు):** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ జి. రవి అధికారులను ఆదేశించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో స్థానిక



ఐఎంఏ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 22 మంది ప్రజల సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను అదనపు కలెక్టర్లు బి.ఎస్. లత, అరుణశ్రీ తో కలిసి జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ప్రజల నుండి అందిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించుటకు సంబంధిత శాఖలకు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యతతో వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు. ఆర్డీవో వినోద్ కుమార్ మరియు జిల్లా అధికారులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తాళం వేసివున్న ఇళ్లు, గుళ్ళల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగ అరెస్ట్

**వరంగల్ సెప్టెంబర్ 12 (ప్రజామంటలు):** రాత్రి సమయాల్లో తాళం వేసివున్న ఇండ్లతో పాటు దేవాలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగల్లో ఒకరిని వరంగల్ గీసుగొండ పోలీసులు అరెస్ట్ చేయగా మరో నిందితుడు ప్రస్తుతం పరారీలో వున్నాడు. అరెస్టు చేసిన దొంగ నుండి ఆరు లక్షల రూపాయల విలువ గల



వందగ్రాముల బంగారు, వందగ్రాముల వెండి కారు, ద్విచక్రవాహనం, ల్యాప్ టాప్, ఎల్.ఈ.డి టివి, మూడు సెల్ ఫోన్లతో పాటు పదిహేను వేల రూపాయల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ జిల్లా, కాశీబుగ్గ ఎస్.ఆర్ నగర్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ యాకూబ్ పాషా ఆలియాస్ పోలీసులు అరెస్ట్ చేయగా, ఇదే ప్రాంతానికి చెందిన మరో నిందితుడు ఈరెల్లి రఘు ఆలియాస్ కున్న ప్రస్తుతం పరారీలో వున్నాడు. ఈ అరెస్టుకు సంబంధించి వివరాలను వరంగల్ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి వెల్లడించారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన మామునూర్ ఏసిపి నరేష్ కుమార్, గీసుగొండ మరియు సిసిఎస్ ఇన్స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేష్ కుమార్, శ్రీనివాస్, గీసుగొండ ఎస్.ఐ వెంకన్న, గీసుగొండ పోలీస్ స్టేషన్ సిబ్బంది వెంకట్ రెడ్డి, సారయ్య, దామోదర్, కిషన్ రావు, పవన్ కుమార్ మరియు కిషన్ లను వరంగల్ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి అభినందించారు.

# అభివృద్ధి కాంక్షించే వారికి అభ్యాసం అనివార్యం

**"గైడింగ్ లయన్ శిక్షణ కార్యక్రమంలో జిల్లా గవర్నర్ కన్న పరశురాములు"**

**హన్మకొండ సెప్టెంబర్ 12 (ప్రజామంటలు):** ఏ రంగంలోనైనా అభివృద్ధిని కాంక్షించే వారికి శిక్షణ అనివార్యమని లయన్స్ జిల్లా గవర్నర్ కన్న పరశురాములు అన్నారు. లయన్స్ జిల్లా 320 ఎఫ్ ఆధ్వర్యంలో హనుమకొండలో ఈ రోజు జరిగిన గైడింగ్ లయన్ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి ముందస్తు అనుమతి పొందిన క్లబ్ సభ్యులు పాల్గొన్నారు కార్యక్రమాన్ని జిల్లా గవర్నర్ కన్నా పరశురాములు ప్రారంభిస్తు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో ప్రయోజనాన్ని ఇస్తాయని అన్నారు. కార్యక్రమాలలో పాల్గొన్న సభ్యులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మహిళా నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ లయన్స్ అంతర్జాతీయ సంస్థలో వచ్చే ఏడాది మహిళామణి అంతర్జాతీయ అధ్యక్ష పదవి చేపట్టనున్న సందర్భంగా 320ఎఫ్ జిల్లాస్థాయిలో కూడా లైన్స్ సమాజంలో మరింతగా మహిళల భాగస్వామ్యం సభ్యత్వం పెంపొందించడానికి కృషి చేయనున్నట్లు జిల్లా గవర్నర్ కన్నా పరశు రాములు తెలిపారు ఇందుకు సంబంధించి జిల్లాలో ఉన్న పలువురు మహిళా నాయకులతో ఆయన ఒక ప్రణాళిక సిద్ధం చేశారు జిల్లాలో లో వేల మంది సభ్యులు ఉన్నప్పటికీ మహిళల సంఖ్య తక్కువగానే ఉందని ప్రతి క్లబ్ సభ్యుల సంఖ్య పెంచాలని, మహిళల భాగస్వామ్యం పెంపొందించాలని సూచించారు అదేవిధంగా రీజియన్ స్థాయిలో ఇందుకు సంబంధించి ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని ఈ సమావేశాలలో లయన్స్ మహిళా సభ్యులతో పాటు ఆరోగ్య, న్యాయ, నాయకత్వం తదితర సామాజిక అంశాలపై సూచనలు ఇవ్వటానికి సమాజంలో పేరు ఉన్న మహిళలను అతిథులుగా పిలవాలని ఆయన సూచించారు ఇందుకు సంబంధించి డిసెంబర్ నెలలోగా మహిళా సదస్సుల నిర్వహణ పూర్తి చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యచరణను విజయవంతం చేయటానికి మహిళలతో ఒక కోఆర్డినేషన్ కమిటీని కన్నా పరశురాములు నియమించారు. జిల్లా లీడర్షిప్ డెవలప్మెంట్ విభాగం కోఆర్డినేటర్ డా. అజిత్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ శిబిరంలో ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్న జి ఎల్ టి మల్టిపుల్ కోఆర్డినేటర్ ఆవుల గోపాల్ రావు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ లో ప్రోటోకాల్ వద్ద నుండి ప్రతి అంశం నేర్చుకున్నప్పుడే సేవా కార్యక్రమాలు క్లబ్ స్థాయిలో అభివృద్ధి సాధ్యపడుతుందని అన్నారు శిక్షణ లైన్స్ క్లబ్ లో ఒక భాగం అని వీటిల్లో ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు కాగా వేరువేరు అంశాలకు సంబంధించి శిక్షణ కార్యక్రమంలో మాజీ గవర్నర్లు తమ్మెర లక్ష్మీనరసింహారావు కొత్తపల్లి జాన్ బన్నీ పొట్లపల్లి శ్రీనివాసరావు, జిల్లా అడ్మినిస్ట్రేటర్ చంద్రగిరి ప్రసాద్, ఏ. భిక్షపతి సభ్యులకు శిక్షణ ఇవ్వగా ఉపగవార్నర్ కుందూరు వెంకటరెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా





శిక్షణార్థులకు ప్రత్యేక సామాగ్రిని సర్టిఫికెట్లను అందజేశారు. ఈ శిబిరంలో పాల్గొన్న అభ్యాసకులలో ప్రొఫెసర్ ఎర్ర రాంరెడ్డి, డా. చంద్రశేఖర్ ఆర్య, వి. దీప తదితరులు నిర్వాహకులను అభినందిస్తూ స్పందించారు. ఇంకా ఈ కార్యక్రమము లో పి.ఆర్.ఓ. వేణుమాధవ్ రావు, అల్లాడి ప్రభాకర్ రావు, రీజియన్ చైర్మన్లు కటంగూరు రాంగోపాల్ రెడ్డి, వెంకటేశ్వర్లు, ఉషా మూర్త, ప్రమోద్ కుమార్ జిల్లా నాయకులు పి. హరికిషన్ రెడ్డి, ఎన్. సుధాకర్ రెడ్డి, ఏ. మహేశ్ కుమార్, కే. రాజమౌళి, సిహెచ్. శ్రీనివాస్, త్రివేణి రెడ్డి, సిహెచ్ జయశ్రీ, వి. శారద, నాగవాణి, సులోచన సునీత, రాఖీ, కమరుణ్ణిసా బేగం తదితరులు పాల్గొన్నారు. ఈ శిబిరంలో పాల్గొన్న అభ్యాసకులలో ముందుగా వచ్చిన ములుగు క్లబ్ అధ్యక్షుడు చుంచు రమేశ్ కు గవర్నర్ జ్ఞాపిక ప్రదానం చేశారు.

# ప్రజా సమస్యలకు తక్షణమే పరిష్కారం

**జనగామ సెప్టెంబర్ 12 (ప్రజామంటలు):** ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ శివలింగయ్య అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి సమావేశ మందిరంలో గ్రీవెన్స్ డే సందర్భంగా ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల వద్ద నుండి పలు విజ్ఞప్తులు స్వీకరించారు. స్టేషన్ఘన్పూర్ మండలం రాఘవాపూర్ కు చెందిన గౌడ కులస్తులకు కోటి వరాల పథకం కింద 15 మందికి నాలుగు ఎకరాల భూమి కొనుగోలు చేసి ఇవ్వడం జరిగిందని, కబ్జాదారులు ఆక్రమించి విక్రయిస్తున్నందున అధికారులు చర్యలు తీసుకోవాల్సిందిగా ఎల్ల స్వామి, మల్లేష్, వెంకటస్వామి తదితరులు విజ్ఞప్తి చేశారు. పాలకుర్తి మండలం చెన్నూరు కు చెందిన రైతు బన్నేపాక అంజయ్య తన దరఖాస్తు అందిస్తూ ప్రభుత్వం ఎస్సారెస్పీ కాలువ క్రింద 1.7 ఎకరాల భూమికి 7 లక్షల 5 వేలు జమ చేశారని తన తమ్ముడు సోమ నరసయ్య ఫిర్యాదుతో హెూల్డ్ లో పెట్టారని ఎంక్వయిరీ జరిగి తనదే అని అధికారులు నిర్ధారించిన బ్యాంక్ అధికారులు హెూల్డ్ లో పెట్టడం వలన నేటికీ నగదు తీసుకోలేకపోతున్నానని అధికారులకు వివరించారు. గోపరాజు పల్లి కి చెందిన నర్సింహులు తన కూతురు రెడ్డబోయిన హస్మిత వివాహం 2017లో జరిపించడం జరిగిందని కళ్యాణ లక్ష్మికి దరఖాస్తు చేసుకోగా నేటికీ మంజూరు కాలేదన్నారు. బచ్చన్నపేట మండలం లింగంపల్లి కి చెందిన కె రామ్ రెడ్డి తాను లారీ ప్రమాదంలో దివ్యాంగుడిగా మారానని వికలాంగుల పింఛన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే జనగాం మండలం వావిలాలకు చెందిన వనపర్తి కృష్ణయ్య 2019లో కార్ యాక్సిడెంట్ అవడం వలన మతిస్థిమితం కోల్పోయి ఎర్రగడ్డ ఆసుపత్రిలో చికిత్స పొందినట్టు తెలుపుతూ సదరం ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్



మాట్లాడుతూ.... ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ గ్రీవెన్స్ డే లో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ జడ్పీ సీఈవో విజయలక్ష్మి డిఆర్డి ఏపిడి రాంరెడ్డి జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పది వసంతాల సేవ యజ్ఞం

- **10 ఏండ్లు పూర్తి చేసుకున్న స్కై ఫౌండేషన్**
- **వెయ్యికి పైగా సేవా కార్యక్రమాలు**

**సికింద్రాబాద్ సెప్టెంబర్ 12 (ప్రజామంటలు):** తన స్వంత ప్రయోజనాలే తప్ప ఎదుటోడి కష్టాలను పట్టించుకోని రోజులివి. ఇక సేవ అనే మాట వినిపించడమే దాదాపుగా కనుమరుగవుతున్న కాలంలో తమకు ఏమీ కాని రోడ్డు పక్కన ఏ దిక్కు మొక్కు లేకుండా ఓ వైపు ఆకలితో అలమటిస్తూ మరో వైపు అనారోగ్యంతో బాధపడుతున్న అభాగ్యులకు అండగా తాము ఉన్నామంటూ పలు సేవా కార్యక్రమాలను ఏండ్ల తరబడిగా చేస్తున్న స్కై ఫౌండేషన్ సంస్థకు నేటితో పదేండ్ల వయస్సు. సరిగ్గా పదేండ్ల క్రితం ఇదే రోజున ఏర్పడిన స్కై ఫౌండేషన్ ఇప్పటివరకు హైదరాబాద్ మహానగరంతో పాటు జనగాం, భువనగిరి ప్రాంతాల్లో మొత్తం ఒక వెయ్యి సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఇప్పటివరకు 212 వారాలు ఫుట్ పాత్ లపై ఉన్నవారికి అన్నదానం చేయగా, కరోనా లాక్ డౌన్ పాండమిక్ కాలంలో దాదాపు రెండు నెలల పాటు ప్రతి రోజు అన్నదానం, స్నాక్స్, వాటర్ ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వంతో ఏడాదిన్నర పాటు శ్రమించి దేశంలోనే మొదటిసారిగా మొబైల్ ఫోన్, ఆధార్ కార్డు గాని లేని రోడ్ల పక్కన జీవించే వారికి కోవిడ్ వ్యాక్సిన్ ఇప్పించి, అందరి చేత 'శహబాష్' అనిపించారు. ప్రతినెలా రెండు, నాల్గవ ఆదివారాలు అన్నదానాలు, మొదటి, మూడవ ఆదివారాలు బట్టల పంపిణీ కార్యక్రమాలను ఎలాంటి ఆటంకం , విరామం లేకుండా చేస్తుండటం గమనార్హం. ఇలాంటి ఎన్నో రకాల సేవ కార్యక్రమాలను నిరంతరాయంగా చేస్తున్న స్కై ఫౌండేషన్ ప్రెసిడెంట్ డా. వై. సంజీవ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ. పావని లను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

**పదేండ్ల వేడుకలు స్కై ఆఫీస్ లో....**

స్కై ఫౌండేషన్ స్థాపించి పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఫౌండేషన్ సేవ సభ్యులు సోమవారం సికింద్రాబాద్ పద్మారావునగర్ లోని స్కై కార్యాలయంలో సంబరాలు జరుపుకున్నారు. కేకు కట్ చేసి, మిఠాయిలు






పంచిపెట్టారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ సంజీవ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ పావని, మెంబర్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పావని మాట్లాడుతూ....రోడ్ల పక్కన ఫుట్ పాత్ లపై దుర్భర జీవనం సాగిస్తున్న అనాథలకు , అభాగ్యులకు ఒక ఆశ్రయం కల్పించి, వారికి సరైన ఆహారం అందించి, వైద్యం, మంచి బట్టలను అందించినప్పుడే స్కై ఫౌండేషన్ లక్ష్యం నెరవేరినట్లు అని అన్నారు. ఆ దిశగా ముందుకు వెళ్ళే ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని, తమ సంకల్పసిద్ధికి అందరి సహకారం అవసరమన్నారు.

# కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్

**మల్యాల సెప్టెంబర్ 12 (ప్రజామంటలు):** అసెంబ్లీ సమావేశాల సందర్భంగా



విఆర్ఎ లకు మద్దతుగా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్ర అసెంబ్లీ ముట్టడికి పిలుపు ఇచ్చిన సందర్భంగా యూత్ కాంగ్రెస్ నాయకులను ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగింది. అరెస్ట్ ఐన వారిలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు లక్ష్మారెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు ముత్యం శంకర్, లక్ష్మణ్ చారి, మారుతి, రామాంజనేయులు తదితరులు ఉన్నారు.





జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎన్నికైన దోనూర్ గ్రామ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కాసెట్టి రమేష్ కు గ్రామపంచాయతీ మరియు గ్రామ ప్రజలు మరియు స్కూల్ కమిటీ తరపున చేసిన కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల కమిటీ అధ్యక్షులు గ్రామ ఉపసర్పంచ్ మధుకర్ మరియు పాఠశాల సిబ్బంది, మరియు గ్రామ ప్రజలు

## ఇరవై దేశాల సి-20 సమావేశంలో ప్రసంగించిన

# భారత ప్రతినిధి మంద భీంరెడ్డి

**హైదరాబాద్ సెప్టెంబర్ 12(ప్రజామంటలు):** 89 బిలియన్ డాలర్ల విదేశీ మారక ద్రవ్యాన్ని పంపిన ప్రవాసులు కోవిడ్ సమయంలో అధిక విమాన చార్జీలు, క్వారంటైన్ చార్జీలతో ఇబ్బంది పెట్టిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గల్ఫ్ నుంచి వాపస్ వచ్చేవారి కోసం విపత్తు నివారణ లాంటి వ్యవస్థను ఏర్పాటు చేయాలని వలస కార్మికులు అభిప్రాయాలు వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఈనెల 13, 14 న జి-20 దేశాల కార్మిక మంత్రుల స్థాయి సదస్సు జరుగనున్న నేపథ్యంలో వలస కార్మికుల అభిప్రాయాలను వ్యక్తం చేయడం కోసం సోమవారం ఇండోనేషియా




లోని 'మైగ్రెంట్ కేర్' అనే సంస్థ సి-20 అనే సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్స్ (సభ్య సమాజ సంస్థలు) సమాంతర సమావేశాన్ని (సైడ్ ఈవెంట్) ను నిర్వహించింది. ఈ సమావేశాన్ని హైబ్రిడ్ మోడ్ (మిశ్రమ విధానం) లో ఇండోనేసియా లోని బాలి లో ప్రత్యక్ష సమావేశం ఏర్పాటు చేసి, జూమ్ ద్వారా వివిధ దేశాల నుంచి ప్రతినిధులు ఆన్ లైన్ లో పాల్గొనేలా నిర్వహించారు. సమావేశంలో జూమ్ ద్వారా ఆన్ లైన్ లో భారత ప్రతినిధిగా పాల్గొన్న వలస వ్యవహారాల విశ్లేషకులు, అంతర్జాతీయ వలస కార్మిక నాయకుడు మంద భీంరెడ్డి మాట్లాడుతూ... కరోనా సందర్భంగా గల్ఫ్ నుంచి భారత్ కు వాపస్ వచ్చిన లక్షలాది మంది కార్మికులు వారికి రావాల్సిన జీతం బకాయిలు, ఎండ్ ఆఫ్ సర్వీస్ బెనిఫిట్స్ (ఉద్యోగ అనంతర ప్రయోజనాలు) పొందలేకపోయారని అన్నారు. గల్ఫ్ లోని కంపెనీ యాజమాన్యాలు కార్మికులకు జీత, భత్యాలు ఎగవేయడంపై 'జస్టిస్ ఫర్ వేజ్ థెఫ్ట్' (వేతన దొంగతనంపై న్యాయం చేయండి) అనే ఉద్యమం నడుస్తున్నది అని వివరించారు. గత సంవత్సరం (2021-22) లో ప్రవాస భారతీయులు నుంచి 89 బిలియన్ అమెరికన్ డాలర్ల విలువైన విదేశీ మారక ద్రవ్యం (ఫారెక్స్) భారతదేశం పొందిందని మంద భీంరెడ్డి అన్నారు. ఇది దేశ జిడిపి (స్థూల దేశీయ ఉత్పత్తి) లో 3 శాతం అని అన్నారు. ఇందులో ఆరు అరబ్ గల్ఫ్ దేశాలలో నివసించే సుమారు 10 మిలియన్లు (ఒక కోటి) మంది భారతీయ కార్మికుల చెమట చుక్కల ద్వారా సంపాదించిన సొమ్మే అధికమని ఆయన అన్నారు. కోవిడ్ సందర్భంగా విదేశాల నుంచి వాపస్ వచ్చిన కార్మికులను అధిక విమాన చార్జీలతో కేంద్ర ప్రభుత్వం, క్వారంటైన్ చార్జీలతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బంది పెట్టాయని మంద భీంరెడ్డి విమర్శించారు. వాపస్ వచ్చిన వారిని ఆదుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి పునరావాస కార్యక్రమాలు చేపట్టలేదని అన్నారు. గల్ఫ్ దేశాల నుంచి రకరకాల కారణాల వలన వాపస్ వచ్చే వారిని ఆదుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఒక శాశ్వత వ్యవస్థ ఏర్పాటు చేయాలని భీంరెడ్డి సూచించారు. కోవిడ్-19 మహమ్మారి వలన ఉత్పన్నమైన పరిస్థితులు, వాతావరణ మార్పులు, యుద్ధాలు, ప్రపంచ ఆర్థిక మాంద్యం, కంపెనీలు దివాలా తీయడం, వీసాలు లేని వారిని వాపస్ పంపే ఆమ్నెస్టీ (క్షమా బిక్ష) లాంటి సంక్షోభాలకు పరిష్కారం చూపేలా ఆకస్మిక ఆపద, విపత్తు నివారణ లాంటి వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు.

### ప్రపంచంలో ప్రకృతిని ఆరాధించే అరుదైన పండుగ

# బతుకమ్మ పండుగ

**నియోజకవర్గం స్థాయి దసరా కోలాట సంబరాల ఫోటీలు**

**పోటీకి ఎటువంటి "ఎంట్రీ ఫీజు లేదు"**

**కొప్పుల స్నేహలత**

**ధర్మపురి సెప్టెంబర్ 12 ( ప్రజామంటలు):** తెరాస మహిళా విభాగం ఆధ్వర్యంలో మరియు ఎల్.యం. కొప్పుల సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సహకారంతో జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం స్థాయి దసరా కోలాట





సంబరాల ఫోటీలు ధర్మపురి ప్రభుత్వ కళాశాల వేదికగా ధర్మపురి నియోజకవర్గ తెరాస మహిళా విభాగం తో కలిపి నిర్వహిస్తున్నామని ఎల్.యం. కొప్పుల సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ చైర్ పర్సన్ కొప్పుల స్నేహలత తెలిపారు. దసరా కోలాటాల సంబరాల పోటీలకు సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్నేహలత మాట్లాడుతూ%ో%. ధర్మపురి నియోజకవర్గం స్థాయి దసరా కోలాట సంబరాల పోటీలు ముఖ్య ఉద్దేశ్యం నియోజకవర్గ మహిళల ప్రతిభను చాటి చెప్పటానికి, మహిళలను ఒకే వేదికపై తీసుకురావాలని చేస్తున్నా ప్రయత్నం చేస్తున్నామని ఆసమే తెలిపారు. ప్రకృతి పండుగ బతుకమ్మ పండుగ, ఈ పండుగ ఆడబిడ్డల పండుగ, ప్రపంచంలో ప్రకృతి ఆరాధించే అరుదైన పండుగ ఏది అంటే ఏమాత్రం సందేహం లేకుండా చెప్పే పండుగ.. బతుకమ్మ పండుగ. బతుకమ్మ అంటే ప్రకృతే. ఆడపిల్లలను 'బతుకు అమ్మా' అని మనసారా ఆశీర్వదించే పండుగ ఈ బతుకమ్మ పండుగ తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత మన ఆడపడుచు ఇష్టమైన బతుకమ్మ పండుగ ప్రపంచంలోనే గుర్తింపు పొందింది. దీనికి ముఖ్య కారణం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ యంపి, ప్రస్తుత నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితయే. ఈ పోటీలు ఈ నెల 22-9-2022 తేదీ నుండి ఘనంగా నిర్వహిస్తున్నట్లు స్నేహలత గారు తెలిపారు. ఈ కోలాట సంబరాల కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈ సెప్టెంబర్ 12.వ తేది నుండి సెప్టెంబర్ 20వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు,

**బహుమతుల వివరాలు:**

నగదు బహుమతులు : ప్రథమ బహుమతి: రూ. 50,000 , ద్వితీయ బహుమతి: రూ. 30,000, తృతీయ బహుమతి: రూ. 20,000. ప్రతిభ కనబర్చిన మహిళకు ప్రత్యేక వ్యక్తిగత కన్సోలేషన్ బహుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. పోటీకి ఎటువంటి "ఎంట్రీ ఫీజు లేదు"
ధర్మపురి నియోజకవర్గ నుండి మొట్టమొదటి సారి మహిళల కోసం నిర్వహిస్తున్న ఈ పోటీలకు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు..

## సైమా లో రెండు అవార్డ్‌లతో సందడి చేసిన బుట్టబొమ్మ

సౌత్ ఇండియా సినీ వర్గాల వారు ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే సైమా అవార్డు వేడుకలు తాజాగా అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ అవార్డు వేడుకల్లో మన టాలీవుడ్ కు చెందిన పలువురు ప్రముఖ స్టార్స్ విజేతలుగా నిలిచారు. ఆడియన్స్ యొక్క ఓట్ల ద్వారా ఈ అవార్డుల ఎంపిక కార్యక్రమం జరుగుతుంది. సైమా లో పుష్ప సినిమా ఏకంగా ఆరు అవార్డులు దక్కించుకుని మొత్తం అందరి దృష్టిని ఆకర్షించింది. అంతే కాకుండా టాలీవుడ్ స్టార్ హీరోయిన్ బుట్టబొమ్మ పూజా హెగ్డే రెండు అవార్డులను సొంతం చేసుకోవడం కూడా ప్రత్యేక విషయం గా నిలిచింది. ఒక్క సైమా అవార్డు దక్కడం గొప్ప విషయం అంటే ఏకంగా పూజా కి రెండు అవార్డులు రావడం చాలా పెద్ద విషయం గా చెప్పుకోవచ్చు. ఉత్తమ హీరోయిన్ కేటగిరీలో పూజా హెగ్డే అవార్డును సొంతం చేసుకుంది. అంతే కాకుండా యూత్ ఐకాన్ ఫీమేల్ కేటగిరీలో కూడా ఈఅమ్మడు అవార్డును తీసుకుంది. ముద్దుగుమ్మ పూజా హెగ్డే రెండు అవార్డులు తీసుకున్న ఆనందంతో సోషల్ మీడియాలో తనకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికి కూడా కృతజ్ఞతలు చెప్పుకొచ్చింది. ఆమె అభిమానులు కూడా మా బుట్ట బొమ్మకు రెండు అవార్డులు అంటూ సంబరపడుతున్నారు. అవార్డు తీసుకునే సమయంలో పూజా హెగ్డే గురించి వేసిన ఏవీలో ఆమె పై సైమా వారు ప్రశంసలు కురిపిస్తూ కామెంట్స్ చేశారు. తెలుగు సినిమా తో పాటు తమిళంలో కూడా వరుసగా సినిమాలు చేస్తున్న ఈ అమ్మడు బాలీవుడ్ లో కూడా పలు సినిమాల్లో నటిస్తున్న విషయం తెల్సిందే.



### తెలంగాణ జాతీయ సమైక్యత వజ్రోత్సవాలను

# ప్రణాళిక బద్ధంగా చేపట్టాలి

**జనగామ సెప్టెంబర్ 12 (ప్రజామంటలు):** తెలంగాణ జాతీయ సమైక్యత వజ్రోత్సవాలను ప్రణాళికబద్ధంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ శివలింగయ్య అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడి ఓసి లోని కలెక్టర్ సమావేశం మందిరంలో తెలంగాణ జాతీయ సమైక్యత వజ్రోత్సవాల నిర్వహణ పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లాలో ఈనెల 16, 17, 18 తేదీలలో నిర్వహించే తెలంగాణ జాతీయ సమైక్యత వజ్రోత్సవాల నిర్వహణకు చేపట్టే ఏర్పాట్లు ప్రణాళిక బద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలో జనగామ, స్టేషన్ ఘన్పూర్, పాలకుర్తి నియోజకవర్గం లలో అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేయాలన్నారు, జనగామలో ప్రిస్టన్ కళాశాల ఎంపిక చేయడం జరిగిందని అలాగే స్టేషన్ఘన్పూర్ లో విద్యా జ్యోతి స్కూలు పాలకుర్తిలో ఎమ్మార్వో కార్యాలయం వద్ద స్థలాలను కార్యక్రమాల నిర్వహణకు సిద్ధం చేయాలన్నారు. 16వ తేదీన ప్రతి నియోజకవర్గంలో సుమారు 15 వేల మందితో ర్యాలీ చేపట్టడం జరుగుతుందని ర్యాలీలో 8వ తరగతి పై చదువుతున్న విద్యార్థులు మాత్రమే పాల్గొనాలని, అదేవిధంగా స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆశా కార్యకర్తలు అంగన్వాడీ టీచర్లు ఏఎన్ఎంలు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులను తరలించేందుకు రవాణా కై పాఠశాలల బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. అందుకు రూట్ మ్యాప్ కూడా సిద్ధం చేసుకోవాలన్నారు. పలు వక్తలు ప్రసంగిస్తారని జాతీయ గీతాలాపన కార్యక్రమం ఉంటుందని ర్యాలీలో పాల్గొన్న వారందరికీ భోజన సౌకర్యాలు ప్రణాళిక బద్ధంగా చేపట్టాలన్నారు. 17వ తేదీన హైదరాబాదులో జరిగే ఆదివాసి బంజారా భవన్లో ప్రారంభోత్సవ కార్యక్రమాలకు జిల్లా నుండి 3 వేల మంది గిరిజన ఉద్యోగులు ప్రజాప్రతినిధులను తరలిస్తున్నందున ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ కార్యాలయంలో జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మంచినీటి సరఫరా శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొంటున్నందున కలెక్టర్ కార్యాలయాన్ని అందంగా అలంకరించాలని సాంప్రదాయ పద్ధతుల్లో మావిడాకుల తోరణాలు పూలతో అందంగా తీర్చిదిద్దాలన్నారు. త్రివర్ణ రంగుల తో బెలూన్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా 2016 నుండి నేటి వరకు



తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి పై మంత్రివర్యులు ప్రసంగించనున్నందున ప్రసంగ నివేదిక కొరకు ఒక పేజీ నిండకుండా ప్రగతి నివేదిక సిపిఓ కార్యాలయానికి పంపించాలన్నారు. 18వ తేదీన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అందుకు పాఠశాల విద్యార్థుల తో జాతీయ సమైక్యత పై కార్యక్రమాలను రూపొందించుకోవాలన్నారు అదేవిధంగా జిల్లాలో పలు కళారూపాలను ఆహ్వానించాలని, తెలంగాణ సాంస్కృతిక సారథులతో కార్యక్రమాలు చేపట్టాలని డీపిఆర్ఓని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, జడ్పీ సీఈవో విజయలక్ష్మి, డిఆర్డిఏ పిడి రామ్ రెడ్డి, జనగామ, స్టేషన్ ఘన్పూర్ ఆర్డీవోలు మధుమోహన్, కృష్ణవేణి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### శాతవాహన యు.పి.ఎస్. చిన్నారులను సత్కరించిన

# జగిత్యాల పద్మశాలి సేవా సంఘం





**జగిత్యాల సెప్టెంబర్ 12 ( ప్రజామంటలు):** పద్మశాలి సేవా సంఘం, జగిత్యాల ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ భక్త మార్కండేయ దేవాలయములో పెట్టిన గణపతి నిమజ్జన కార్యక్రమంలో శాతవాహన యు.పి.ఎస్. వాణీ నగర్ పాఠశాల చిన్నారులు పాల్గొని అత్యంత అద్భుతమైన నృత్యం చేసిన సందర్భంగా చిన్నారులను, వారి తల్లిదండ్రులను సోమవారం ఉ.8:15 ని. లకు దేవాలయానికి ఆహ్వానించి పద్మశాలి సేవా సంఘ అధ్యక్షులు ఆకుబత్తిని (గౌరి) శ్రీనివాస్, ఉపాధ్యక్షులు చింతకింది రవిచందు, ప్రధాన కార్యదర్శి తాటిపాముల వినోద్ కుమార్, సహాయ కార్యదర్శి బోగ రాజు, కోశాధికారి మానపురి శ్రీనివాస్ మరియు డైరెక్టర్లు బొద్దున రాజేశ్, చెట్పల్లి గణేష్, మ్యాన రమేశ్, ద్యావనపల్లి రాజేందర్, మ్యాన శబరి లు గొప్పగా సత్కరించారు. శాతవాహన యు.పి.ఎస్. పాఠశాల డైరెక్టర్ వనమాల గంగాధర్ రజని లకు మరియు అధ్యాపక బృందం అరుణ, లిఖిత, తరుణి, శ్వేత, మమత లకు మరియు వారికి సహకరించిన సుద్దపెల్లి జెడ్పి హైస్కూల్ తెలుగు పండిత్ కస్తూరి వేణుగోపాల్, అలిశెట్టి రాజేష్ బాబు, ఎర్రం రవి లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపి వారిని ఘనంగా సత్కరించారు. ఇదే రోజున పుట్టిన రోజు జరుపుకున్న ఉపాధ్యక్షులు చింతకింది రవిచందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఏకావాహన భజన కార్యక్రమంలో పాల్గొన్న కట్ల రాజం, మెరుగు లక్ష్మి నారాయణ, మహంకాళి ప్రేమలత, గన్నేరువరం రమేశ్ లను సేవా సంఘం సభ్యులు గౌరవంగా సత్కరించారు.






## త్రవ్వకుండానే డబుల్ రోడ్డు పనులు

**- లోతట్టు కు చేరిన బుగ్గారం నివాసాలు**

**డబల్ రోడ్డు వేశారు - మా ఇండ్లు "మురికి నీట ముంచారు"**

**తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి ఆరోపణ**

**బుగ్గారం సెప్టెంబర్ 12 ( ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలో డబల్ రోడ్డు వేశారు - మా గ్రామ ఇండ్లన్నీ లోతట్టు ప్రాంతాలను చేసి "మురికి నీట ముంచారు" అని బుగ్గారం గ్రామ అభివృద్ధి కమిటి చైర్మన్, సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ జనసమితి జిల్లాశాఖ అధ్యక్షులు చుక్క గంగారెడ్డి ఆరోపించారు. నా ఊరు బుగ్గారం సమస్యల వలయంలో నలిగిపోతోందని, పట్టించుకునే నాథుడే కరువయ్యారు, ఆదుకునే అధిపతి లేడని సోమవారం ఆయన "నిజా - నిజాలతో నిత్య ప్రకటన" ప్రారంభం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... రెండు పీట్లు లోతు త్రవ్వి నిర్మించాల్సిన డబుల్ రోడ్డు





పనులు లోతు త్రవ్వకుండానే చేపట్టి ప్రజల నివాస గృహాలను లోతట్టుకు చేర్చారని వివరించారు. నాణ్యతా లోపంతో నిర్మాణ పనులు జరిగాయని, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. ఈ డబల్ రోడ్డు నిర్మాణంతో పాటు గ్రామంలో సరైన రోడ్లు, మురికి కాలువలు లేక, ఇండ్లలోకి చేరిన మురికి కాలువల నీటితో అనారోగ్యాల పాలై, కానరాని అభివృద్ధితో ప్రజలంతా సమస్యల వలయంలో చిక్కుకుపోయారని ఆయన తెలిపారు. డబల్ రోడ్డుకు ఇరుప్రక్కల గల ఇండ్లలోకి వర్షపు నీరు, మురికి కాలువల నీరు చేరడంతో డ్రైనేజి లేక కరంట్ మోటార్లు బిగించి పైపులతో మురికినీటిని, వర్షపు నీటిని ప్రజలే స్వచ్ఛందంగా తరలించుకుంటున్నారని తెలిపారు. డబుల్ రోడ్డు నిర్మాణం పనులు కూడా నిబంధనలకు విరుద్ధంగా నాణ్యతా లోపంతో చేశారని రోడ్లు, భవనాల శాఖ జగిత్యాల జిల్లా అధికారులకు గత జూన్ 16న తాను చేసిన పిర్యాదుకు మూడు నెలలు పూర్తి అవుతున్నా నేటికీ ఉన్నతాధికారులు విచారణకు రావడంలేదని మండిపడ్డారు. కేవలం ఊరులోని ఇండ్ల మట్టుకే 1.4 కిలోమీటర్లు నిర్మించిన ఈ డబల్ రోడ్డు నాణ్యత లోపం, ఎత్తుగా రోడ్డు నిర్మాణంతో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. డబల్ రోడ్డుకు ఇరుప్రక్కల డ్రైనేజీ లేక అధిక వర్షాల నీటితో ఇండ్లన్నీ మున్నిగిపోవడం జరిగిందన్నారు. స్థానిక నాయకులు రోడ్డు వెంట మొత్తం జెసిబి త్రవ్వకాలు జరిపి నీటిని తరలించారని పేర్కొన్నారు. అధిక వర్షాలకు రెండు నెలలు కావస్తున్నా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరగడం లేదన్నారు. వేసిన రోడ్డు వెంటనే చెక్కలు బాసిందని, డివైడర్ లు ఇచ్చుకు పోయాయని ఆరోపించారు. సెంటర్ లైటింగ్, మురికి కాలువల నిర్మాణం పనులు అడ్రస్ లేకుండా పోయాయని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా రోడ్లు, భవనాల శాఖ ఉన్నతాధికారులు ప్రజా క్షేత్రంలో, నాణ్యత లోపం పై, ప్రజా సమస్యలపై సరైన విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఎంతో ఓర్పుతో... బుగ్గారం గ్రామ అభివృద్ధికై ప్రత్యేకంగా దృష్టి సారించి మంత్రి కొప్పుల ఈశ్వర్ నిధులు మంజూరు చేసినా నాణ్యత లోపం పనులతో ప్రజలకు నష్టం కలుగుతోందని చుక్క గంగారెడ్డి అన్నారు. దీనివలన ఈశ్వర్ సార్ నిధుల రూపంలో వరాలు ఇచ్చినా ప్రజల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు.

**రోడ్డు వేసినారెందుకు? - మోరి కట్టలేదు ఎందుకు?**
**కంచర్ల భారతి - సురేందర్**

అయ్యా... అధికారులు, నాయకులు అంతా కలిసి ఈ డబల్ రోడ్డు వేసినారు కానీ, మోర్లు ఎందుకు కట్టడం లేదని బుగ్గారం గ్రామస్తురాలు కంచర్ల భారతి - సురేందర్ ప్రశ్నించారు. త్రవ్వకుండానే రోడ్డు ఎత్తుగా పోశారు. మాఇండ్లను లోతుకు చేశారని, మా ఇంట్లో బాత్రూం నీళ్ళు, మురికి నీళ్ళు, వర్షపు నీరు బయటకు ఎలా పోతాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సైడ్ డ్రైనేజీలు వెంటనే నిర్మించి మా సమస్యలు తీర్చాలని ఆమె కోరారు. ఇది కంచర్ల భారతి - సురేందర్, బుగ్గారం గ్రామస్తురాలి అభిప్రాయం.

# సెప్టెంబర్ 17న జనగామ లో బహిరంగ సభ జయప్రదం చేయండి

**జనగామ సెప్టెంబర్ 12 (ప్రజామంటలు):** హైదరాబాద్ సంస్థానంలో నిజాం నిరంకుశ రాచరిక పాలన, భూస్వాముల దోపిడీ, పీడనలనుండి ప్రజలను విముక్తి చేయడానికి సాగిన మహత్తరమైన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు సెప్టెంబర్ 10 నుండి 17 వరకు వారం రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తున్నామని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోట్ల శేఖర్ అన్నారు. ప్రచార జీపు జాత లింగాల గణపురం మండల కేంద్రం, మండలంలోని మాణిక్యపురం కళ్లెం సిరిపురం జీడికల్లు గుమ్మడివెల్లి బండ్లగూడెం నెల్లుట్ల నవాబుపేట వడిచెర్ల నేలపోగుల గ్రామాలలో సెప్టెంబర్ 17న జనగామ జిల్లా కేంద్రంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలలో నిర్వహించిన సభలకు సిపిఎం మండల కార్యదర్శి బొడ్డు కరుణాకర్, మబ్బు వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు కళ్లెం గ్రామానికి చెందిన బహదూర్ సింగ్ కి అదేవిధంగా సిరిపురం గ్రామానికి చెందిన బొడ్డు యాదగిరి కి సిపిఎం జిల్లా కార్యదర్శి కనక రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొట్ల శేఖర్ సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ భూస్వాములు, జాగీర్దారులు, జమీం దార్లు, దేశ్ ముఖ్ లు, పటేల్, పట్వారీ లు ప్రజలను జలగల్లా పట్టిపీడిస్తుంటే, వెట్టిచాకిరి, కౌలు, లెవీ పేరుతో దోచుకుంటుంటే సహించలేక ఎర్రజెండా కింద అందరినీ సమీకరించి పోరాటం నడిపించింది కమ్యూనిస్టులు. అసమాన త్యాగాలు చేసింది కమ్యూని స్టులు. రాచరికాన్ని అంతం చేసి, భూస్వామ్య వ్యవస్థ నడ్డివిరిచి, వెట్టిచాకిరిని నిర్మూలించి, దున్నేవాడికి భూమిని పంచిన చరిత్ర కమ్యూనిస్టులది. ఇంతటి వీరోచిత పోరాటాన్ని వక్రీకరించడానికి బిజెపి ప్రయత్నాలు చేస్తున్నది. ఈ ఉద్యమంతో ఎలాంటి సంబంధం లేని బిజెపి సెప్టెంబర్ 17 పేరుతో ప్రతి సంవత్సరం మతవిద్వేషాలు రెచ్చగొట్టడం కోసం ప్రయత్నం చేస్తుంది. దీనిని ప్రజలందరూ ప్రతిఘటించాలి. బిజెపి ఆటలను సాగనియొద్దని అన్నారు. రైతాంగ సాయుధ పోరాటంలో అమరులైన వీరులను స్మరించుకుంటూ, వారు చేసిన త్యాగాలను ప్రజలలో ప్రచారం చేస్తూ, వారు ఏ లక్ష్యం కోసం పోరాటం చేశారో, ఆ లక్ష్యాన్ని సాధించడం కోసం ప్రజలను సన్నద్ధం చేయాలని, అదే తెలంగాణ



రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ఉద్దేశమని అన్నారు సెప్టెంబర్ 17న జనగామ జిల్లా కేంద్రంలో జరిగే భారీ బహిరంగ సభకు మండలం నుండి వందలాది మంది హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు భూక్య చందు నాయక్, చుంచు విజేందర్ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి బొట్టు శివ, జిల్లా కోశాధికారి మేకల ప్రసాద్ జిల్లా ఉపాధ్యక్షులు బొట్టుసూరి శైలజ, జిల్లా అధ్యక్షుడు గుంటిపెల్లి బాలు సిపిఎం మండల కమిటీ సభ్యులు తూటి దేవదానం, రాపోలు సమ్మయ్య, గోసంగి శంకరయ్య, మబ్బు ఉప్పలయ్య, చెన్నూరు ఉప్పలయ్య నాయకులు రాఘవేంద్ర ఐలయ్య మేడే శోభ, హాతియా బేగం, మేడే యాదమ్మ, చింత ఎల్లయ్య, బిక్షం గౌడ్, నాయకులు లావుడియా అనిల్ చౌహాన్, వల్లంపట్ల గణేష్ పాల్గొన్నారు.

### కృష్ణంరాజుకు

# మనం ఇచ్చే గౌరవం ఇదేనా

## కనీసం ఓ రెండు రోజులు షూటింగ్‌లు ఆపలేమా
## ట్విట్టర్ వేదికగా రామ్‌గోపాల్ వర్మ విమర్శలు



రామ్‌గోపాల్ వర్మ తాజాగా కృష్ణంరాజు మృతిపై వర్మ స్పందిస్తూ.. టాలీవుడ్ స్టార్స్‌పై సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఆయన ఆకస్మిక మరణం తెలుగు చిత్ర పరిశ్రమని దిగ్భ్రాం÷–రతికి గురిచేసింది. 1966లో 'చిలక గోరింకా' చిత్రంతో తెరంగేట్రం చేసిన కృష్ణంరాజు 56 ఏళ్ల కెరీర్‌లో 180కి పైగా మూవీస్‌లో ప్రేక్షకుల్ని మెప్పించారు. ఆయన మరణం విషయం తెలిసిన పలువురు టాలీవుడ్ ప్రముఖులంతా తమ సంతాపాన్ని తెలియజేశారు. దీనిపై సోషల్ మీడియా వేదికగా వర్మ స్పందించాడు. వర్మ చేసిన ట్వీట్‌లో.. భక్త కన్నప్ప, కటకటాల రుద్రయ్య, బొబ్బిలి బ్రహ్మన్న, తాండ్ర పాపారాయుడు లాంటి అత్యంత గొప్ప చిత్రాలని అందించిన మహానటుడు, గొప్ప నిర్మాత కోసం ఒక్క రోజు కూడా షూటింగ్ ఆపలేని అత్యంత స్వార్థపూరిత తెలుగు సినిమా పరిశ్రమకి నా జోహార్లు. సిగ్గు! సిగ్గు!. కృష్ణగారికి, మురళీమోహన్ గారికి, చిరంజీవిగారికి, మోహన్‌బాబుగారికి, బాలయ్యకి, ప్రభాస్ కి, మహేష్, కల్యాణ్‌కి నేను ఈ విషయం మీద మనవి చేసేదేంటంటే రేపు ఇదే దుస్థితి మీలో ఎవరికీ కూడా తప్పదు. ఒక మహోన్నత కళాకారుడికి ఇవ్వలేని మహోన్నత వీడ్కోలు మన మీద మనమే ఉమ్మేసుకోవడం లాంటిది. మనసు లేకపోయినా ఓకే. కనీసం మన చావుకి విలువ ఉండాలంటే పోయిన కృష్ణంరాజుగారి లాంటి పెద్దమనిషికి విలువ ఇద్దాం .. కనీసం రెండు రోజులు షూటింగ్ ఆపుదాం. డబ్బు ఎక్కువ ఖర్చు అయిపోతోంది అని నెలరోజులు షూటింగ్ ఆపేసిన పరిశ్రమ మనది. మన చావుకి విలువ ఉండాలంటే పోయిన కృష్ణంరాజుగారి లాంటి పెద్దమనిషికి విలువ ఇద్దాం .. కనీసం రెండు రోజులు షూటింగ్ ఆపుదాం' అని వరుసగా ట్వీట్స్ చేశాడు. అంతేకాకుండా.. ఆ పోస్టుకి టాలీవుడ్ టాప్ స్టార్స్‌ని ట్యాగ్ కూడా చేశాడు. కాగా.. వర్మ చేసిన ట్వీట్స్ ప్రస్తుతం వైరల్‌గా మారాయి. తెలుగు సినీ పరిశ్రమపైనే ఈ రేంజ్‌లో వర్మ విరుచుకుపడటానికి కారణం ఏంటా అని అందరూ అనుమానపడుతున్నారు. దాంతో.. వర్మ కామెంట్స్‌ను కొందరు సమర్థిస్తుండగా.. మరికొందరు విమర్శిస్తున్నారు.

## మగబిడ్డకు జన్మనిచ్చిన సౌందర్య రజనీకాంత్



సూపర్ స్టార్ రజనీకాంత్ రెండో కూతురు సౌందర్య రజనీకాంత్ మగబిడ్డకు జన్మనిచ్చారు. ఇప్పటికే సౌందర్యకి మొదటి భర్తకి జన్మించిన కుమారుడు వేద్ కృష్ణ ఉండగా.. ఇప్పుడు మరో బిడ్డకు తల్లైంది. ఈ బిడ్డ సౌందర్య, విషగన్ వనంగమూడి దంపతుల కుమారుడు. ఇక ఈ పిల్లాడికి 'వీర్ రజనీకాంత్ వనంగమూడి' అనే పేరును పెట్టినట్టు తెలుస్తోంది. ఈ విషయాన్ని సౌందర్య రజనీకాంత్ తెలియజేస్తూ... సోషల్ మీడియా వేదికగా కొన్ని ఫొటోలను షేర్ చేశారు. 'దేవుడి దయ, తల్లిదండ్రుల ఆశీర్వాదాలతో వేద్ కృష్ణ తమ్ముడు వీర్ రజనీకాంత్ వనంగమూడికి విషగన్, వేద్, నేను స్వాగతం పలుకుతున్నామనే క్యాప్షన్ ను కూడా ఆమె జతచేశారు. ఈ సందర్భంగా సహకరించిన డాక్టర్లు సుమన మనోహర్, డాక్టర్ శ్రీ విద్య శేషాద్రిలకు సౌందర్య రజనీకాంత్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కుమారుడు, భర్తతోపాటు రెండో కుమారుడితో దిగిన ఫోటోలను ట్విట్టర్ ద్వారా సౌందర్య పంచుకున్నారు. సౌందర్యకి రజనీకాంత్ కు మొదట బిజినెస్ మ్యాన్ అశ్విన్ కుమార్‌తో వివాహం జరిగింది. వీరికి వేద్ కృష్ణ జన్మించారు. కొన్నాళ్లకి అశ్విన్ తో విడిపోయి... 2019లో వ్యాపారవేత్త విషగన్ వనంగమూడిని సెకండ్ మ్యారేజ్ చేసుకున్నారు. తాజాగా వీరికి బాబు వీర్ జన్మించడం విశేషం. ఇదిలా ఉండగా సౌందర్య రజనీకాంత్ దర్శకురాలిగా రాణిస్తున్నారు. ఆమె మొదట గ్రాఫిక్ డిజైనర్‌గా పనిచేశారు. 'పడయప్ప', 'బాబా', 'చంద్రముఖి', 'అన్బే ఆరుయిరే', 'శివకాశి', 'మజా', 'పందెంకోడి', 'చెన్నై600028', 'శివాజీ' చిత్రాలకు గ్రాఫిక్ డిజైనర్‌గా పనిచేశారు. 'కథానాయకుడు' చిత్రంలో గెస్ట్ రోల్‌లోనూ సౌందర్య అలరించారు. 'గోవా' చిత్రానికి నిర్మాతగా వ్యవహరించిన సౌందర్య... మరోవైపు రజనీకాంత్‌తో యానిమేషన్ మూవీ 'కొచ్చడయాన్' చిత్రానికి దర్శకత్వం వహించారు. దీంతోపాటు ధనుష్‌తో 'వీఐపీ2' సినిమాని తెరకెక్కించారు.

## టోరంటో ఫిలిం ఫెస్టివల్‌కు జక్కన్నకు ఆహ్వానం

అద్భుతాలను ఆవిష్కరిస్తూ గొప్ప దర్శక ధీరుడిగా పేరు దక్కించుకున్న టాలీవుడ్ జక్కన్న రాజమౌళికి మరో అరుదైన అంతర్జాతీయ గౌరవం దక్కింది. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన టొరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్




ఫెస్టివల్ నుండి రాజమౌళికి ఆహ్వానం దక్కింది. ఇండియా నుండి అతి తక్కువ మందికి మాత్రమే ఈ అరుదైన గౌరవం దక్కింది. రాజమౌళి తన కొడుకు కార్తికేయతో కలిసి టొరంటో ఫిల్మ్ ఫెస్టివల్ లో పాల్గొన్నాడు. గ్రాఫిక్స్ విషయంలో హాలీవుడ్ సినిమాలతో పోటీ పడే రాజమౌళి ముందు ముందు చేయబోతున్న సినిమాలకు ఇలాంటి గౌరవాలు మరింతగా బూస్ట్ ఇస్తాయి అనడంలో సందేహం లేదు. త్వరలో మహేష్ బాబుతో చేయబోతున్న సినిమాపై ఈ ఆహ్వాన ప్రభావం ఉండాలని మహేష్ బాబు ఫ్యాన్స్ కోరుకుంటూ ఉంటారు. టొరంటో ఫిల్మ్ ఫెస్టివల్ లో జక్కన్న సందడికి సంబంధించిన విషయాల గురించి త్వరలో ఫుల్ క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతానికి జక్కన్న టొరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ లో పాల్గొన్న ఫోటోలు మాత్రం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. జక్కన్న ఈ ఏడాది చివరి నుండి మహేష్ బాబు సినిమా పనిలో పూర్తిగా నిమగ్నం అయ్యే అవకాశాలు ఉన్నాయంటూ సమాచారం అందుతోంది. మహేష్ బాబుతో సినిమాను వచ్చే ఏడాది ఆరంభంలో ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి.

### మహేశ్, త్రివిక్రమ్‌ల మూవీ

# షూటింగ్ స్టార్ట్

### రామోజీఫిలం సిటీలో ఏకబిగిన చిత్రీకరణ




టాలీవుడ్‌లో కొన్ని కాంబోలుంటాయి. ఆ కాంబోలో సినిమా వస్తుందంటే ప్రేక్షకులే కాదు సినీ సెలబ్రెటీలు కూడా ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తుంటారు. అలాంటి కాంబోలలో మహేష్– తివిక్రమ్ కాంబో ఒకటి. వీరిద్దరి కాంబోలో సినిమా వస్తుందంటే అది పక్కా కల్ట్ క్లాసిక్ అని ప్రేక్షకులు భావిస్తుంటారు. గతంలో వీళ్ళ కాంబోలో తెరకెక్కిన 'అతడు', 'ఖలేజా' చిత్రాలు కమర్షియల్‌గా అంతగా సక్సెస్ సాధించకపోయినా బుల్లితెరపై మాత్రం ఘన విజయం సాధించాయి. ఈ రెండు చిత్రాలు టీవీలో వచ్చిన ప్రతిసారి మంచి టీఆర్పీను సొంతం చేసుకుంటాయి. దాదాపు 12ఏళ్ళ తర్వాత వీళ్ళ కాంబోలో మూడో చిత్రం తెరకెక్కుతుంది. ఈ ఏడాది ప్రారంభంలోనే పూజా కార్యక్రమాలు జరుపకున్న ఈ చిత్రం సోమవారం షూటింగ్ మొదలు పెట్టింది. రామోజీఫిలిం సిటీలో షూటింగ్ ప్రారంభమైంది. ఈ ఎపిసోడ్‌లో భారీ యాక్షన్ సన్నీవేశాలను తెరకెక్కించనున్నారట. తాజాగా ప్రొడ్యూసర్ నాగవంశీ ఈ సినిమా షూటింగ్‌ను ప్రారంభించినట్లు ట్వీట్ చేశాడు.. ఈ చిత్రంలో మహేష్‌కు జోడీగా పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తుంది. హారిక అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై ఎస్.చినబాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు. మ్యూజిక్ సెన్సేషన్ థమన్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నాడు. యాక్షన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కు తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 28న తెలుగుతో పాటు తమిళంలోనూ విడుదల కాబోతుంది. ఈ షెడ్యూల్ నెల రోజుల పాటు ఏక ధాటిగా సాగనుందట. ఇదిలా వుంటే ఈ మూవీ తరువాత సూపర్ స్టార్ మహేష్ బాబు స్టార్ డైరెక్టర్ రాజమౌళి దర్శకత్వంలో భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ ని చేయబోతున్న విషయం తెలిసిందే. శ్రీ దుర్గా ఆర్ట్స్ బ్యానర్ పై స్టార్ ప్రొడ్యూసర్ కె.ఎల్. నారాయణ అత్యంత భారీ స్థాయిలో నిర్మించబోతున్నారు. భారీ యాక్షన్ అడ్వెంచర్ గా ఈ మూవీని రాజమౌళి అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరపైకి తీసుకురాబోతున్నారు. అయితే ఈ ప్రాజెక్ట్ ఎలా వుంటుంది? .. ఎప్పుడు సెట్స్ పైకి రాబోతోంది? అని గత కొన్ని నెలలుగా అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ప్రాజెక్ట్ కి సంబంధించిన సర్ ప్రైజ్ న్యూస్ తాజాగా బయటికి వచ్చింది. ఈ మూవీని వచ్చే ఏడాది అంటే 2023 జనవరి 26న గ్రాండ్ గా లాంచ్ చేయాలని ఎ÷–లాన్ చేస్తున్నారట. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయట. జనవరి వరకు స్క్రిప్ట్ వర్క్ ని పూరి చేయాలని రాజమౌళి ఎ÷–లాన్ చేస్తున్నారట. ఆఫ్రికా అడవుల నేపథ్యంలో సాగే అడ్వెంచరస్ యాక్షన్ థ్రిల్లర్ గా రూపొందనున్న ఈ మూవీ కోసం స్టార్ రైటర్ విజయేంద్రప్రసాద్ పవర్ ఫుల్ స్క్రిప్ట్ ని అందించారని తెలుస్తోంది. సౌత్ ఆఫ్రికా రచయిత విల్బర్ స్మిత్ నవలల స్ఫూర్తితో మహేష్ మూవీని రాజమౌళి తెరకెక్కించ నున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. పాన్ ఇండియా స్థాయికి మించి ఈ మూవీ వుండే అవకాశం వుందని తెలుస్తోంది.

## పొన్నియన్ సెల్వన్ చిత్రంపై

# భారీగా అంచనాలు

### డిజిటిల్ హక్కులను కొనుగోలు చేసిన అమెజాన్



తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకులు కూడా ఎంతగానో ఎదురు చూస్తున్న చిత్రం 'పొన్నియన్ సెల్వన్–1'. లెజెండరీ డైరెక్టర్ మణిరత్నం ఈ చిత్రానికి దర్శకత్వం వహించాడు. ప్రముఖ రచయిత కల్కి కృష్ణమూర్తి రాసిన 'పొన్నియన్ సెల్వన్' నవల ఆధారంగా మణిరత్నం ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా రూపొందిస్తు న్నాడు. కాగా మొదటి భాగం సెప్టెంబర్ 30న విడుదల కానుంది. ఇప్పటికే చిత్రం నుండి విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలు సినిమాపై మంచి అంచనాలను క్రియేట్ చేయగా.. ఇటీవలే విడుదలైన ట్రైలర్ ఆ అంచనాలను రెట్టింపు చేశాయి. ఇక ఎప్పుడెప్పుడు బిగ్ స్క్రీన్‌పై మణిరత్నం మ్యాజిక్‌ను చూద్దామా అని ప్రేక్షకులతో పాటు సినీ ప్రముఖులు కూడా ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ చిత్రానికి సంబంధించిన ఓ వార్త నెట్టింట వైరల్‌గా మారింది. 'పొన్నియన్ సెల్వన్' చిత్రానికి సంబంధించిన డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ భారీ ధరకు కొనుగోలు చేసిందట. కోలీవుడ్ వర్గాల సమాచారం ప్రకారం పొన్నియన్ సెల్వన్ రెండు పార్ట్‌లకు కలిపి ప్రైమ్ వీడియో సంస్థ సుమారు రూ.125 కోట్లకు కొనుగోలు చేసిందట. ఇంకా మొదటి భాగం విడుదల కాకముందే ఈ స్థాయిలో డిజిటల్ హక్కులు అమ్ముడయ్యాయంటే విశేషం అనే చెప్పాలి. ఇక ఇప్పటికే ఈ సినిమా ఆడియో హక్కులు రూ.20 కోట్లకు అమ్ముడయ్యాయి. రోజు రోజుకు ఈ చిత్రంపై క్రేజ్ పెరుగుతూనే ఉంది. చియాన్ విక్రమ్, కార్తి, జయం రవి, ఐశ్వర్యరాయ్, త్రిష, బాబీ సింహా వంటి స్టార్లు ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి స్వర మాంత్రికుడు ఏ.ఆర్ రెహమాన్ సంగీతం అందించాడు. లైకా ప్రొడక్షన్స్ సంస్థతో కలిసి మద్రాస్ టాకీస్ బ్యానర్‌పై మణిరత్నం స్వీయ నిర్మాణంలో తెరకెక్కించాడు. తమిళంతో పాటు తెలుగు, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.



# నెట్టింట మరీ ఇంత నెగెటివిటీనా..



ఇంటర్నెట్ అందరికీ అందుబాటులోకి వచ్చిన తర్వాత సోషల్ మీడియా వినియోగం బాగా పెరిగిపోయింది. అదే స్థాయిలో నెగెటివిటీ కూడా ఎక్కువైపోయింది. సదుద్దేశంతో ఉపయోగించేవారి కంటే.. దురుద్దేశంతో వాడే వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఒకరిపై ఒకరు విద్వేషాలు రగుల్చుకోడానికి.. ఇతరులను అబ్యూజ్ చేయడానికి ఇప్పుడు ఆన్ లైన్ ను వేదికగా చేసుకుంటున్నారు. ఒక వ్యక్తి కానీ లేదా ఒక వర్గం కానీ తమకు వ్యతిరేకులైతే చాలు.. వ్యక్తిగత దూషణలు – దుష్ప్రచారాలు చేయడం మనం చూస్తున్నాం. నెట్టింట తిట్లకున్న ప్రాధాన్యత చర్చకు ఉండటం లేదు. మంచి కోసం సోషల్ మీడియాను ఉపయోగించేవారి శాతం తక్కువగా ఉంటోంది. తరచుగా సామాజిక వేదికలు వినియోగించే వారికి ఈ విషయం స్పష్టంగా తెలుస్తుంది. ఇటీవల కాలంలో సినీ సెలబ్రిటీల మీద సోషల్ మీడియాలో చాలా ప్రతికూలత కనిపిస్తోందని చెప్పాలి. మనకు నచ్చని హీరో మీద నెగెటివ్ ట్రెండ్ చేయడం లేదా వారు నటించిన సినిమాలను బాయ్ కాట్ చేయాలని పిలుపునివ్వడం వంటివి మనం రోజూ చూస్తూనే ఉంటున్నాం. ఇక ఫ్యాన్ వార్స్ అనేవి మామూలే. ఒకప్పుడు థియేటర్ల వద్ద గొడవ పడే హీరోల అభిమానులు.. ఇప్పుడు ఆన్ లైన్ లో కొట్టుకుంటున్నారు. సోషల్ మీడియాలో ఇతర హీరోలపై అసభ్యకరమైన కామెంట్స్ – అభ్యంతరమైన పోస్టులు పెడుతూ కించపరిచే ప్రయత్నం చేస్తున్నారు. నిన్న ప్రభాస్ ఫ్యాన్స్ – మహేష్ అభిమానులు మరియు బన్నీ ఫ్యాన్స్ సోషల్ మీడియాలో రచ్చ చేశారు. ప్రభాస్ తో హీరోల రిలేషన్ షిప్ విషయంలో గొడవపడ్డారు. రెబల్ స్టార్ కృష్ణంరాజు మరణంపై అల్లు అర్జున్ లేట్ గా స్పందించడం పై ట్రోల్స్ ఎదుర్కొన్నాడు. టాలీవుడ్ సీనియర్ నటుడు మరణిస్తే.. అల్లు అర్జున్ తనకు వచ్చిన సైమా అవార్డ్ గురించి గొప్పగా ట్వీట్ చేయడంపై యాంటీ ఫ్యాన్స్ విమర్శలు చేసారు. ట్రోలింగ్ చేయడం వల్లనే చివరకు ఒక ట్వీట్ పెట్టాడని కామెంట్స్ చేశారు. సైమా అవార్డ్స్ కోసం శనివారం బెంగుళూరు వెళ్లిన బన్నీ.. ఆదివారం కూడా అక్కడే ఉన్నాడు. అయితే కృష్ణంరాజు మరణవార్త తెలుసుకున్న వెంటనే తిరిగి హైదరాబాద్ వచ్చాడు. ఎయిర్ పోర్ట్ నుంచి నేరుగా తన ఇంటికి కూడా వెళ్లకుండా.. నేరుగా కృష్ణంరాజు నివాసానికి వెళ్లి ఆయన పార్థీవదేహానికి నివాళు లర్పించారు. టాలీవుడ్ లో ప్రభాస్ మరియు అల్లు అర్జున్ చాలా మంచి స్నేహితులనే సంగతి తెలిసిందే. ఇప్పుడు పెదనాన్న చనిపోయి బాధలో ఉన్న ప్రభాస్ ను ఓదార్చి.. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు బన్నీ. అంతేకాదు పుట్టెడు దుఃఖంలో ఉన్న తన ఫ్రెండ్ మొహంలో నవ్వు కనిపించేలా చేసాడు. నిజానికి కృష్ణంరాజు కు నిన్న ఆదివారం చాలామంది సినీ ప్రముఖులు నివాళులు అర్పించలేదు. ఇతర కార్యక్రమాల్లో ఉండటం వల్ల కుదరకనో.. ఇతర పనులతో బిజీగా ఉండటం వల్లనో ఈరోజు సోమవారం ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పిస్తున్నారు. అయినా సరే నిన్న రాలేదని ట్రోల్ చేయడం కరెక్ట్ కాదు. అలానే బన్నీ కాస్త లేట్ గా స్పందించారని విమర్శించడం కూడా సమంజసం కాదని అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు.

## టాక్ ఫ్లాప్..
## కానీ బాక్సాపీస్ షేక్! ఇదేం లెక్క?

బాక్సాఫీస్ వద్ద అప్పుడప్పుడు మిరాకిల్స్ చోటు చేసుకుంటాయి. రివ్యూలు సహా పబ్లిక్ టాక్ నెగిటివ్ గా వచ్చినా వసూళ్ల పరంగా రికార్డులు సృష్టించిన ఘనత సినిమాకి సొంతమే. అలా వందల కోట్ల వసూళ్లు సాధించిన భారతీయ చిత్రాలు చాలానే ఉన్నాయి. అప్పట్లో జనతా గ్యారేజ్ చిత్రానికి రివ్యూలు నెగిటివ్ గానే వచ్చాయి. కానీ బాక్సాఫీస్ వసూళ్లు చూసి అంతా ఖంగుతున్నారు. ఇటీవలే రిలీజ్ అయిన బ్రహ్మాస్త్ర మొదటి భాగం విషయంలోనూ అలాంటి మిరాకిల్ చోటు చేసుకుందని ట్రేడ్ అంచనా వేస్తుంది. ఈ సినిమా నాలుగు రోజుల్లోనే 200 కోట్ల వసూళ్లని సాధించినట్లు వికిపీడియా సమాచారం బట్టి తెలుస్తోంది. ఈ సినిమాకి రివ్యూలు సహా పబ్లిక్ టాక్ నెగిటివ్ గానే ఉంది. కానీ వసూళ్ల పరంగా మూడు రోజుల్లో 200 కోట్ల క్లబ్ లో చేరడం అంటే ఆషామాషీ కాదు. ఆ రకంగా బ్రహ్మాస్త్ర రిలీజ్ తర్వాతా వార్తల్లో నిలిచింది. ఈ సందర్భంగా కొన్ని బాలీవుడ్ మిరాకిల్స్ గురించి చూస్తే ఆసక్తికర విషయాలు తెలుస్తున్నాయి. సల్మాన్ ఖాన్..సోనమ్ కపూర్ జంటగా నటించిన రొమాంటిక్ ఎంటర్ టైనర్ %--%ప్రేమ్ రతన్ ధన్ పాయో%--% కి నెగిటి టాక్ వచ్చినా బాక్సాఫీస్ వద్ద 207 కోట్ల వసూళ్లని సాధించింది. 120 కోట్ల బడ్జెట్ తో తెరకెక్కిన ఈ సినిమాకి తొలి షోతోనే డిజాస్టర్ టాక్ వచ్చినా ఈ రేంజ్ లో వసూళు సాధించిందంటే? కమర్శియల్ గా సినిమా సక్సెస్ అయిందనే తెలుస్తోంది. అలాగే అక్షయ్ కుమార్..అభిషేక్ బచ్చన్..రితేష్ దేశ్ ముఖ్ నటించిన %--%హౌస్ ఫుల్ -3%--% కూడా తొలి షోతోనే ఫ్లాప్ రికార్డుల్లోకి ఎక్కేసింది. కానీ 85 కోట్లతో తెరకెక్కిన సినిమా బాక్సాఫీస్ వద్ద 110 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. అజయ్ దేవగణ్..సోనమ్ కపూర్ నటించిన %--%సన్ ఆఫ్ సర్దార్%--% సైతం నెగిటివ్ రివ్యూలతో మూటగట్టుకుంది. 30 కోట్ల బడ్జెట్ తో నిర్మాణం జరిగిన సినిమా 100 కోట్ల క్లబ్ లో చేరిన చిత్రంగా నిలిచింది.




అలాగే వరుణ్ ధావన్...జాక్వెలిన్ పెర్నాండేజ్.. తాప్సీ నటించిన రొమాంటిక్ ఎంటర్ టైనర్ %--%జుడ్వా-2%--% కూడా విమర్శకులు ఏకేసిన చిత్రంగా నిలిచింది. కానీ 65 కోట్ల బడ్జెట్ సినిమా 140 కోట్లకు పైగా వసూళు తెచ్చింది. బ్రహ్మాస్త్ర మొదటి భాగానికి 400 కోట్ల బడ్జెట్ తో నిర్మించారు. ఇప్పటివరకూ బాక్సాఫీస్ లెక్క అనధికారికంగా 200 కోట్లు కనిపిస్తుంది. ఇది నిజమైతే సంచలనమే. ఇటీవల కాలంలో ఏ బాలీవుడ్ సినిమా ఈ రేంజ్ లో వసూళ్లు సాధించింది లేదు. ఆ లెక్కలో దీన్ని గొప్ప చిత్రంగా భావించినా పెట్టుబడి రాని చిత్రంగా చెప్పాలి.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092.